SAMAYAM

epaper.samayamdaily.net APTEL/2006/18267

# సమయం

మన గొంతుక.. మన పత్రిక · తెలుగు దినపత్రిక



సమయం
విలేకరులు కావలెను
ఫోన్ నెం : 99483 13985/ 89789 80131



సంపుటి: 26 | సంచిక: 163 | ఎడిటర్ : విక్రం కుమార్ | శనివారం 18 ఏప్రిల్ 2026 | ప్రచురణ : హైదరాబాద్ | పేజీలు: 14 | వెల:రూ.10 |


# కూటమిలో రాజ్యసభ రేసు

- ఊహించని పేర్లు తెరపైకి!
- నాలుగు స్థానాల కోసం అభ్యర్థుల వేట..
- టీడీపీ, బీజేపీ, జనసేనల్లో ఉత్కంఠ
- సానా సతీష్ బాబుకు రెండో ఛాన్స్?
- కృష్ణ ఎల్లా ఎంట్రీతో మారిన లెక్కలు
- ముస్లిం కోటాలో షరీఫ్.. జనసేన నుంచి విశ్వప్రసాద్ పేరు హల్‌చల్
- ఢిల్లీలో చక్రం తిప్పేదెవరు?
- ఆశావహుల్లో మొదలైన టెన్షన్

5



ఆంధ్రప్రదేశ్‌లో ఖాళీ అవుతున్న 4 రాజ్యసభ స్థానాలకు సంబంధించి కూటమి పార్టీల్లో కసరత్తు ముమ్మరమైంది. సంఖ్యాబలం దృష్ట్యా ఈ నాలుగు స్థానాలు కూటమికే దక్కడం ఖాయం కావడంతో, ఆశావహుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. సీట్ల సర్దుబాటు విషయంలో టీడీపీ మూడు స్థానాలపై పట్టుబడుతుండగా, బీజేపీ మరియు జనసేన తమ కోటా కోసం పట్టు వీడటం లేదు. టీడీపీ కోటాలో ప్రస్తుత సభ్యుడు సానా సతీష్ బాబుకు రెండోసారి అవకాశం దక్కుతుందనే ప్రచారం బలంగా సాగుతోంది. ఒకవేళ ఆయనకు అవకాశం ఇవ్వని పక్షంలో ఢిల్లీలో పార్టీకి సంబంధించిన కీలక బాధ్యతలు అప్పగించే యోచనలో అధిష్ఠానం ఉంది. మరోవైపు, భారత్ బయోటెక్ ఎండీ కృష్ణ ఎల్లా పేరు తెరపైకి రావడం ఆసక్తికరంగా మారింది.



# మహిళా బిల్లుకు బ్రేక్

## కేంద్రానికి భారీ షాక్



## రాజ్యాంగంపై కుట్రను అడ్డుకున్నాం

- ఇది ముమ్మాటికీ మహిళా బిల్లు కాదు
- మహిళా రిజర్వేషన్ చట్టాన్ని తెస్తే మద్దతిస్తాం
- లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ

3

- 131వ రాజ్యాంగ సవరణ బిల్లుకు దక్కని ఆమోదం
- అనుకూలంగా 278.. వ్యతిరేకంగా 211 ఓట్లు
- రాజ్యాంగ సవరణకు అవసరమైన మద్దతు కరవు
- ఐక్యతను చాటుకున్న విపక్ష ఇండి కూటమి
- మోడీ పిలుపు నిష్ఫలం

మహిళా రిజర్వేషన్‌కు సంబంధించి రాజ్యాంగ సవరణ బిల్లు వీగిపోయింది. కేంద్రం ప్రతిష్ఠాత్మకంగా తీసుకొచ్చిన 131వ రాజ్యాంగ సవరణ బిల్లు లోక్‌సభలో వీగిపోయింది. లోక్‌సభలో సుదర్ఘ చర్చ అనంతరం బిల్లుపై జరిగిన ఓటింగ్‌లో మొడొంతుల మెజార్టీని సాధించలేక పోయింది. ఈ బిల్లుతో ముడిపడిన మూడు బిల్లులపై సుదీర్ఘ చర్చ అనంతరం శుక్రవారం సాయంత్రం ఓటింగ్ జరిగింది. 131వ రాజ్యాంగ సవరణ, డీలిమిటేషన్, కేంద్ర పాలిత ప్రాంతాల చట్ట సవరణ బిల్లులపై ఈ ఓటింగ్ జరిగింది.

వివరాలు 3వ పేజీలో



రాహుల్ గాంధీ

## ద్వంద్వ పౌరసత్వం

బ్రిటన్ పౌరసత్వం ఉన్నట్లు ఆరోపణలు

విచారణకు ఆదేశించిన అలహాబాద్ హైకోర్టు

.. వివరాలు 2లో



2

## తేజస్వీ మాటల్లో తప్పేముంది

బీజేపీ వల్లే తెలంగాణ సిద్ధించింది

పొన్నం వ్యాఖ్యలపై బండి మండిపాటు



## మత్స్యకారుల పేరుతో రాజకీయాలా?

- జగన్‌పై అచ్చెన్నాయుడు తీవ్ర విమర్శలు
- "కేంద్ర నిధులు దారి మళ్లింపు" ఆరోపణలు
- రూ.3,328 కోట్లతో హార్బర్ల అభివృద్ధి
- మత్స్యకారులకు అండగా కూటమి ప్రభుత్వం

5

ప్రజలను అప్పుడు

## ఎందుకు కలువలేదు



ఇప్పుడే పాదయాత్ర చేయాలని ఎందుకనో

కేటీఆర్‌పై విమర్శలు గుప్పించిన కవిత

ప్రజాసమస్యలు పరిష్కరించే వరకు ప్రభుత్వాన్ని నిదీస్తాం

జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత

.. వివరాలు 2లో

# నారీ శక్తికి పట్టాభిషేకం

పార్లమెంటులో ఏపీ మహిళా ప్రతినిధుల సందడి

మహిళా రిజర్వేషన్ల బిల్లుపై సాగిన చారిత్రక చర్చ

మహిళా ప్రతినిధులతో రామ్మోహన్ భేటీ

దేశాభివృద్ధిలో మహిళలు భాగస్వాములు కావాలని ఆకాంక్ష

5



3

# జాతీయ విపత్తును నివారించాం

రాహుల్, ఖర్గే నేతృత్వంలో ఐక్యత చాటాం..

ఇవాళ దేశ చరిత్రలో సువర్ణదినం

మహిళా బిల్లు పతనంపై 'ఎక్స్' వేదికగా సీఎం రేవంత్ రెడ్డి హర్షం..



2

## 30లక్షలకు పైగా ధాన్యం సేకరణ చేపట్టండి

కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషికి సీఎం రేవంత్ వినతి

## రేవంత్‌ది ఓవైసీ ఫార్ములా

మండిపడ్డ కిషన్ రెడ్డి



.. వివరాలు 3లో

## విమానాశ్రయ పరిధిలో నాయిస్ జోన్ ఎత్తివేత

2

నిబంధనలు సడలించిన ప్రభుత్వం

రియల్ రంగానికి జీఓ 168 ఊతం





# విద్యుత్ ఆర్టిజన్ల సమ్మె విరమణ!

**డిప్యూటీ సీఎం చొరవతో చర్చలకు గ్రీన్ సిగ్నల్..**

**సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సానుకూలం..**

**హైదరాబాద్, ఏప్రిల్ 17:** ట్రాన్స్కో సీఎండితో మా సమస్యలపై చర్చించేందుకు డిప్యూటీ సీఎం ఆదేశించిన నేపథ్యంలో వెంటనే సమ్మె విరమించాలని నిర్ణయించినట్టు ఆర్టిజన్ల జేఏసీ చైర్మన్ సతీష్ రెడ్డి ప్రకటించారు. శుక్రవారం ఉదయం హైదరాబాదులోని ప్రజాభవన్‌లో ఆర్టిజన్ల జేఏసీ నాయకులు డిప్యూటీ సీఎంతో సమావేశమయ్యారు. తమ సమస్యల పట్ల సానుకూలంగా స్పందించి ఉన్నతాధికారులతో చర్చలకు అనుమతించిన డిప్యూటీ సీఎంకు మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్టు ఆర్టిజన్ల జేఏసీ కన్వీనర్ సాయిలు ప్రకటించారు. ఉద్యోగులు ప్రజలను మెప్పించే పనులు చేయాలి, సమ్మెపై బ్యాన్ ఉన్నదని తెలిసి, వేసవిలో విద్యుత్తు డిమాండ్ పీక్ స్థాయిలో ఉంటుంది ఈ సమయంలో అకస్మాత్తుగా సమ్మెకు వెళ్లడం సరైనది కాదని డిప్యూటీ సీఎం తెలిపారు. చర్చల ద్వారానే సమస్యల పరిష్కారం జరుగుతుందని డిప్యూటీ సీఎం ఈ సందర్భంగా తెలిపారు. ఆర్టిజన్ల సమస్యలపై మానవీయ కోణంలో ప్రజా ప్రభుత్వం ఆలోచన చేస్తుందని తెలిపారు. విద్యుత్ సంఘాల నేతలు ఎప్పుడు వచ్చినా ప్రభుత్వం చర్చలు చేస్తుంది, వారి సమస్యలను పరిష్కరిస్తూ ముందుకు పోతుందని జేఏసీ నాయకులకు డిప్యూటీ సీఎం గుర్తు చేశారు. ఆర్థిక భారం లేకుండా మానవీయ కోణంలో పరిష్కరించగలిగే సమస్యలపై ఆర్టిజన్ల జేఏసీతో ట్రాన్స్కో సిఎండి చర్చలు జరుపుతారు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారని డిప్యూటీ సీఎం ఈ సందర్భంగా తెలిపారు. చర్చల్లో ట్రాన్స్కో సీఎండి కృష్ణ భాస్కర్, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, ఆర్టిజన్ల కో చైర్మన్లు చంద్రారెడ్డి, శ్రీధర్ గౌడ్, చందర్ సింగ్ ఠాకూర్, వైస్ చైర్మన్ సంతోష్, కోశాధికారి ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

# కాళేశ్వరం ప్రాజెక్ట్ పునరుద్ధరణ

**బ్యారేజీల పునరుద్ధరణకు కమిటీ ఏర్పాటు**

**హైదరాబాద్, ఏప్రిల్ 17:** కాళేశ్వరం ప్రాజెక్ట్ రిపేర్‌పై తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం బ్యారేజీల పునరుద్ధరణకు కమిటీ ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు అనీ. పరిచిత్ మెహ్రా ఆధ్వర్యంలో కమిటీ ఏర్పాటు చేసింది. ఇంజినీర్లు, నిపుణులతో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసింది. మూడు బ్యారేజీల మరమ్మతులకు సమన్వయ కమిటీ ఏర్పాటు చేసింది. కాళేశ్వరం ప్రాజెక్ట్ రిపేర్ పనులు వేగవంతం చేసేందుకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. రుతుపవనాలకు ముందే జియో టెక్నికల్ పరిశీలనలు పూర్తి చేయాలని తెలంగాణ సర్కార్ సూచించింది. మే 30వ తేదీలోగా పరిశీలనలు పూర్తిచేయాలని డెడ్‌లైన్ విధించింది. రోజువారీ పురోగతి నివేదికలు సమర్పించాలని ఆదేశాలు జారీ చేసింది. ప్రతిరోజూ సాయంత్రం 5 గంటలకు రిపోర్ట్ ఇవ్వాలని ఆదేశించింది. సీడబ్ల్యూసీ ఎన్డీఎస్ఏ అనుమతులతో పనులు, డిజైనింగ్ పునరుద్ధరణ పనులకు ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించింది. రోజువారీ యాక్షన్ ప్లాన్‌తో పనులు చేపట్టాలని తెలంగాణ ప్రభుత్వం సంబంధిత అధికారులను ఆదేశించింది.

# శాస్త్రిపురం ఫ్లైఓవర్ ప్రారంభం

**ప్రారంభించిన మంత్రి శ్రీధర్ బాబు**

**హైదరాబాద్, ఏప్రిల్ 17:** హైదరాబాద్ నగర అభివృద్ధిలో కీలక అడుగుపడింది. నగరంలో మరో ఆర్‌వోబీ ప్రజలకు అందుబాటులోకి వచ్చింది. శుక్రవారం శాస్త్రిపురం రైల్వే ఓవర్ బ్రిడ్జ్‌ను మంత్రి శ్రీధర్ బాబు ప్రారంభించారు. ఈ ఫ్లై ఓవర్ నిర్మాణానికి జీహెచ్ఎంసీ 71 కోట్ల రూపాయలు ఖర్చు చేసింది. సుమారు 490 మీటర్ల పొడవుతో, నాలుగు లైన్లలో ఫ్లై ఓవర్ జీహెచ్ఎంసీ నిర్మించింది. జీహెచ్ఎంసీ, సౌత్ సెంట్రల్ రైల్వేల సమన్వయంతో ఈ ప్రాజెక్ట్‌ను చేపట్టారు. శాస్త్రిపురం ఫ్లై ఓవర్ అందుబాటులోకి రావడంతో మైలార్ దేవ్‌పల్లి నుంచి ఫలక్‌నుమా మార్గంలో ప్రయాణం సులభతరం అయింది. ఉద్దమ్‌గడ్డ రైల్వే లెవల్ క్రాసింగ్ వద్ద ఏర్పడే ట్రాఫిక్ జామ్‌కు చెక్ పడనుంది. ప్రయాణ సమయం కూడా చాలా వరకు తగ్గనుంది. ఈ ÷÷-లఓల్గ÷వర్ ద్వారా మైలార్‌దేవ్‌పల్లి, వట్టెపల్లి, ఫలక్‌నుమా, ఆర్టీసీ బస్ డిపో ప్రాంతాల మధ్య కనెక్టివిటీ మెరుగుపడింది.

# విమానాశ్రయ పరిధిలో నాయిస్ జోన్ ఎత్తివేత

**నిబంధనలు సడలించిన తెలంగాణ ప్రభుత్వం**

**రియల్ రంగానికి ఊతమివ్వనున్న జీఓ 168**

**హైదరాబాద్, ఏప్రిల్ 17:** విమానాశ్రయాల పరిసర ప్రాంతాల్లో భవన నిర్మాణాలపై అమల్లో ఉన్న నాయిస్ జోన్ ఆంక్షలను సడలిస్తూ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. తెలంగాణ బిల్డింగ్ రూల్స్-2012లో మార్పులు చేస్తూ జీఓఎంఎస్ నంబర్ 168 ద్వారా కొత్త మార్గదర్శకాలను విడుదల చేసింది. విమానాల రాకపోకల వల్ల ఏర్పడే శబ్ద కాలుష్యాన్ని దృష్టిలో ఉంచుకుని గతంలో కఠిన నిబంధనలు అమల్లో ఉండేవి. అయితే పట్టణాభివృద్ధి వేగం, ప్రజల అవసరాలను పరిగణలోకి తీసుకుని ప్రభుత్వం ఈ నియమాలలో సవరణలు చేసింది. ముఖ్యంగా రాజీవ్‌గాంధీ ఇంటర్నేషనల్‌ఎయిర్‌పోర్టు పరిసర ప్రాంతాల్లో నిర్మాణాలపై ఉన్న పరిమితులను కొంతవరకు తొలగించింది. కొత్త మార్గదర్శకాల ప్రకారం, నాయిస్ జోన్ పరిధిలో భవనాల ఎత్తు, నిర్మాణ రకాలకు సంబంధించిన కొన్ని ఆంక్షలను సడలించారు. అయితే నివాసితులకు ఇబ్బంది కలగకుండా ధ్వని నిరోధక ప్రమాణాలను పాటించడం తప్పనిసరిగా ఉండనుంది. ఈ నిర్ణయం వల్ల శంషాబాద్, పరిసర ప్రాంతాల్లో రియల్ ఎస్టేట్ రంగానికి గణనీయమైన ఊతం లభించనుందని నిపుణులు భావిస్తున్నారు. భూముల విలువలు పెరగడంతో పాటు, కొత్త వెంచర్లు, బహుళ అంతస్తుల భవనాల నిర్మాణానికి మార్గం సుగమం కానుంది. అదేవిధంగా నిర్మాణ అనుమతుల ప్రక్రియలో స్పష్టత పెరగడంతో మున్సిపల్ అధికారుల వద్ద ప్లాన్ అప్రూవల్స్ త్వరగా లభించే అవకాశముంది. గతంలో నాయిస్ జోన్ కారణంగా ఎదురైన సాంకేతిక ఇబ్బందులు తాజా సవరణలతో తగ్గనున్నాయి. పట్టణీకరణ వేగంగా జరుగుతున్న నేపథ్యంలో, అభివృద్ధి మరియు భద్రత మధ్య సమతౌల్యం సాధించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం తెలిపింది. భవన యజమానులు, డెవలపర్లు కొత్త నిబంధనలకు అనుగుణంగా తమ ప్రణాళికలను రూపొందించుకోవాలని అధికారులు సూచించారు.

# 30లక్షలకు పైగా ధాన్యం సేకరణ చేపట్టండి

**కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషికి సీఎం రేవంత్ వినతి**



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 17:** 2025-26 వానాకాలం, యాసంగి సీజన్లకు సంబంధించి 30 లక్షల మెట్రిక్ టన్నుల పార్ బాయిల్డ్ ధ్యానం సేకరించాలని కేంద్రమంత్రికి సిఎం రేవంత్, మంతంరి ఉత్తమ్ విజ్ఞప్తి చేశారు. అలాగే యాసంగి పంట 90 లక్షల మెట్రిక్ టన్నులు వస్తుందని కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషికి సీఎం రేవంత్ వివరించారు. ఈ ధాన్యం మెుత్తం కొనుగోలు చేసి తెలంగాణ రైతాంగానికి అండగా నిలవాలని కోరారు. కేంద్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషితో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి భేటీ అయ్యారు. కేంద్ర పౌరసరఫరాల శాఖ నుంచి రాష్ట్రానికి రావాల్సిన పెండింగ్ నిధులు, ఇతర అంశాలపై చర్చించారు. కేంద్ర మంత్రితో భేటీ అనంతరం మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ..'దేశంలోనే అత్యధికంగా తెలంగాణలో వరిధాన్యం ఉత్పత్తి జరుగుతోంది. ఈ రబీ సీజన్‌లో 90 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం రైతుల నుంచి కొనుగోలు చేయబోతున్నాం. వరి ధాన్యం రైతుల నుంచి కొనుగోలు చేసిన 48 గంటల్లోనే మద్దతు ధర డబ్బులు వారి ఖాతాల్లో వేస్తున్నాం. ఈ రబీ సీజన్‌లో 30 లక్షల మెట్రిక్ టన్నుల బాయిల్డ్ రైస్ కేంద్ర ప్రభుత్వం ఎఫ్‌సీఐ ద్వారా తీసుకోవాలని కేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేశాం. కేంద్రం నుంచి తెలంగాణకు రూ.1,400 కోట్లు రావాల్సి ఉంది. పదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఆ నిధులను విడుదల చేయాలని కోరాం. కేంద్రం పోషకాహార పంపిణీ పథకాన్ని రద్దు చేసింది. ఇది సరైన విధానం కాదు' అని తెలిపారు. ఢిల్లీలో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి పర్యటన బిజీబిజీగా సాగుతోంది. డీలిమిటేషన్‌పై హైబ్రిడ్ మోడల్‌కు మద్దతు కూడగట్టేందుకు ఆయన ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ మేరకు దక్షిణాది రాష్ట్రాల వాదనను జాతీయస్థాయిలో వినిపించేందుకు కృషి చేస్తున్నారు. ప్రోరేటాకు వ్యతిరేకంగా దక్షిణాది ముఖ్యమంత్రులను రేవంత్ సమన్వయం చేస్తున్నారు. అదే సమయంలో పలువురు కేంద్రమంత్రులను రేవంత్ రెడ్డి కలుస్తున్నారు. తెలంగాణకు రావాల్సిన నిధులు, పథకాలపై చర్చిస్తున్నారు.

# కాళేశ్వరంపై ఎలాంటి దురుద్దేశం లేదు

- ఎన్డీఎస్ఏ చైర్మన్ జైన్‌తో చర్చించాం
- వానాకాలం లోగానే సాయిల్ టెస్టింగ్ పూర్తి
- 20న మేడిగడ్డను రేవంత్ పరిశీలిస్తారు
- నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 17:** కాళేశ్వరం ప్రాజెక్టుపై సీఎం రేవంత్‌రెడ్డికి, తమ ప్రభుత్వానికి ఎలాంటి దురుద్దేశం లేదని తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఈనెల 20వ తేదీన సీఎం రేవంత్‌రెడ్డితో కలిసి మేడిగడ్డ బ్యారేజ్‌ను పరిశీలిస్తామని పేర్కొన్నారు. శుక్రవారం ఢిల్లీలో మంత్రి ఉత్తమ్ మీడియాతో మాట్లాడారు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ చైర్మన్ అనిల్ జైన్‌తో కాళేశ్వరం ప్రాజెక్టు, మేడిగడ్డ బ్యారేజ్ మరమ్మతులు, పునరుద్ధరణపై చర్చించామని తెలిపారు. గోదావరి వరదలు వచ్చేలోగా సాయిల్ టెస్టింగ్, డిజైన్లు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వివరించారు. కాళేశ్వరం ప్రాజెక్టు విషయంపై కేసీఆర్ హయాంలో చేసిన పొరపాటు తెలంగాణ ప్రజలకు తెలుసునని చెప్పుకొచ్చారు. బీఆర్ఎస్ హయాంలో కాళేశ్వరాన్ని నిర్మించారని, అది కూలిపోయిందని అన్నారు. కాళేశ్వరంపై దాదాపు రూ.97 వేల కోట్ల ప్రజాధనాన్ని ఖర్చు చేసి ఆ ప్రాజెక్టు నిర్మించారని తెలిపారు. కాళేశ్వరంపై ప్రతి ఏడాది రూ.10వేల కోట్ల వడ్డీ కడుతున్నామని తెలిపారు. ప్రజాధనం ఉపయోగించడంతోనే దాన్ని ఎలా రిపేర్ చేయాలో ఆలోచించి ముందుకు వెళ్తున్నామని స్పష్టం చేశారు. తెలంగాణ ప్రజలు అన్నీ విషయాలు గమనిస్తున్నారని అన్నారు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ మార్గదర్శకాలకు అనుగుణంగా ముందుకు వెళ్తున్నామని చెప్పుకొచ్చారు. మేడిగడ్డ డ్యామేజ్ సాయిల్ టెస్ట్, డిజైన్ల ఖర్చులను కాంట్రాక్ట్ సంస్థలే భరిస్తాయని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.

# పదేళ్లు అధికారంలో ప్రజలను ఎందుకు కలవలేదు

- ఇప్పుడే పాదయాత్ర చేయాలని ఎందుకనో
- కేటీఆర్‌పై విమర్శలు గుప్పించిన కవిత
- ప్రజాసమస్యలు పరిష్కరించే వరకు ప్రభుత్వాన్ని నిదీస్తాం
- జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత



**హైదరాబాద్, ఏప్రిల్ 17:** పదేళ్లు బీఆర్ఎస్ అధికారంలో ఉందని.. పాదయాత్ర చేస్తానని మాజీ మంత్రి కేటీఆర్ ఇప్పుడు ఎందుకు అంటున్నారని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ప్రశ్నించారు. పదేళ్లు అధికారంలో ఉండి ఆయన ఎందుకు ప్రజల్లోకి పోలేదని నిలదీశారు. ప్రజా సమస్యలను పరిష్కరించేది అధికార పార్టీనేనని.. అందుకే కాంగ్రెస్‌ను టార్గెట్ చేశానని కవిత తెలిపారు. ఆయా సమస్యల ఆధారంగా బీఆర్ఎస్‌పైన కూడా మాట్లాడుతానని అన్నారు. పరిగిలో రైతు దీక్షకు మద్దతు ఇచ్చేందుకు వెళ్తున్నానని చెప్పి.. హరీశ్‌రావు హౌస్ అరెస్ట్ అయ్యారని తెలిపారు. ఆ సమయంలో హరీశ్‌రావు ఫోన్ చేస్తే పోలీసులు ఆయన ఇంటికి వచ్చి హౌస్ అరెస్ట్ చేశారని విమర్శించారు. హరీశ్‌రావు పరిగిదాకా కూడా పోలేదని ఎద్దేవా చేశారు. తాము పరిగి వెళ్లి రైతులకు మద్దతుగా దీక్షలో పాల్గొన్నామని స్పష్టం చేశారు. పోలీసులు తమను అరెస్టు చేశారని.. రైతులకు మద్దతుగా తాము నిలిచామని తెలిపారు. ఖమ్మం జిల్లా వెలుగుమట్లలో ఏ విధంగానైతే పోరాటం చేశామో...అదే విధంగా పరిగిలో కూడా పోరాటం చేశానని వెల్లడించారు. భవిష్యత్తులో కూడా పోరాటం చేస్తానని కవిత పేర్కొన్నారు. తెలంగాణలో అన్నివర్గాలకు అధికారం రావాలన్నదే తన ధ్యేయమని వ్యాఖ్యానించారు. అందరికీ అధికారమని మాట్లాడుతారని.. దీనిని ఆచరణలోకి తీసుకురావాలని తాను ప్రారంభించాకే తనకు కష్టాలు వచ్చాయని పేర్కొన్నారు. తెలంగాణ జాగృతి పెట్టబోయే పార్టీకి మారోజు వీరన్న అనుచరులు, సీపీయూఎస్ఐ, దళిత బహుజన రాజ్యాధికార సంస్థ మద్దతు ఇచ్చారని తెలిపారు. శుక్రవారం జాగృతి కార్యాలయంలో కవితను పలువురు కలిశారు. ఆమెను కలిసిన వారిలో సీపీయూఎస్ఐ కేంద్ర కమిటీ కార్యదర్శి కోదండం, రాష్ట్ర కార్యదర్శి వెంకన్న, దళిత బహుజన రాజ్యాధికార కన్వీనర్ గుడిపల్లి రవన్న, మారోజు వీరన్న సహచరులు కిషన్ నాయక్ సహా పలువురు నాయకులు ఉన్నారు. ఈసమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడారు. ప్రతి కష్టాన్ని పాఠంగా భావిస్తూ.. సామాజిక తెలంగాణ సాధించే వరకు పోరాటం చేస్తానని కవిత స్పష్టం చేశారు. సర్వోదయ తెలంగాణ తన లక్ష్యమని.. అందరి జీవితాల్లో వెలుగులు నిండాలని ఆకాంక్షించారు. మారోజు వీరన్న అనుచరుల మద్దతు ఎంతో శక్తిని ఇస్తుందని అన్నారు. తమతో మారోజు వీరన్న అనుచరులు కలవటమంటే ఇక తమను ఆపే శక్తే లేదని పేర్కొన్నారు. ఏదైనా శని ఉంటే.. అది తొలగిపోవడం కోసమే తాను వారణాసి వెళ్లి పూజలు చేశానని ప్రస్తావించారు. తాను పెట్టే పార్టీ సక్సెస్ కావాలని కోరుకున్నానని తెలిపారు. బీఆర్ఎస్‌కు చెందిన కొందరు మాజీ ఎమ్మెల్యేలు తనను కలిశారని.. పేర్లు మాత్రం తాను బయటకు చెప్పనని అన్నారు. ప్రజా సమస్యలపై బీఆర్ఎస్‌ను ముందుగా టార్గెట్ చేశానని తెలిపారు. తనను ఆ పార్టీ సస్పెండ్ చేసిందని కవిత ప్రస్తావించారు.

# తాళం వేసిన ఇంట్లో గుర్తు తెలియని శవం

**మూడు నెలలుగా పడివుండడంతో కుళ్లిన దేహం**

**స్వాధీనం చేసుకుని దర్యాప్తు చేపట్టిన పోలీసులు**

హైదరాబాద్, ఏప్రిల్ 17: హైదరాబాద్‌లోని నేరేడ్‌మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో అత్యంత విషాదకరమైన ఘటన వెలుగులోకి వచ్చింది. జేకే కాలనీలోని ఓ ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభించడం స్థానికంగా పెను సంచలనం సృష్టించింది. మూడు నెలలుగా తాళం వేసి ఉన్న ఇంట్లో శవం దొరకడం అనేక అనుమానాలకు తావిస్తోంది. జేకేకాలనీలోని ఓ ఇంట్లో గతంలో ఒక వ్యక్తి అద్దెకు ఉండేవారు. అయితే, గత 3నెలలుగా ఆ ఇంటికి తాళం వేసి ఉంది. అద్దెదారు కనిపించకపోవడం, కనీసం ఇంటి యజమానికి అద్దె కూడా చెల్లించకపోవడంతో యజమానికి అనుమానం వచ్చింది. ఇంటి యజమాని వచ్చి తాళం విరగ్గొట్టి లోపలికి వెళ్లి చూడగా, ఇల్లు మొత్తం దుర్వాసనతో నిండిపోయింది. లోపలికి వెళ్లి వెతకగా, వంటగదిలోని కిచెన్‌లో కింద గుర్తు తెలియని వ్యక్తి శవం కనిపించింది. సమాచారం అందుకున్న వెంటనే నేరేడ్‌మెట్ పోలీసులు క్లూస్ టీమ్‌తో కలిసి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహం పూర్తిగా కుళ్లిపోయి ఉండటంతో, అది పురుషుడిదా లేక మహిళదా అనేది కూడా ప్రాథమికంగా గుర్తించలేనంత దారుణంగా ఉంది. శవం కిచెన్ బండ కింద ఉంచడాన్ని చూస్తే, ఇది ఓ పక్కా ప్లాన్ ప్రకారం జరిగిన హత్య అయి ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. ఎవరైనా చంపి అక్కడ దాచిపెట్టారా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. గతంలో ఆ ఇంట్లో నివసించిన వ్యక్తి ఎవరు?, అతను ప్రస్తుతం ఎక్కడ ఉన్నారు? అనే వివరాలను పోలీసులు సేకరిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. కాలనీలో ఉన్న సీసీటీవీ కెమెరాలను పోలీసులు పరిశీలిస్తున్నారు. గత మూడు నెలల్లో ఆ ఇంటికి ఎవరెవరు వచ్చారనే అంశంపై పోలీసులు ఆరా తీస్తున్నారు. జనసంచారం ఉండే కాలనీలో, అది కూడా మూడు నెలల పాటు ఇంట్లో శవం ఉండటం స్థానికులను తీవ్ర భయాందోళనలకు గురిచేస్తోంది.

# రాహుల్ గాంధీ ద్వంద్వ పౌరసత్వం

**బ్రిటన్ పౌరసత్వం కలిగి ఉన్నట్లు ఆరోపణలు**

**విచారణకు ఆదేశించిన అలహాబాద్ హైకోర్టు**



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 17:** ద్వంద్వ పౌరసత్వం ఆరోపణలకు సంబంధించి లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీపై కేసు నమోదు చేయాలని అలహాబాద్ హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. దీనిపై విచారణ జరపాలని అక్కడి లఖ్‌నవూ బెంచ్ ఉత్తర్వులిచ్చింది. ఈ కేసు దర్యాప్తును ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వమే స్వయంగా నిర్వహించాలని లేదంటే.. ఒక కేంద్ర దర్యాప్తు సంస్థకు అప్పగించాలని పేర్కొంది. రాహుల్ గాంధీ పౌరసత్వం అంశంపై కొన్నేళ్లుగా వివాదం నలుగుతూనే ఉంది. రాహుల్ గాంధీ బ్రిటన్ పౌరుడని, భారత పౌరసత్వాన్ని రద్దు చేయాలంటూ భాజపా నేత సుబ్రహ్మణ్య స్వామి, కర్ణాటకకు చెందిన భాజపా కార్యకర్త విఘ్నేశ్ శిశిర్ డిమాండ్ చేస్తున్నారు. బ్రిటన్‌లో నమోదైన ఓ కంపెనీకి రాహుల్ గాంధీ డైరెక్టర్, సెక్రటరీగా ఉన్నారని సుబ్రహ్మణ్య స్వామి కొంతకాలంగా చెబుతున్నారు. ఆ కంపెనీ వార్షిక నివేదికలో తనను తాను బ్రిటిష్ పౌరుడిగా రాహుల్ గాంధీ పేర్కొన్నట్లు స్వామి తెలిపారు. వేరే దేశంలో పౌరుడిగా ఉన్న వ్యక్తి ఆ దేశ పౌరసత్వాన్ని స్వచ్ఛందంగా వదులుకోవాల్సి ఉంటుందన్నారు. అలా చేయకపోవడం రాజ్యాంగంలోని ఆర్టికల్ 9, భారతీయ పౌరసత్వ చట్టం, 1955ని ఉల్లంఘించడమే అవుతుందని పేర్కొన్నారు. ఇదే అంశంపై గతంలో కేంద్రానికి కూడా లేఖ రాశారు. మరోవైపు, రాహుల్ గాంధీ పౌరసత్వానికి సంబంధించిన రికార్డులు ఉన్నాయని విఘ్నేశ్ చెబుతున్నారు. ఈ క్రమంలోనే న్యాయస్థానాలను ఆశ్రయించారు. పౌరసత్వానికి సంబంధించిన అంశాలపై నిర్ణయం తీసుకునే అధికారం తనకు లేదంటూ లఖ్‌నవూలోని ప్రత్యేక ఎంపీ/ఎమ్మెల్యే కోర్టు గతంలో శిశిర్ పిటిషన్‌ను తోసిపుచ్చింది. దాంతో అతడు అలహాబాద్ హైకోర్టును ఆశ్రయించారు. ఈ క్రమంలోనే తాజా ఆదేశాలు వెలువడ్డాయి.

# బిల్లుకు బ్రేక్.. కేంద్రానికి షాక్

- వీగిన మహిళా రిజర్వేషన్ బిల్లు
- 131వ రాజ్యాంగ సవరణ బిల్లుకు దక్కని ఆమోదం
- అనుకూలంగా 278.. వ్యతిరేకంగా 211 ఓట్లు
- రాజ్యాంగ సవరణకు అవసరమైన మద్దతు కరవు
- ఐక్యతను చాటుకున్న విపక్ష ఇండి కూటమి
- ప్రధాని మోడీ పిలుపు నిష్ఫలం



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 17:** మహిళా రిజర్వేషన్‌కు సంబంధించి రాజ్యాంగ సవరణ బిల్లు వీగిపోయింది. కేంద్రం ప్రతిష్మాత్మకంగా తీసుకొచ్చిన 131వ రాజ్యాంగ సవరణ బిల్లు లోక్‌సభలో వీగిపోయింది. లోక్‌సభలో సుదర్ఘ చర్చ అనంతరం బిల్లుపై జరిగిన ఓటింగ్‌లో మూడొంతుల మెజార్టీని సాధించలేకపోయింది. ఈ బిల్లుతో ముడిపడిన మూడు బిల్లులపై సుదీర్ఘ చర్చ అనంతరం శుక్రవారం సాయంత్రం ఓటింగ్ జరిగింది. 131వ రాజ్యాంగ సవరణ, డీలిమిటేషన్, కేంద్ర పాలిత ప్రాంతాల చట్ట సవరణ బిల్లులపై ఈ ఓటింగ్ జరిగింది. ఉత్కంఠ భరితంగా జరిగిన ఓటింగ్‌లో 131వ రాజ్యాంగ సవరణ బిల్లు వీగిపోయింది. బిల్లుకు అనుకూలంగా 278, వ్యతిరేకంగా 211 ఓట్లు పడ్డాయి. మొత్తం ఓటింగ్‌లో 489 మంది పాల్గొన్నారు. మహిళా రిజర్వేషన్ అమలు సవరణ బిల్లు అవసరమైన మెజారిటీ సాధించలేకపోయింది. దీనిపై శుక్రవారం లోక్‌సభలో జరిగిన ఓటింగ్ ప్రక్రియలో మొత్తం 528 మంది సభ్యులు పాల్గొన్నారు. బిల్లుకు అనుకూలంగా 298 మంది ఓటు వేయగా, వ్యతిరేకంగా 230 మంది ఓటేశారు. దీంతో మూడింట రెండొంతుల మెజారిటీ అవసరమైన 326 ఓట్లను ఎన్డీఏ సాధించలేకపోయింది. దీంతో మిగతా రెండు బిల్లులను వెనక్కి తీసుకుంటు న్నట్లు కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు ప్రకటించారు. ప్రధాని మోడీ మనస్సాక్షిగా ఓటేయాలని పిలుపునిచ్చినా విపక్ష కూటమి తన బలిమిని చాటింది. ఒక్కరు కూడా అనుకూలంగా కలసి రాలేదు. రాజ్యాంగ సవరణ బిల్లుకు మూడింట రెండొంతుల మెజారిటీ అవసరం. లోక్‌సభలో మొత్తం సభ్యుల సంఖ్య 540. అంటే బిల్లు ఆమోదం పొందాలంటే కనీసం 360 మంది మద్దతు కావాలి. అధికార ఎన్డీఏ కూటమికి 292 మంది సభ్యుల మద్దతు ఉంది. అందువల్ల మరో 68 మంది మద్దతు అవసరం. మరోవైపు విపక్షాల బలం 233. వీరు కాకుండా స్వతంత్రులు, తటస్థ పార్టీలకు చెందిన వారు కలిసి 15 మంది ఉన్నారు. ప్రతిపక్ష సభ్యులు ఎక్కువ మంది గైర్హాజరైతే బిల్లు గ్టటెక్కే అవకాశం ఉందని అధికార ఎన్డీఏ భావించింది. సాయంత్రం 6 గంటలకు లోక్‌సభలో హోం మంత్రి అమిత్‌షా ప్రసంగించాక, ఈ బిల్లులపై ఓటింగ్ జరిగింది. ఓటింగ్ సమయంలో ప్రధాని మోడీ కూడా సభలోనే ఉన్నారు. ఓటింగ్ అనంతరం కిరణ్ రిజిజు ప్రకటన చేశారు. దీంతో సభను శనివారానికి వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ ఓంబిర్ల ప్రకటించారు.

# రాజ్యాంగంపై కుట్రను అడ్డుకున్నాం

- ఇది ముమ్మాటికీ మహిళా బిల్లు కాదు
- మహిళా రిజర్వేషన్ చట్టాన్ని తెస్తే మద్దతిస్తాం
- లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ



**ఢిల్లీ:** మహిళా బిల్లు వీగిపోవడంపై లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ స్పందించారు. రాజ్యాంగాన్ని మార్చాలనే కుట్రను తిప్పికొట్టామన్నారు. ఇది ముమ్మాటికీ మహిళా బిల్లు కానేకాదన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లుకు కాంగ్రెస్ వ్యతిరేకం కాదని 2023కు సంబంధించిన మహిళా రిజర్వేషన్ చట్టాన్ని తీసుకువస్తే మద్దతిస్తామని తెలిపారు. డీలిమిటేషన్‌తో మహిళా బిల్లుకు ముడిపెడితే కుదరదన్నారు. కాగా అంతకుముందు లోక్‌సభలో మహిళా రిజర్వేషన్ బిల్లుపై వాడీవేడీ చర్చ జరిగింది. కేంద్ర హోంమంత్రి అమిత్‌షా తీవ్రంగా స్పందించారు. ఈ సందర్భంగా కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా ఛాలెంజ్ విసిరారు.. కాంగ్రెస నాయకులు మహిళా రిజర్వేషన్ల బిల్లులో 50శాతం సీట్లు పెంచే విషయాన్ని రాతపూర్వంగా బిల్లులో రాసి తీసుకుని వస్తే బీజేపీ మద్దతిస్తుందా అని ప్రశ్నించారు? దీనికి అమిత్‌షా ఘాటుగా స్పందించారు. మహిళలకు 50శాతం రిజర్వేషన్ల కోసం ప్రస్తుతమున్న బిల్లును కేవలం గంటలోపే మార్చి తిరిగి ప్రవేశపెడతామని కాంగ్రెస్ మద్దతిస్తుందా అని ప్రశ్నించారు. అదే విధంగా 50శాతం సీట్ల పెంపును బిల్లులో పెట్టేందుకు సిద్ధమని ఆ కాఫీని ప్రతి ఎంపీకి అందజేస్తామని తెలిపారు. డీలిమిటేషన్‌తో మహిళా రిజర్వేషన్ బిల్లును కలపకూడదని మహిళా బిల్లును అడ్డుకోవడానికి కాంగ్రెస్ పార్టీ వేసిన ట్రాఫ్‌లో భాగంగానే ఈ రెండు బిల్లులను కలుపుతున్నారని తెలిపారు. అంతకుముందు రాహుల్ గాంధీ ఈ బిల్లుపై మాట్లాడారు. 2023 లోనే మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదం పొందిందని ఇది మహిళలను అడ్డుగా పెట్టి తీసుకొచ్చిన షేమ్ ఫుల్ యాక్ట్ అన్నారు. నిన్న సభలో తన సోదరి ప్రియాంక గాంధీ చేసిన ప్రసంగం తనకు ఎంతో గర్వంగా అనిపించిందన్నారు. మన జీవితంలో మహిళల పాత్ర ఎంతో కీలకమని తల్లులు చెల్లెలు, భార్య బిడ్డల రూపంలో వారు ఎంతో కీలక పాత్ర పోషిస్తారన్నారు. కాగా ఇప్పుడు మహిళా రిజర్వేషన్ బిల్లు పేరుతో కేంద్రం ఎంతో కుట్ర చేస్తోందన్నారు. ఇది రాజకీయ ముఖ చిత్రాన్నే మార్చాలనుకుంటున్న బిల్లు అని రాజ్యాంగాన్ని బైపాస్ చేసి నియోజకవర్గాలని పెంచాలనుకుంటున్నారని రాహుల్ ఆరోపించారు. కాగా మహిళా రిజర్వేషన్ బిల్లుపై జరిగిన ఓటింగ్‌లో మట్నొత్తం 528 మంది ఓటింగ్‌లో పాల్గొనగా అనకూలంగా 298 మంది, వ్యతిరేకంగా 230 మంది ఓట్లు వేశారు. దీంతో సరైన సంఖ్యా బలం లేక బిల్లు వీగిపోయింది.

# సిగాచీ బాధితులను నట్టేట ముంచారు

**కోటి పరిహారం హామీ ఇచ్చి మరచిన సిఎం**

**మరోమారు మండిపడ్డ హరీష్ రావు**



**హైదరాబాద్, ఏప్రిల్ 17:** సిగాచి ప్రమాద బాధితులకు ఇచ్చిన హామీని కూడా నిలుపుకోలేక తన అసమర్థతను సీఎం రేవంత్ రెడ్డి మరోసారి చాటుకున్నారని బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు విమర్శించారు. నాడు కోటి రూపాయల సాయం అంటూ సిగాచి బాధితులను నమ్మబలికి అందులో సగం కూడా వారికి చేర్చని రేవంత్ రెడ్డి నయవంచనలో తనను మించినవారు లేరని నిరూపించుకున్నారని అన్నారు. ఆ పూటకు మాటలు చెప్పడం.. ఆ తర్వాత తాను చెప్పిన మాటలకే విలువ ఇవ్వకపోవడం రేవంత్ రెడ్డికే చెల్లిందని విమర్శించారు. సిగాచి పరిశ్రమ అగ్నిప్రమాదంలో 54 మంది అమాయక కార్మికులు ప్రాణాలు కోల్పోతే, ఆ బాధితుల కుటుంబాలను ఆదుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలం అయ్యిందని అన్నారు. ప్రమాదం జరిగిన వెంటనే సంఘటనా స్థలానికి వెళ్లిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు వివేక్, దామోదర రాజనర్సింహ.. మృతదేహాల సాక్షిగా ఒక్కో కుటుంబానికి కోటి రూపాయల పరిహారం ఇస్తామని ఆర్భాటంగా ప్రకటించారని తెలిపారు. కానీ ఇదంతా కంటితుడుపు చర్యే అని, బాధితులకు జరిగిన న్యాయం శూన్యమని ప్రభుత్వం అసెంబ్లీలో ఇచ్చిన లిఖితపూర్వక సమాధానంతో తేటతెల్లమైందని పేర్కొన్నారు. యాజమాన్యం, ప్రభుత్వం కుమ్మక్కై పరిహారం లెక్కల్లో చేస్తున్న మోసం అంతా ఇంతా కాదని హరీశ్‌రావు అన్నారు. ప్రభుత్వం అసెంబ్లీలో సమర్పించిన అధికారిక లెక్కల ప్రకారం, 54 మంది బాధితులకు కలిపి ఇప్పటివరకు చెల్లించిన రూ. 24.51 కోట్లను విభజించి చూస్తే, ఒక్కో కార్మికుడి కుటుంబానికి సగటున అందిన పరిహారం కేవలం రూ. 45.40 లక్షలు మాత్రమే అని తెలిపారు. అంటే ముఖ్యమంత్రి హామీ ఇచ్చిన కోటి రూపాయల పరిహారంలో ఇంకా ఒక్కో కుటుంబానికి దాదాపు రూ. 54.60 లక్షల చొప్పున, మొత్తంగా రూ. 29.48 కోట్ల బకాయిని ఈ ప్రభుత్వం ఎగ్గొట్టి బాధితులను నట్టేట ముంచిందని మండిపడ్డారు. దిక్కుతోచని స్థితిలో ఉన్న ఆ పేద బాధిత కుటుంబాలను గాలికి వదిలేశారని మండిపడ్డారు. ఇక్కడ మరో మోసం దాగుందని విమర్శించారు. యాజమాన్యం తాము 40 నుంచి 42 లక్షలు ఇస్తున్నామని కోర్టుల ముందు ఒప్పుకుందని చెప్పారు. అసలు నిజమేంటంటే, వారు సొంతంగా ఇచ్చిన 25 లక్షలకు.. కార్మికులు చనిపోవడం వల్ల చట్టబద్ధంగా వారికి రావాల్సిన పీఎఫ్, ఈఎస్ఐ, లైఫ్ ఇన్సూరెన్స్ డబ్బులను కూడా కలుపుకుని ఈ లెక్కలు చూపిస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం, యాజమాన్య అమానవీయతకు, దిగజారుడుతనానికి పరాకాష్ట అని మండిపడ్డారు. అంతేకాదు, ఆసుపత్రిలో చికిత్స పొందుతూ చనిపోయిన కార్మికుల వైద్య ఖర్చులను కూడా ఈ అరకొర పరిహారంలోనే కోత విధించడం దారుణమని అన్నారు. ఇక ప్రమాదంలో కాలి బూడిదై ఆచూకీ దొరకని 8 మంది కార్మికుల కుటుంబాలను డెత్ సర్టిఫికెట్ల కోసం నెలల తరబడి ఆఫీసుల చుట్టూ తిప్పించుకున్న దుర్మార్గ ప్రభుత్వం ఇది అని విమర్శించారు. ఇది కేవలం ఒక ప్రమాదం కాదు, యాజమాన్యం నిర్లక్ష్యంతో జరిగిన సామూహిక హత్య అని హరీశ్‌రావు అన్నారు. ఫ్యాక్టరీలో భద్రతా ప్రమాణాలు గాలికొదిలేశారని విచారణలో ఆధారాలతో సహా స్పష్టంగా తేలిందని చెప్పారు. బాధితుల పక్షాన హైకోర్టులో కేసు వేసి, న్యాయస్థానం మొట్టికాయలు వేస్తే తప్ప పోలీసులు కదలలేదని హరీశ్‌రావు తెలిపారు. తూతూ మంత్రంగా ఎండీని అరెస్టు చేయడం, వెంటనే ఆయన బెయిల్ మీద బయటకు వచ్చేలా పరోక్షంగా సహకరించడం చూస్తుంటే.. ప్రభుత్వానికి, కంపెనీ యాజమాన్యానికి మధ్య ఉన్న లోపాయికారీ ఒప్పందాలు ఏమిటో అర్థం అవుతూనే ఉందన్నారు. ఆనాడు మృతదేహాల సాక్షిగా ఇచ్చిన మాట ప్రకారం, పీఎఫ్, ఈఎస్ఐ డబ్బులతో సంబంధం లేకుండా ప్రతి బాధిత కుటుంబానికి కోటి రూపాయల పరిహారం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

# రేవంత్‌ది అసదుద్దీన్ ఓవైసీ ఫార్ములా

**ఉత్తరాది, దక్షిణాది పేరుతో విషం చిమ్ముతున్నారు**

**కాంగ్రెస్, బిఆర్ఎస్‌ల తీరుపై మండిపడ్డ కిషన్ రెడ్డి**



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 17:** దక్షిణాది రాష్ట్రాల్లో సీట్లు తగ్గకుండా డీలిమిటేషన్ ప్రక్రియ జరుగుతోందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. కొత్త నాయకత్వానికి అవకాశం వస్తుందని ప్రతిపక్షాలు డీలిమిటేషన్‌ను వ్యతిరేకిస్తున్నాయని మండిపడ్డారు. దిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడారు. అన్ని రాష్ట్రాలకు సమానంగా సీట్ల పెంపు నిర్ణయం తీసుకుంటే.. తప్పుడు వ్యాఖ్యలు చేస్తున్నారు. డీలిమిటేషన్‌పై కాంగ్రెస్, బీఆర్ఎస్ కలిసి రాష్ట్ర ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నాయని మండిపడ్డారు. మహిళల రిజర్వేషన్లకు ఎంఐఎం వ్యతిరేకం. ఈ అంశంలో కాంగ్రెస్, బీఆర్ఎస్‌లను కలిపింది ఎంఐఎం పార్టీయే. సీఎం రేవంత్‌రెడ్డిది హైబ్రిడ్ ఫార్ములా కాదు.. అది అసదుద్దీన్ ఓవైసీ ఫార్మాలా అని కిషన్‌రెడ్డి మండిపడ్డారు. అలాగే మహిళా రిజర్వేషన్ బిల్లు సవరణ, నియోజకవర్గాల పునర్విభజన అంశాలపై ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలను కిషన్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. విపక్షాలు రాజకీయ దురుద్దేశంతో, ప్రజలను తప్పుదోవ పట్టించేలా మాట్లాడుతున్నాయని ఆయన మండిపడ్డారు. మహిళా రిజర్వేషన్ బిల్లు అమలును అడ్డుకోవాలనే తప్పుడు ఆలోచనతో ప్రతిపక్షాలు రాజకీయ విమర్శలు చేస్తున్నాయని కిషన్ రెడ్డి విమర్శించారు. నియోజకవర్గాల పునర్విభజన వల్ల దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందంటూ అపోహలు సృష్టించడం సరికాదని ఆయన హితవు పలికారు. ప్రతిపక్షాలు పార్లమెంట్ సాక్షిగా పచ్చి అబద్దాలు ప్రచారం చేస్తున్నాయని, ప్రాంతీయ విద్వేషాలను రెచ్చగొట్టడం వారి రాజకీయ ప్రయోజనాల కోసమేనని ధ్వజమెత్తారు. దక్షిణ భారతదేశానికి న్యాయం చెయ్యడమే మోదీ ఫార్ములా. న్యాయమా, అన్యాయమా అనే దానిపై చర్చకు సిద్ధమా? అసదుద్దీన్ హైబ్రిడ్ ఫార్ములా ఇది, రేవంత్ రెడ్డి ఫార్ములా కాదు. మజ్లిస్ పార్టీ మహిళ రిజర్వేషన్లకు వ్యతిరేకం. ఈ పార్టీ కాంగ్రెస్, బీఆర్ఎస్‌ను కలిపింది. కాంగ్రెస్ ప్రభుత్వం మజ్లిస్ పార్టీకి లొంగిపోయి పనిచేస్తోంది. 360 మంది తెలంగాణ ఉద్యమకారులను అప్పట్లో కాంగ్రెస్ ప్రభుత్వం కాల్చి చంపింది. తెలంగాణ చివరి దశ ఉద్యమంలో 1200 మంది ఆత్మ బలిదానం చేసుకున్నారు. పార్లమెంట్లో బిల్లు పెట్టినప్పుడు కాంగ్రెస్ ఎంపీలే కారం పొట్లాలు, పెప్పర్ స్ప్రేలు కొట్టారు. తెలంగాణ విభజనపై ఎంపీ తేజస్వి సూర్య చేసిన తన వ్యాఖ్యలు తప్పు అయ్యాయని ఒప్పుకున్నారు. మహిళ రిజర్వేషన్, నియోజకవర్గాల పెంపు బిల్లును అడ్డుకునేవారు చరిత్రహీనులుగా మిగిలిపోతారు. దక్షిణాది రాష్ట్రాలకు నరేంద్ర మోదీ న్యాయం చేస్తున్నారని అన్నారు.



# జాతీయ విపత్తును నివారించాం

**రాహుల్, ఖర్గే నేతృత్వంలో ఐక్యత చాటాం..**

## ఇవాళ దేశ చరిత్రలో సువర్ణదినం

**మహిళా బిల్లు పతనంపై 'ఎక్స్' వేదికగా సీఎం రేవంత్ రెడ్డి హర్షం..**

**న్యూఢిల్లీ:** లోక్‌సభలో 131వ రాజ్యాంగ సవరణ బిల్లు (మహిళా రిజర్వేషన్ బిల్లు) వీగిపోవడాన్ని 'జాతీయ విపత్తును నివారించిన రోజు'గా సీఎం రేవంత్ రెడ్డి అభివర్ణించారు. ప్రజాస్వామ్య శక్తులు, ప్రతిపక్షాలు ఏకమై ఈ నల్ల బిల్లులను అడ్డుకున్నాయని ఆయన పేర్కొన్నారు. ఈ చారిత్రాత్మక విజయం నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి సోషల్ మీడియా వేదికగా విపక్ష కూటమి నేతలకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ప్రతిపక్షాలన్నీ ఏకతాటిపైకి రావడమే ఈ విజయానికి కారణమని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. "లోక్‌సభ విపక్ష నేత రాహుల్ గాంధీ, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నాయకత్వంలో ప్రతిపక్షాలన్నీ ఒక్కటయ్యాయి. దేశ చరిత్రలో ఇదొక సువర్ణదినంగా నిలిచిపోతుంది" అని ఆయన కొనియాడారు. రాజ్యాంగాన్ని కాపాడేందుకు మిత్రపక్షాలు చూపిన సాహసాన్ని ఆయన అభినందించారు. ఈ పోరాటంలో అండగా నిలిచిన వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు మరియు జాతీయ నేతలకు రేవంత్ రెడ్డి పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. ఎం.కె. స్టాలిన్ (తమిళనాడు), మమతా బెనర్జీ (పశ్చిమ బెంగాల్), అఖిలేష్ యాదవ్ (యూపీ), శరద్ పవార్, ఉద్ధవ్ ఠాక్రే (మహారాష్ట్ర), లాలూ ప్రసాద్ యాదవ్ (బీహార్), హేమంత్ సోరెన్ (జార్ఖండ్), అరవింద్ కేజ్రీవాల్ (ఢిల్లీ)తో పాటు ఫరూఖ్ అబ్దుల్లా, నవీన్ పట్నాయక్, కమ్యూనిస్ట్ పార్టీల నేతలకు తన సందేశంలో కృతజ్ఞతలు తెలిపారు. అంతకుముందు, భారత మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ వర్ధంతి సందర్భంగా ఢిల్లీలోని తన అధికారిక నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. భారతదేశం గర్వించదగ్గ గొప్ప తత్వవేత్త మరియు విద్యావేత్త అని రాధాకృష్ణన్‌ను కొనియాడారు. ఈ కార్యక్రమంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎంపీలు వేం నరేందర్ రెడ్డి, అనిల్ కుమార్ యాదవ్, చామల కిరణ్ కుమార్ రెడ్డి మరియు కాంగ్రెస్ నేత రోహిన్ రెడ్డి పాల్గొన్నారు.

# తేజస్వీ మాటల్లో తప్పేముంది

**బీజేపీ వల్లే తెలంగాణ సిద్ధించింది**

**మంత్రి పొన్నం వ్యాఖ్యలపై బండి మండిపాటు**



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 17:** తెలంగాణ విభజనపై బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య మాటలను కాంగ్రెస్ నేతలు ఎందుకు తప్పుబడుతున్నారంటూ కేంద్ర మంత్రి బండి సంజయ్ మండిపడ్డారు. రాష్ట విభజన సమయంలో కాంగ్రెస్ తప్పిదాలతో పలువురు యువకులు ఆత్మబలిదానాలు చేసుకున్నారని ఎంపీ తేజస్వి సూర్య చెప్పారని తెలిపారు. 2009లో కాంగ్రెస్ తెలంగాణ ఏర్పాటుకు సహకరించి మళ్లీ వెన్నక్కి తగ్గారని.. దీని గురించే తేజస్వి సూర్య మాట్లాడారని అన్నారు. రేవంత్ రెడ్డి గతంలో సోనియాగాంధీని బలిదేవత అన్నారన్న విషయాన్ని గుర్తుచేశారు. తెలంగాణ ఉద్యమాన్ని వ్యతిరేకించిన వ్యక్తి సీఎం రేవంత్ రెడ్డి అంటూ విమర్శించారు. అలాంటి రేవంత్ కుఏబినేట్‌లో ఉన్న పొన్నం తదితరులు గతాన్ని మరిచి విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. కరీంనగర్‌లో రణభేరి కార్యక్రమానికి రేవంత్ రెడ్డి తుపాకీ పట్టుకొని వెళ్లారని కేంద్ర మంత్రి తెలిపారు. 1400 మంది బలిదానాలకు హత్యలకు కారణమైన పార్టీ కాంగ్రెస్ అని ఆరోపించారు. ఒక్క ఓటు, రెండు రాష్ట్రాలు అనే నినాదానికి కట్టుబడి, రాష్ట్ర విభజనకు మద్దతు ఇచ్చింది బీజేపీ అని తెలిపారు. మహిళా రిజర్వేషన్ బిల్లును కాంగ్రెస్ కావాలని అడ్డుకుంటోందని మండిపడ్డారు. బీఆర్ఎస్ అవినీతి గురించి సీఎం రేవంత్ రెడ్డి ఎందుకు మాట్లాడటం లేదని కేంద్ర మంత్రి బండి సంజయ్ ప్రశ్నించారు.

# పార్లమెంట్ ముందు ఎంపీల నిరసన

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 17:** పార్లమెంట్ ఆవరణలో తెలంగాణ కాంగ్రెస్ ఎంపీలు ఆందోళనకు దిగారు. ప్లకార్డులు పట్టుకుని బైఠాయిచారు. తెలంగాణ ఏర్పాటును భారత్ - పాకిస్థాన్ విభజనతో పోల్చుతూ భాజపా ఎంపీ తేజస్వీ సూర్య లోక్‌సభలో చేసిన వివాదాస్పద వ్యాఖ్యలను తప్పుబట్టారు. ఆయనకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ఉద్యమాన్ని అవమానించవద్దని ప్లకార్డులు ప్రదర్శించారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి వ్యతిరేకంగా కూడా ఎంపీలు నినాదాలు చేశారు. ఎంపిలు చామల కిరణ్ కుమార్ రెడ్డి, వేం నరేందర్ రెడ్డి, కడియం కావ్య తదితరులు పాల్గొన్నారు.





## సంపాదకీయం

# ప్రజలకు భారం కానున్న సీట్ల పెంపు!

మహిళా బిల్లు, డీలిమిటేషన్‌పై పార్లమెంటు సమావేశాలు వాడీవేడిగా సాగుతున్నాయి. ఈ సమావేశాలకు చాలా ప్రత్యేకత ఉంది. ఎందుకంటే ఎన్నో ఏళ్ల నుంచి ఎదురుచూస్తున్న, చట్టసభల్లో అమలుకు నోచుకుని మహిళలకు 33శాతం రిజర్వేషన్ చట్టం నారీ శక్తి వందన్ అధినియమ్ మోడీ ప్రభుత్వం అమలు చేసేందుకు పట్టుదలగా ఉంది. నిజానికి ఇది ఎన్నో ఏళ్ల కల. ఇప్పటికే చాలా ఆలస్యం అయ్యింది. ఈ క్రమంలో దేశంలో 50శాతం ఉన్న మహిళలకు రిజర్వేషన్ అన్నది హక్కుగా దక్కాల్సిందే. పురుషాధిక్యాన్ని ఎదురొడ్డి నిలబ డాలంటే వారికి రిజర్వేషన్లు ఉండాల్సిందే. అయితే ఈ విషయంలో ఇప్పటికే ఉన్న సీట్లకు అనుగుణంగా అమలు చేయకుండా లోక్‌సభ సీట్లను 816కి పెంచడం అన్నది చాలా దారుణం. ఎందుకంటే ఉన్న లోక్‌సభ, అసెంబ్లీ సీట్లతోనే దేశం ఆర్థికంగా తీవ్రంగా నష్టపోతోంది. ప్రజాప్రతినిధులకు ఇచ్చే జీత భత్యాలు, పెన్షన్లు, క్వార్టర్లు, విమాన ఖర్చులు ఇలా చెప్పుకుంటూ పోతే తడిసి మోపెడువుతున్నాయి. ఈ ఖర్చులను తగ్గించి, జీతభత్యాల్లో కోత విధించి, పెన్షన్లు తగ్గించాల్సి ఉన్నా వాటిపై ఎవ్వరూ మాట్లాడడం లేదు. ఉద్యోగులకు లేని పెన్షన్లు వీరికెందుకన్నది చెప్పడం లేదు. ఒక్కొక్కరు రెండేసి పెన్షన్లు పొందుతున్నప్పటికీ ఘనత వహించిన మోడీ ప్రభుత్వం గుర్తించడం లేదు. దీనిగురించి చట్టసభల్లో అడిగేవారు లేరు. ఇప్పుడు ఎంపిలు, ఎమ్మెల్యేల ఖర్చులు వేల కోట్లల్లో ఉంటోంది. దీనిని మరింతగా పెంచడం కన్నా తగ్గించాలి. ఒకవేళ సీట్లు పెంచాల్సి వస్తే ఓ 50 లేదా 60 వరకు పెంచి వుంటే బాగుండేది. కనీసం ఓ 600 వరకు పెంచి, అందులో 250 మహిళలకు కేటాయిస్తే మంచిది. ప్రజాప్రతినిధుల సంఖ్యను పెంచి జనం మీద బాదే బదులు తగ్గిస్తే మంచిది. సీట్లు పెంచడం లాభం కనుక పెంచుతున్నారన్న విమర్శలు కూడా ఉన్నాయి. కానీ మహిళాభివృద్ధి కోసం పాటుపడే లక్ష్యంలో మాత్రం అభినందించాల్సిందే. మహిళల విద్యకు, ఆర్థికంగా ఎదిగేందుకు ఊతమివ్వాలి. విద్యారంగంలో మహిళలకు వడ్డీలేని రుణాలు ఇవ్వాలి. మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలి. ఉదారంగా వారికి రుణాలు ఇవ్వాలి. ఇవన్నీ చేస్తూనే కేంద్ర ప్రభుత్వం చట్టసభల్లో కూర్చోబెట్టడానికి అవకాశం కల్పించాలి. డీలిమిటేషన్‌ను వ్యతిరేకిస్తున్న పార్టీలు ఇవన్నీ చర్చించాలి. సీట్ల సంఖ్యను పరిమితం చేసి, జీతభత్యాలన ఎత్తేసి, పెన్షన్లను రద్దు చేసేలా చర్చ చేయాలి. కేవలం రాజకీయ లబ్ది కోసమే చేయడం అన్నది సరికాదు. బిజెపికి గత ఎన్నికల్లో కూడా మహిళా ఓటు బ్యాంకు చాలా కీలకంగా మారిందన్న గణాంకాలు ఉన్నాయి. 2014 నుంచి 2024 సార్వత్రిక ఎన్నికల్ని పరిశీలిస్తే.. మహిళల ఓట్ల వల్లే బిజెపి గెలిచిందనడంలో అతిశయోక్తి లేదు. 1998 ఎన్నికల్లో బిజెపికి మహిళా ఓటింగ్ 33 శాతం. అప్పుడు అటల్ బీహారీ వాజ్‌పేయి అధికారంలోకి వచ్చింది. కాంగ్రెస్‌కి 30 శాతమే. ఆ తర్వాత మళ్లీ బిజెపికి మహిళా ఓటింగ్ తగ్గినా.. 2014 నుంచి క్రమేణా పెరుగుతోంది. 2024 ఎన్నికల్లో కాంగ్రెస్‌కి 22 శాతం అయితే.. బిజెపికి 36 శాతం మహిళా ఓటింగ్ నమోదైందని ఎన్‌ఇఎస్ గణాంకాలే వెల్లడించాయి. అంటే మహిళలు అండగా ఉన్నందున ప్రతి విషయంలోనూ బిజెపి వారికి అనుకూల నిర్ణయాలు తీసుకోవాలి. ఇబ్బడిముబ్బడిగా ఎంపి, ఎమ్మెల్యే సీట్లు పెంచి, మహిళల కోసమే అని చెప్పడం సరికాదు. సీట్ల సంఖ్యను పెంచకుండానే వారికి 33శాతం అమలు చేయవచ్చు. విపక్షాలు కూడా ఇదే కోరుతున్నాయి. 2019లో 89.6 కోట్ల మంది ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. వీరిలో 46.5 కోట్ల మంది పురుషులు, 43.1 కోట్ల మంది మహిళలు తమ ఓటు హక్కును వినియోగించు కున్నారు. 2024కి 96.8 కోట్ల మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ ఎన్నికల్లో మహిళా ఓటర్లు 47.1 కోట్లకి చేరారు. అంటే 2019కి కంటే 2024కి నాలుగు కోట్లమంది మహిళా ఓటర్లు పెరిగారు. ఇక ఈ ఎన్నికల్లో కొత్త ఓటర్లు 2.63 పెరగగా వారిలో 1.41 కోట్ల మంది మహిళలు, 1.22 మంది పురుషుల ఓటర్లు పెరిగారు. 2019లో 12 రాష్ట్రాల్లో రికార్డు స్థాయిలో మహిళా ఓటర్లు పెరిగారు. అయితే 2024లో 36 రాష్ట్రాలు కేంద్రపాలిత ప్రాంతాల్లో 19 రాష్ట్రాల్లో మహిళా ఓటింగ్ పెరిగింది. అందువల్ల న్యాయంగా వారికి దక్కాల్సిన సీట్లను ఇవ్వాల్సిందే. అయితే అందుకోసం ఉన్న పార్లమెంట్, అసెంబ్లీ సీట్లను భారీగా పెంచడం సరికాదు. ఇప్పుడున్న లోక్‌సభ సీట్లు 543 కాస్తా.. 816కి పెరుగుతాయని హోంమంత్రి అమిత్ షా ప్రకటించారు. ఈ సీట్ల కేటాయింపుల్లో కూడా ఉత్తరప్రదేశ్, బీహార్ రాష్ట్రాలకే ఎక్కువ సీట్లు వచ్చే అవకాశం ఉంది. లోక్‌సభ స్థానాల పరంగానూ, ఇటు రాష్ట్రాల పరంగానూ ఎంపి, ఎమ్మెల్యే సీట్లు పెరగడం ఓ రకంగా రాజకీయ పార్టీలకే తప్ప ప్రజలకు ఒనగూరే ప్రయోజనం ఉండదు. ఃాజకీయంగా మహిళలు ఎదగాలన్నది, పరిపాలనలో భాగస్వామ్యం కావాలన్న విషయంపై ఎవరికీ వ్యతిరేకత లేదు. రాజకీయాల్లో ధనబలం, కండబలం నిరోధించాలంటే మహిళలను రాజకీయాల్లోకి తీసుకుని రావాల్సిందే. ఆ విషయంలో మహిళకు ఆర్థిక స్వేచ్ఛను కూడా ఇవ్వాల్సిందే. ఆస్తిలో హక్కులు కల్పించాల్సిందే. ఒకవేళ గెలిచినా.. మహిళల్ని తమ ఆలోచనలకు తగ్గట్టుగా పనిచేయనివ్వాలి. సామాజిక, ఆర్థిక పరంగా మహిళలు చైతన్యవంతంగా ఉంటే మంచి సమాజాం ఏర్పడుతుంది. సీట్ల పెంపు వల్ల పెద్దగా ప్రయోజనం లేదు. మహిళా కోటాను అమలు చేయడం కోసం సీట్లు పెంచాలనుకోవడం సరికాదు. అందువల్ల ఉన్న సీట్లలో 33శాతం అమలు చేయడమో లేదా, ఇపుడు 542ను 200కు పెంచడమో సబబుగా ఉంటుంది. ఏకంగా 816కు పెంచడం దేశంపై ముఖ్యంగా పన్నులు కట్టే ప్రజలపై భారం మోపడమే అవుతుంది.

# మనస్సాక్షిగా మహిళా బిల్లుకు మద్దతు ఇవ్వండి

- మహిళా శక్తిని గౌరవించడానికి ఇదో పెద్ద అవకాశం
- మహిళలను గౌరవించేందుకు సమిష్టిగా కృషి చేద్దాం
- ఎంపీలకు ప్రధాని ప్రధాని మోడీ పిలుపు



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 17:** పార్లమెంటులో ప్రవేశపెట్టిన మహిళా రిజర్వేషన్ల బిల్లుకు మద్దతివ్వాలని ఎంపీలకు ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. పార్లమెంట్ సభ్యులంతా తమ మనస్సాక్షికి అనుగుణంగా ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. దేశంలోని మహిళా శక్తిని గౌరవించడానికి ఇదో గొప్ప అవకాశమని ఆయన కొనియాడారు. మహిళలకు తగిన హక్కులను కల్పించడంలో అందరం సమష్టిగా చరిత్ర సృష్టించాలన్నారు. ఏకాభిప్రాయంతో ఈ సవరణను ఆమోదించాలని, దేశ ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయాలని ఎక్స్ వేదికగా ప్రధాని కోరారు. 'నేను ఎంపీలందరినీ కోరేది ఒక్కటే.. మీ ఇంట్లోని తల్లిని, సోదరిని, కుమార్తెను, భార్యను గుర్తుంచుకుని.. మీ మనస్సాక్షి చెప్పిందే వినండి. దేశ మహిళలకు సాధికారత కల్పించడం అనేది ఒక గొప్ప అవకాశం. వారికి కొత్త అవకాశాలను దూరం చేయకండి. ఈ సవరణ ఏకాభిప్రాయంతో ఆమోదం పొందితే.. దేశంలో మహిళా శక్తి మరింత బలోపేతమవుతుంది. ఫలితంగా.. దేశ ప్రజాస్వామ్యం మరింత బలపడుతుంది. రండి.. ఈ రోజు మనమందరం కలిసి చరిత్ర సృష్టిద్దాం' అని మోదీ పిలుపునిచ్చారు. మహిళలకు వారి హక్కులు ఇచ్చేందుకు సమయం ఆసన్నమైందని అంతకముందు జరిగిన చర్చ సందర్భంగా మోదీ ప్రసంగించారు. నారీ శక్తి వందన్ అధినియమ్‌కు చేసిన సవరణలపై పార్లమెంటులో సవివరమైన, సుదీర్ఘ రీతిలో చర్చ జరుగుతోందన్నారు. ఇప్పటివరకు జరిగిన చర్చలో సదరు బిల్లుపై ఉన్న అపోహలను తొలగించామని, సభ్యుల సందేహాలన్నింటినీ నివృతి చేశామని ఆయన తెలిపారు. ఇది చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్య అని, దశాబ్దాలుగా మహిళా రిజర్వేషన్‌ను రాజకీయం చేశారని, నిర్ణయాలు తీసుకునే ప్రక్రియలో మహిళలకు సరైన ప్రాతినిధ్యం కల్పించాల్సిన సమయం ఆసన్నమైందని స్పష్టం చేశారు. ఈ బిల్లు లోక్‌సభలో ఓటింగ్‌కు రానున్న నేపథ్యంలో ఎంపీలంతా సంపూర్ణ మద్దతు ప్రకటించాలని అన్ని రాజకీయ పార్టీలకు విజ్ఞప్తి చేశారు మోదీ. సభ్యులు సున్నితంగా వ్యవహరించాలని, 'నారీ శక్తి' మనోభావాలను దెబ్బతీయవద్దని కోరారు. నారీ శక్తి వందన్ అధినియమ్‌కు సవరణలు చేసే విషయంపై పార్లమెంట్‌లోచర్చ జరుగుతోంది. నిన్నరాత్రి ఒంటిగంట వరకు చర్చ నడిచింది. బిల్లుల విషయంలో ఉన్న అపోహలను తొలగించేలా ప్రభుత్వం సమాధానం ఇచ్చింది. 4 దశాబ్దాలుగా మహిళా రిజర్వేషన్ బిల్లుపై ఎన్నో రాజకీయాలు జరిగాయి. దేశ జనాభాలో సగ భాగంగా ఉన్నవారు తమ హక్కులను పొందడానికి సమయం ఆసన్నమైంది. స్వాతంత్ర్యం వచ్చిన ఇన్ని సంవత్సరాల తర్వాత కూడా నిర్ణయాలు తీసుకునే పక్రియలో వారికి ప్రాతినిధ్యం లేకపోవడం సరికాదు. ఈ నేపథ్యంలో అన్ని రాజకీయ పార్టీలకు నా విన్నపం ఒక్కటే. పూర్తి పరిశీలన తర్వాత మహిళా రిజర్వేషన్‌కు అనుకూలంగా నిర్ణయం తీసుకొని ఓటు వేయండి' అని ప్రధాని కోరారు. మహిళా శక్తికి సేవచేయడానికి, వారిని గౌరవించేందుకు ఇదొక అద్భుత అవకాశం. మహిళలకు కొత్త అవకాశాలను దూరం చేయొద్దు. చరిత్ర సృష్టించేందుకు ఈ రోజు మనమంతా ఏకమవుదాం' అని 'ఎక్స్'లో పిలుపునిచ్చారు.

# 2023లోనే ఆమోదించిన బిల్లును అమలు చేయండి

- లేదా కొత్తగా మహిళా బిల్లును తీసుకుని రండి
- ప్రస్తుత బిల్లు మహిళా సాధికరత కోసం పెట్టింది కాదు
- ఆ ముసుగులో దేశ రాజకీయ చిత్రపటాన్ని మార్చే ప్రయత్నం
- బీసీ, దళితులు, మైనార్టీలు, మహిళల పట్ల క్రూర చర్య
- చర్చలో మోడీ ఓ మెజీషియన్ అంటూ రా హుల్ తీవ్రంగా విమర్శలు
- రాహుల్ తీరుపై మండిపడ్డ స్పీకర్ బిర్లా.. కేంద్రమంత్రులు





**న్యూఢిల్లీ, ఏప్రిల్ 17:** ఇప్పటికే 2023లోనే మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదం పొందిందని, దానినే అమలు చేయాలని ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అన్నారు. ప్రస్తుతం ప్రతిపాదించిన బిల్లు మహిళల సాధికారత కోసం పెట్టింది కాదని విమర్శించారు. ఈ బిల్లు ముసుగులో దేశ రాజకీయ చిత్రపటాన్ని మార్చే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. అంతగా కావాలంటే పాత మహిళా రిజర్వేషన్ల బిల్లును రద్దు చేసి.. ఇప్పుడు కొత్తగా మళ్లీ తీసుకురావాలని కేంద్రానికి సూచించారు. లోక్‌సభలో 131వ రాజ్యాంగ సవరణ, డీలిమిటేషన్, కేంద్రపాలిత ప్రాంతాల చట్ట సవరణ బిల్లులపై లోక్‌సభలో చర్చ సందర్భంగా రాహుల్ ఈ వ్యాఖ్యలు చేశారు. మహిళా బిల్లు ముసుగులో దేశ రాజకీయ చిత్రపటాన్ని మార్చే ప్రయత్నం జరుగుతోంది. అంతగా కావాలంటే పాత బిల్లును రద్దు చేసి.. మళ్లీ తీసుకురండి. మేం ఎలాంటి అభ్యంతరాలు చెప్పకుండా మద్దతిస్తాం. బీసీ, దళితులు, మైనార్టీలు, మహిళల పట్ల ఈ బిల్లు క్షమించరాని, క్రూరమైన చర్య. ఓబీసీ సోదరుల నుంచి అధికారం లాక్కునే ప్రయత్నం జరుగుతోందన్నారు. కులగణన ప్రారంభమైందని హోంమంత్రి అమిత్ షా చెప్పారు. ఇప్పుడు కులగణనతో సంబంధం లేకుండా డీలిమిటేషన్ ఎందుకు జరుగుతోందని, విపక్షాలన్నీ దీన్ని ఓడిస్తాయని రాహుల్ గాంధీ అన్నారు. న్యాయవ్యవస్థ, ప్రైవేటు రంగం వంటి కీలక రంగాల్లో ఓబీసీలు, దళితులు ఎక్కడున్నారు? దేశ అత్యున్నత బ్యూరోక్రసీలో వీరు ఎక్కడున్నారు? ఓబీసీలకు అధికారం, భాగస్వామ్యం ఇచ్చేందుకు భాజపా సిద్ధంగా లేదు. తన ప్రాబల్యం తగ్గిపోతోందన్న భయం ఆ పార్టీకి పట్టుకుంది. దక్షిణాది, ఈశాన్య, చిన్న రాష్ట్రాలను భాజపా గౌరవించడం లేదని రాహుల్ ధ్వజమెత్తారు. లోక్‌సభలో రాహుల్ ప్రసంగిస్తూ.. ప్రధాని మోదీపై విమర్శలు గుప్పించారు. ఈ సందర్భంగా మోదీని పరోక్షంగా ఇంద్రజాలికుడంటూ రాహుల్ వ్యాఖ్యానించడం సభలో గందరగోళానికి కారణమైంది. దీనిపై స్పీకర్ ఓం బిర్లా అభ్యంతరం వ్యక్తం చేయగా.. భాజపా సభ్యులు కూడా రాహుల్ తీరుపై మండిపడ్డారు. ప్రధాన మంత్రిని అవమానిస్తున్నారని, ఇందుకు రాహుల్ వెంటనే క్షమాపణ చెప్పాలని కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్ సింగ్, కిరణ్ రిజిజు డిమాండ్ చేశారు. మహిళా రిజర్వేషన్ బిల్లు ద్వారా దేశంలో కులగణన డిమాండ్‌ను పక్కదారి పట్టించే ప్రయత్నం జరుగుతోందన్నారు. 'ఈ బిల్లు ఆమోదం పొందదని బీజేపీకి కూడా తెలుసు. వాళ్లంత తెలివతక్కువ వాళ్లు కాదు. ఈ బిల్లును విపక్షంలోని ప్రతి ఒక్కరూ వ్యతిరేకిస్తారని వాళ్లకు తెలుసు. అయినా ప్రధాని రెండు సందేశాలు పంపాలనుకున్నారు. ఇందులో మొదటిది.. దేశ ఎలక్టోరల్ మ్యాప్‌ను ఆయన మార్చాలను కున్నారు. రెండవది.. తాను మహిళా పక్షపాతినని మరోసారి చాటిచెప్పాలని అనుకున్నారు. బాలాకోట్ మెజిషియన్, డీమోనిటైజేషన్ మెజియన్, సిందూర్ మెజిషియన్ అక్షస్మాత్తుగా పట్టుబడ్డారు' అని రాహుల్ వ్యాఖ్యానించారు. ప్రధానమంత్రిని ఉద్దేశించి రాహుల్ చేసిన వ్యాఖ్యలపై పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రధానిపై అభ్యంతరకరమైన భాష వాడటాన్ని తప్పుపట్టారు. బాలాకోట్ దాడులు, ఆపరేషన్ సిందూర్ ప్రస్తావనతో దేశాన్ని, మిలటరీని అవమానపరుస్తున్నారని అన్నారు. దేశ ప్రధానమంత్రి గురించి విపక్ష నేత ఇలాంటి వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరమని, ఆ వ్యాఖ్యాలను రికార్డులను నుంచి తొలగించాలని స్పీకర్ ఓం బిర్లాను రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కోరారు. అందుకు స్పీకర్ అంగీకరించారు.

## దక్షిణాది రాష్ట్రాలకు తీవ్ర నష్టం

### డీలిమిటేషన్ ప్రక్రియపై శశిథరూర్



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 17:** పార్లమెంట్‌లో లోక్‌సభ, శాసనసభ నియోజకవర్గాల పునర్విభజన అంశంపై చర్చ తీవ్రరూపం దాల్చింది. జనాభా ఆధారంగా సీట్ల సంఖ్యను పెంచాలనే ఉద్దేశ్యంతో, కేంద్ర ప్రభుత్వం డీలిమిటేషన్ పక్రియకు సంబంధించి చొరవ తీసుకుంటోంది. అయితే డీలిమిటేషన్ బిల్లును ప్రతిపక్ష పార్టీలు వ్యతిరేకిస్తున్నాయి. శుక్రవారం రెండో రోజు కూడా డీలిమిటేషన్ బిల్లుపై చర్చ కొనసాగింది. డీలిమిటేషన్‌తో దక్షిణాది రాష్ట్రాలకు నష్టం జరుగుతుందని కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ అన్నారు. లోక్‌సభలో ఆయన మాట్లాడుతూ.. దక్షిణాది రాష్ట్రాలకు నష్టం జరగదని ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా మాట్లాడుతున్నారని, వారి మాటలకు విరుద్ధంగా డీలిమిటేషన్ బిల్లు రూపొందించారని ఆయన విమర్శించారు. డీలిమిటేషన్‌తో దక్షిణాది రాష్ట్రాలు రాజకీయంగా మరింత నష్టపోతాయని శశిథరూర్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వం మహిళా రిజర్వేషన్ బిల్లు తీసుకురావడం మంచిదేనని, అయితే దీని అమలకు 2011 జనాభా లెక్కలకు, నియోజకవర్గాల పునర్విభజన పక్రియకు ముడిపెట్టడారని ఆయన విమర్శించారు. ఒకేసారి 816 మంది సభ్యులకు సీట్లు పెంచడం ఆషామాషీ కాదన్నారు. దీంతో ఎన్నో సమస్యలు వస్తాయని హెచ్చరించారు. మరోవైపు లోక్ సభలో ఈ మూడు బిల్లుల ఓటింగ్ ఉత్కంఠ రేపుతోంది. సాయంత్రం 4 గంటలకు స్పీకర్ ఓంబిర్లా ఓటింగ్ చేపట్టనున్నారు. విపక్షాల్లోని పలు పార్టీలతో ఎన్డీయే నేతలు మంతనాలు చేస్తున్నారు. మరోవైపు ఓటింగ్ వేళ ఇండియా కూటమి వ్యూహరచన చేపట్టింది. ఇండియా కూటమికి భేటీకి ఆర్జేడీ హాజరుకావడంతో రాజకీయ ప్రాధాన్యం సంతరించుకుంది. ఒక్కొక సభ్యుడు ఉన్న పార్టీలను కూడా ఈ కూటమి సంప్రదిస్తోంది.

## రాజ్యసభ డిప్యూటీ చైర్మన్‌గా మరోమారు హరివంశ్

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 17:** రాజ్యసభ డిప్యూటీ చైర్మన్‌గా హరివంశ్ నారాయణ్ సింగ్ ఎన్నికయ్యారు. ప్రతిపక్ష అభ్యర్థులు ఎవరూ నామినేషన్ దాఖలు చేయకపోవడంతో ఆయన ఎన్నిక ఏకగ్రీవం అయ్యింది. ఆయన ఉపసభాపతి బాధ్యతలు చేపట్టడం ఇది మూడోసారి. ఈ సందర్భంగా ప్రధాని మోదీ డిప్యూటీ చైర్మన్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఆయన అనుభవం రాజ్యసభకు ఎంతో అవసరమని అన్నారు. ఆయన అందరినీ కలుపుకుని వెళ్లాలని ఆశిస్తున్నట్టు పేర్కొన్నారు. హరివంశ్ నేతృత్వంలో సభ మరింత శక్తిమంతం అవుతుందని అన్నారు. రాజ్యసభలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కూడా నూతన ఉపసభాపతికి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన ప్రతిపక్షానికి కూడా తగిన ప్రాధాన్యం ఇస్తారని ఆశిస్తున్నట్టు తెలిపారు. ఆయన అందరి వాడని అన్నారు. ఇటీవల ఆయన రాజ్యసభ పదవీకాలం ముగిసింది. దీంతో ఆయనను రాష్ట్రపతి కోటాలో నామినేట్ చేశారు.

## రెండోరోజూ డీఎంకే నిరసన

### ఆదరాబాదరాగా చట్టాలను తేవడంపై కనిమొళి అభ్యంతరం

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 17:** మహిళా రిజర్వేషన్ అమలు, లోక్‌సభ సీట్ల పెంపు బిల్లులపై పార్లమెంటులో రెండోరోజు చర్చ ప్రారంభమైంది. ప్రతిపక్షాల నిరసనల నడుమ సభ సాగుతోంది. ప్రభుత్వ తీరుపై మరోసారి ప్రతిపక్షాలు మండిపడ్డాయి. సభలో చర్చ జరుగుతుండగా మహిళా రిజర్వేషన్‌పై గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేశారని ఆక్షేపించాయి. కేంద్ర ప్రభుత్వం తీరుపై డీఎంకే ఎంపీ కనిమొళి మండిపడ్డారు. డిఎంకె ఎంపిలు వరుసగా రెండోరోజూ నల్లదుస్తులతో సభకు హాజరయ్యారు. హోం మంత్రి అమిత్ షా పొంతన లేని సమాధానాలు చెబుతున్నారని ఈ సందర్భంగా కనిమొళి అన్నారు. రాష్ట్రాల హక్కులను ఈ ప్రభుత్వం గుర్తించట్లేదని అన్నారు. ఢిల్లీ సార్ల కోసమే రాష్ట్రాలు ఉన్నట్టు కేంద్రం వ్యవహరిస్తోందని అన్నారు. కేంద్రం చర్యలపై మండిపడ్డారు. డీలిమిటేషన్‌కు మహిళా రిజర్వేషన్ బిల్లు బందీగా మారిందని అన్నారు. ఈ వ్యవహారాన్ని డీలిమిటేషన్‌తో లంకె పెట్టకూడదని అన్నారు. మహిళా బిల్లుకు అభ్యంతరం లేదని, కేవలం డీలిమిటేషన్ విషయంలోనే ఇంత తొందరెందుకని ప్రశ్నించారు. కావాలంటే ఉన్న సీట్లతోనే మహిళా రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు.



# పశ్చిమ గోదావరిలో కలకలం

## పాస్టర్ ఇంట్లో రూ. 2.27 కోట్ల నగదు సీజ్

**నరసాపురం మండలం పీచుపాలెంలో పోలీసుల మెరుపు దాడులు**

**ఆధారాలు లేని భారీ నగదును స్వాధీనం చేసుకుని ఐటీ శాఖకు అప్పగింత**

**హవాలా కోణంలో దర్యాప్తును ముమ్మరం చేసిన దర్యాప్తు సంస్థలు**

**నరసాపురం, ఏప్రిల్ 17:** పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురం మండలంలో చోటుచేసుకున్న ఒక ఘటన స్థానికంగా తీవ్ర సంచలనం సృష్టించింది. పీచుపాలెం గ్రామానికి చెందిన ప్రముఖ చర్చి పాస్టర్ ఘంటా జాన్‌బాబూరావు నివాసంలో పోలీసులు జరిపిన సోదాల్లో భారీ ఎత్తున నగదు పట్టుబడటం కలకలం రేపింది. ఎటువంటి ఆధారాలు లేకుండా ఇంట్లో దాచి ఉంచిన సుమారు రూ. 2.27 కోట్ల నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పక్కా సమాచారంతో రంగంలోకి దిగిన పోలీసు బలగాలు ఈ ఆకస్మిక తనిఖీలు నిర్వహించాయి. స్వాధీనం చేసుకున్న నగదుకు సంబంధించి సరైన లెక్కలు చూపకపోవడంతో, పోలీసులు ఆ డబ్బును సీజ్ చేసి తదుపరి విచారణ నిమిత్తం ఆదాయపు పన్ను (ఐటీ) శాఖ అధికారులకు సమాచారం అందించారు. ఈ భారీ నగదు వెలుగులోకి రావడానికి ఒక బలమైన కారణం ఉన్నట్లు పోలీసు వర్గాలు వెల్లడించాయి. ఇటీవల పాస్టర్ అల్లుడైన శాంసన్ హైదరాబాద్ నుంచి సుమారు రూ. 50 లక్షల నగదును తీసుకువచ్చినట్లు పోలీసులకు ముందస్తు సమాచారం అందింది. దీనిపై నిఘా పెట్టిన పోలీసులు శాంసన్ కదలికలను గమనిస్తూ ఆయన మామగారైన జాన్‌బాబూరావు ఇంటిపై దాడులు నిర్వహించారు. ఈ సోదాల్లో బీరువాల్లో దాచిన రూ. 500 నోట్ల కట్టలను చూసి పోలీసులు సైతం విస్తుపోయారు. పట్టుబడిన మొత్తం అంతా రూ. 500 నోట్ల రూపంలోనే ఉండటం గమనార్హం. ఇది హవాలా లావాదేవీలకు సంబంధించిన సొమ్ము కావచ్చని పోలీసులు ప్రాథమికంగా అనుమానిస్తున్నారు. ఒక ఆధ్యాత్మిక గురువుగా ఉన్న వ్యక్తి ఇంట్లో ఇంత పెద్ద మొత్తంలో నల్లధనం దొరకడం జిల్లావ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. సాధారణ జీవితం గడిపే పాస్టర్ కుటుంబానికి ఇంత ఆదాయం ఎక్కడి నుంచి వచ్చిందనే దానిపై స్థానికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. గత కొంతకాలంగా జాన్‌బాబూరావు కుటుంబం జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో పెద్ద ఎత్తున ఆస్తులను కొనుగోలు చేసినట్లు, విలాసవంతమైన జీవితం కోసం లక్షల్లో ఖర్చు చేసినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలోనే భారీగా నగదు నిల్వలు బయటపడటం ఆ ఆరోపణలకు బలాన్ని చేకూరుస్తోంది. ఆధ్యాత్మిక కార్యక్రమాల ముసుగులో ఏవైనా అక్రమ లావాదేవీలు సాగుతున్నాయా అనే కోణంలో విచారణ సాగుతోంది. పోలీసులు నగదు గురించి ప్రశ్నించిన సమయంలో పాస్టర్ కుటుంబ సభ్యులు పొంతనలేని సమాధానాలు చెప్పినట్లు తెలుస్తోంది. ఈ డబ్బు ఎక్కడి నుంచి వచ్చింది? ఎవరికి పంపాలి? అనే విషయాలపై కుటుంబ సభ్యులు స్పష్టత ఇవ్వలేకపోయారు. దీంతో ఈ వ్యవహారంలో ఇంకా ఎవరైనా పెద్దల హస్తం ఉందా అనే కోణంలో పోలీసులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. కేవలం అల్లుడు తెచ్చిన డబ్బు మాత్రమే కాకుండా, ఇంట్లో అంతకుముందే మరికొంత సొమ్ము నిల్వ ఉంచినట్లు సోదాల్లో స్పష్టమైంది. ఈ హవాలా మూలాలు ఇతర రాష్ట్రాలకు ఏమైనా విస్తరించి ఉన్నాయా అన్నది తేలాల్సి ఉంది. ప్రస్తుతం పట్టుబడిన నగదును ట్రెజరీకి తరలించిన పోలీసులు, ఐటీ శాఖకు పూర్తి నివేదికను పంపారు. ఐటీ అధికారులు ఈ డబ్బు మూలాలపై ఆరా తీసేందుకు సిద్ధమవుతున్నారు. పశ్చిమ గోదావరి జిల్లాలో ఇంత భారీ స్థాయిలో నగదు పట్టుబడటం ఇటీవలి కాలంలో ఇదే మొదటిసారి కావడంతో అధికారులు దీనిని సీరియస్‌గా తీసుకున్నారు. ఈ కేసులో మరిన్ని అరెస్టులు జరిగే అవకాశం ఉందని సమాచారం. చర్చి పాస్టర్ నివాసంలో బయటపడిన ఈ నోట్ల కట్టల ఉదంతం జిల్లాలో హాట్ టాపిక్‌గా మారింది. విచారణ పూర్తయితే కానీ ఈ గుప్త నిధుల వెనుక ఉన్న అసలు రహస్యాలు బయటకు రావు.

# ‘ఆ 30 వేల మంది మహిళలు ఏరీ?’

**కూటమి నేతల ఆగడాలపై ఎందుకు మౌనం?**

**పవన్ కల్యాణ్‌కు విడదల రజిని సూటి ప్రశ్న**

**రాష్ట్రవ్యాప్త ఆందోళనలకు వైఎస్సార్‌సీపీ పిలుపు..**

**గుంటూరు, ఏప్రిల్17:** ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌గతంలో చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ మాజీ మంత్రి విడదల రజిని తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రాష్ట్రంలో మహిళల భద్రత గాలికి వదిలేశారని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు అవుతున్నా మహిళా రక్షణలో ఘోరంగా విఫలమైందని ఆమె మండిపడ్డారు. శుక్రవారం గుంటూరులో మీడియా మరియు సోషల్ మీడియా వేదికగా ఆమె ప్రభుత్వ వైఖరిని ఎండగట్టారు. నాడు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు రాష్ట్రంలో 30 వేల మంది మహిళలు అదృశ్యమయ్యారని పవన్ కళ్యాణ్ చేసిన ఆరోపణలను విడదల రజిని గుర్తు చేశారు. “అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడుస్తున్నా, ఆ 30 వేల మంది మహిళల ఆచూకీ ఎందుకు కనిపెట్టలేదు? ఆ సంఖ్య నిజమైతే వారిని తిరిగి తీసుకురావడంలో ప్రభుత్వం సాధించిన ప్రగతి ఏమిటి?” అని ఆమె సూటిగా ప్రశ్నించారు. కేవలం ఎన్నికల్లో రాజకీయ లబ్ధి కోసమే నాడు అబద్ధపు ప్రచారం చేశారా అని ఆమె నిలదీశారు. రాష్ట్రవ్యాప్తంగా మహిళలపై లైంగిక దాడులు, వేధింపులకు పాల్పడుతున్న కూటమి ఎమ్మెల్యేలు, కీలక నేతలపై ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని రజిని ఆరోపించారు. “బాధితులకు అండగా ఉండాల్సిన ప్రభుత్వం, నేరస్తులకు రాజకీయ రక్షణ కల్పిస్తూ కేసులను నీరుగారుస్తోంది. అధికార పార్టీ నేతలకు ఒక చట్టం, ఇతరులకు మరో చట్టం అన్నట్లుగా పాలన సాగుతోంది” అని ఆమె విమర్శించారు. మహిళా సాధికారత గురించి గొప్పలు చెప్పే పవన్ కళ్యాణ్, తన కూటమి నేతల ఆగడాలపై ఎందుకు మౌనం వహిస్తున్నారని ధ్వజమెత్తారు. గత ప్రభుత్వంలో ఉన్న మహిళా రక్షణ వ్యవస్థలను నిర్వీర్యం చేసి, రాష్ట్రంలో ‘జంగిల్ రాజ్’ను తీసుకువచ్చారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలు ఒంటరిగా బయటకు వెళ్లాలంటే భయపడే పరిస్థితి నెలకొందని, హోం శాఖ కేవలం కంటితుడుపు చర్యలతో కాలం గడుపుతోందని విమర్శించారు. నిందితులకు రాజకీయ అండదండలు ఉండటం వల్లే నేరాలు పెరుగుతున్నాయని మండిపడ్డారు. ఇప్పటికైనా ప్రభుత్వం తన పాత మాటలను గుర్తుచేసుకుని, అదృశ్యమైన మహిళల వివరాలు మరియు భద్రతపై స్పష్టమైన ప్రకటన చేయాలని రజిని డిమాండ్ చేశారు. బాధితుల తరపున వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం పోరాటం కొనసాగిస్తుందని, తప్పు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోకపోతే రాష్ట్రవ్యాప్త ఆందోళనలు చేపడతామని ఆమె హెచ్చరించారు. ఈ పరిణామాలపై కేంద్ర ప్రభుత్వం కూడా దృష్టి సారించాలని ఆమె కోరారు.

# నారీ శక్తికి పట్టాభిషేకం

- పార్లమెంటులో ఏపీ మహిళా ప్రతినిధుల సందడి
- మహిళా రిజర్వేషన్ల బిల్లుపై సాగిన చారిత్రక చర్చ
- ఆంధ్రప్రదేశ్ మహిళా ప్రతినిధులతో రామ్మోహన్ నాయుడు భేటీ
- దేశాభివృద్ధిలో మహిళలు కీలక భాగస్వాములు కావాలని ఆకాంక్ష

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 17:** భారత పార్లమెంటు చరిత్రలో నిలిచిపోయే మహిళా రిజర్వేషన్ల రాజ్యాంగ సవరణ బిల్లుపై జరిగిన చర్చను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన మహిళా ప్రజా ప్రతినిధులు ప్రత్యక్షంగా వీక్షించారు. లోక్‌సభలో ఈ బిల్లుపై జరిగిన చర్చా విధానాన్ని, వివిధ పార్టీల నాయకులు వెలిబుచ్చిన అభిప్రాయాలను వారు గమనించారు. మహిళా సాధికారత దిశగా దేశం వేస్తున్న ఈ అడుగును స్వయంగా చూడటం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు. చట్టసభల్లో మహిళలకు ప్రాతినిధ్యం పెరగడం వల్ల సమాజంలో సమూల మార్పులు వస్తాయని ఈ సందర్భంగా ప్రతినిధులు అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు పార్లమెంట్ ఆవరణలో ఆంధ్రప్రదేశ్ మహిళా ప్రతినిధులతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. సభలో చర్చ జరిగిన తీరు, బిల్లులోని ముఖ్యాంశాల పట్ల వారి స్పందనను ఆయన అడిగి తెలుసుకున్నారు. మహిళా ప్రజా ప్రతినిధులు ఈ చర్చను ప్రత్యక్షంగా వీక్షించడం వారిలో మరింత ఉత్సాహాన్ని నింపుతుందని ఆయన పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో ప్రజలతో మమేకమయ్యే మహిళా నాయకులకు పార్లమెంటు పనితీరుపై అవగాహన ఉండటం ఎంతో అవసరమని ఆయన ఈ సందర్భంగా వివరించారు. మహిళా రిజర్వేషన్ బిల్లు చట్టంగా మారడం వల్ల దేశ ఉన్నతిలో నారీ శక్తి కీలక భాగస్వామ్యం కానుందని రామ్మోహన్ నాయుడు ధీమా వ్యక్తం చేశారు. నిర్ణయాధికారాల్లో మహిళలకు సరైన స్థానం దక్కినప్పుడే దేశం వేగంగా అభివృద్ధి చెందుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ చారిత్రక బిల్లు ద్వారా రాజకీయాల్లో మహిళల పాత్ర మరింత క్రియాశీలం కానుందని చెప్పారు. రాష్ట్రం నుంచి వచ్చిన మహిళా ప్రతినిధులు కూడా భవిష్యత్తులో జాతీయ రాజకీయాల్లో కీలక భూమిక పోషించాలని ఆయన ఈ సందర్భంగా ఆకాంక్షించారు. మహిళలకు ఈ గొప్ప అవకాశాన్ని కల్పించిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి, ఎన్డీయే కూటమి ప్రభుత్వానికి ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న ఈ సమస్యకు తమ ప్రభుత్వం ఒక స్పష్టమైన ముగింపు ఇచ్చిందని ఆయన పేర్కొన్నారు. నారీ శక్తికి గౌరవం కల్పించడమే కాకుండా, వారిని పాలనలో భాగస్వాములను చేసే క్రమంలో ఇదొక గొప్ప ముందడుగు అని కొనియాడారు. మహిళా రిజర్వేషన్ల అమలుతో దేశ రాజకీయ ముఖచిత్రమే మారిపోతుందని ఆయన ఈ సందర్భంగా ధీమా వ్యక్తం చేశారు. పార్లమెంటుకు వచ్చిన మహిళా ప్రతినిధులు చర్చను వీక్షించిన అనంతరం తమ అనుభవాలను రామ్మోహన్ నాయుడుతో పంచుకున్నారు. దేశ అత్యున్నత సభలో తమ హక్కుల గురించి చర్చ జరుగుతుంటే గర్వంగా ఉందని వారు పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ నుంచి వచ్చిన ఈ బృందం సభ్యులు ఒకరితో ఒకరు చర్చించుకుంటూ, తమ ప్రాంతాల్లో మహిళల సమస్యలపై మరింత గట్టిగా గళమెత్తుతామని ప్రతిజ్ఞ చేశారు. మొత్తానికి పార్లమెంటు వేదికగా జరిగిన ఈ భేటీ అటు ప్రతినిధుల్లోనూ, ఇటు రాజకీయ వర్గాల్లోనూ కొత్త ఉత్సాహాన్ని నింపింది.





# పోలవరం పరిసరాల్లో పెద్దపులి సంచారం

**భయాందోళనలో ప్రాజెక్ట్ కార్మికులు**

**పోలవరం, ఏప్రిల్ 17:** పశ్చిమ గోదావరి జిల్లాలోని ప్రతిష్టాత్మక పోలవరం ప్రాజెక్ట్ పరిసర ప్రాంతాల్లో పెద్ద పులి సంచారం తీవ్ర కలకలం రేపుతోంది. ప్రాజెక్ట్ పనుల్లో నిమగ్నమైన కార్మికుల కంట ఈ పులి పడటంతో భయాందోళన నెలకొంది. పెద్ద పులిని నేరుగా చూసిన కార్మికులు ప్రాణభయంతో పరుగులు తీశారు. జనసంచారం ఉన్న ప్రాంతంలోకి పులి రావడంతో ఎప్పుడు ఎవరిపై దాడి చేస్తుందన్న భయంతో కార్మికులు పనులకు వెళ్లేందుకు భయపడుతున్నారు. ఈ సమాచారం అందగానే ప్రాజెక్ట్ అధికారులు, అటవీ శాఖ అప్రమత్తమయ్యారు. రంగంలోకి దిగిన అటవీ శాఖ అధికారులు పులి మెడలో ’రేడియో కాలర్’ ఉండటాన్ని గుర్తించారు. దీని సహాయంతో పులి ప్రస్తుతం ఎక్కడ ఉంది? ఏ దిశగా వెళ్తోంది? అనే అంశాలను శాటిలైట్ సిగ్నల్స్ ద్వారా ఎప్పటికప్పుడు ట్రాక్ చేస్తున్నారు. పెద్దపులికి మత్తుమందు ఇచ్చి బంధించేందుకు రాజమండ్రి నుంచి ప్రత్యేక అనస్థీషియా నిపుణుల బృందం పోలవరానికి చేరుకుంది. పులి సంచరించే అవకాశం ఉన్న మార్గాల్లో బోన్లను ఏర్పాటు చేయడంతో పాటు, అటవీ సిబ్బంది గస్తీని ముమ్మరం చేశారు. పులి సంచరిస్తున్న నేపథ్యంలో ప్రాజెక్ట్ పరిసర ప్రాంతాల ప్రజలు, కార్మికులు ఒంటరిగా తిరగవద్దని, అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు.

# మత్స్యకారుల పేరుతో రాజకీయాలా?

- జగన్‌పై అచ్చెన్నాయుడు తీవ్ర విమర్శలు
- “కేంద్ర నిధులు దారి మళ్లింపు” ఆరోపణలు
- వేట నిషేధ భృతి 20 వేలకు పెంపు హైలైట్
- రూ.3,328 కోట్లతో హార్బర్ల అభివృద్ధి
- మత్స్యకారులకు అండగా కూటమి ప్రభుత్వం

**అమరావతి, ఏప్రిల్ 17 (మనసులో మాట):** మత్స్యకారుల సంక్షేమంపై రాజకీయ విమర్శలు మళ్లీ వేడెక్కాయి. మాజీ సీఎం ఎస్ జగన్‌పై రాష్ట్ర మత్స్య శాఖ మంత్రి అచ్చెన్నాయుడు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. హార్బర్ల అభివృద్ధి కోసం కేంద్రం విడుదల చేసిన నిధులను గత ప్రభుత్వం దారి మళ్లించిందని ఆరోపించిన ఆయన, మత్స్యకారుల హక్కులను జగన్ కాలరాసారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పెండింగ్ నిధులను విడుదల చేసి, కేంద్ర సబ్సిడీలు ఆగకుండా చర్యలు తీసుకున్నామని తెలిపారు. మత్స్యకార కుటుంబాల



సంక్షేమం కోసం వేట నిషేధ భృతిని రూ.10 వేల నుంచి రూ.20 వేలకు పెంచినట్లు మంత్రి వెల్లడించారు. ఇప్పటికే ఒకే ఏడాదిలో రూ.242 కోట్లకు పైగా ఆర్థిక సాయం అందించామని చెప్పారు. డీజిల్ సబ్సిడీ పథకం కింద పడవలకు లీటరుకు రూ.9 చొప్పున సబ్సిడీ అందిస్తున్నట్లు వివరించారు. అదేవిధంగా సామాజిక భద్రతా పింఛనును రూ.3,000 నుంచి రూ.4,000కు పెంచినట్లు పేర్కొన్నారు. గతంలో పెండింగ్‌లో ఉన్న ప్రమాద మరణ పరిహారం క్లెయిమ్స్‌ను పరిష్కరించి, బాధిత కుటుంబాలకు కోట్ల రూపాయలు చెల్లించామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఫిషింగ్ హార్బర్ల నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని, రూ.3,328 కోట్ల వ్యయంతో 10 హార్బర్ల అభివృద్ధి జరుగుతోందని మంత్రి చెప్పారు. ఉప్పాడ, మచిలీపట్నం, నిజాంపట్నం ప్రాంతాల్లో పనులు శరవేగంగా జరుగుతున్నాయని వివరించారు. మత్స్యకారుల అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని, వారి జీవన ప్రమాణాలు మెరుగుపరచడమే లక్ష్యమని అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి.

# కూటమిలో రాజ్యసభ రేసు

**ఊహించని పేర్లు తెరపైకి!**

**నాలుగు స్థానాల కోసం అభ్యర్థుల వేట..**

- టీడీపీ, బీజేపీ, జనసేనల్లో ఉత్కంఠ
- సానా సతీష్ బాబుకు రెండో ఛాన్స్?
- కృష్ణ ఎల్లా ఎంట్రీతో మారిన లెక్కలు
- ముస్లిం కోటాలో షరీఫ్.. జనసేన నుంచి విశ్వప్రసాద్ పేరు హల్‌చల్
- ఢిల్లీలో చక్రం తిప్పేదెవరు? ఆశావహుల్లో మొదలైన టెన్షన్



**అమరావతి, ఏప్రిల్17:** ఆంధ్రప్రదేశ్‌లో ఖాళీ అవుతున్న నాలుగు రాజ్యసభ స్థానాలకు సంబంధించి కూటమి పార్టీల్లో కసరత్తు ముమ్మరమైంది. సంఖ్యాబలం దృష్ట్యా ఈ నాలుగు స్థానాలు కూటమికే దక్కడం ఖాయం కావడంతో, ఆశావహుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. సీట్ల సర్దుబాటు విషయంలో టీడీపీ మూడు స్థానాలపై పట్టుబడుతుండగా, బీజేపీ, జనసేన తమ కోటా కోసం పట్టు వీడటం లేదు. టీడీపీ కోటాలో ప్రస్తుత సభ్యుడు సానా సతీష్ బాబుకు రెండోసారి అవకాశం దక్కుతుందనే ప్రచారం బలంగా సాగుతోంది. ఒకవేళ ఆయనకు అవకాశం ఇవ్వని పక్షంలో ఢిల్లీలో పార్టీకి సంబంధించిన కీలక బాధ్యతలు అప్పగించే యోచనలో అధిష్ఠానం ఉంది. మరోవైపు, భారత్ బయోటెక్ ఎండీ కృష్ణ ఎల్లా పేరు తెరపైకి రావడం ఆసక్తికరంగా మారింది. ఆయన ఎంట్రీతో చిత్తూరు జిల్లాకే చెందిన గల్లా జయదేవ్ అవకాశాలపై ప్రభావం పడే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. ముస్లిం మైనారిటీ కోటా కింద మాజీ మండలి ఛైర్మన్ షరీఫ్ పేరును చంద్రబాబు పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. గతంలో మూడు రాజధానుల బిల్లును అడ్డుకోవడంలో ఆయన పోషించిన పాత్ర ఆయనకు ప్లస్ కానుంది. అలాగే, 17 ఏళ్లుగా పార్టీకి సేవలు అందిస్తున్న కోనేరు సురేష్, విద్యావేత్త భాష్యం రామకృష్ణ, కిలారు రాజేశ్ పేర్లు కూడా పరిశీలనలో ఉన్నాయి. బీజేపీ తన కోటా కింద దక్షిణాదిలో పార్టీని బలోపేతం చేసిన అన్నామలై లేదా మాజీ సీఎం నల్లారి కిరణ్ కుమార్ రెడ్డిని పెద్దల సభకు పంపాలని యోచిస్తోంది. ఇక జనసేన విషయానికి వస్తే, మొదటి నుంచీ లింగమనేని రమేశ్ పేరు వినిపించినప్పటికీ, తాజాగా ప్రముఖ నిర్మాత టీజీ విశ్వప్రసాద్ పేరు తెరపైకి రావడం చర్చనీయాంశమైంది. నాలుగు స్థానాల కోసం దాదాపు డజనుకు పైగా అభ్యర్థులు పోటీ పడుతుండటంతో ఎంపిక ప్రక్రియ సంక్లిష్టంగా మారింది. అటు ఢిల్లీ పెద్దల ఆశీస్సులు, ఇటు స్థానిక సామాజిక సమీకరణాలను బేరీజు వేసి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు త్వరలోనే తుది జాబితాను ప్రకటించనున్నారు. అప్పటి వరకు ఈ ‘రాజ్యసభ’ ఉత్కంఠ కొనసాగేలా కనిపిస్తోంది

# ఎఫ్.ఎల్.ఎన్ లక్ష్య సాధనలో పెద్దపల్లి జిల్లా ముందంజలో ఉండాలి.

- జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష
- రీడింగ్ కాంప్రెహెన్షన్, రైటింగ్, గణిత నైపుణ్యాలపై ప్రత్యేక దృష్టి
- ఉపాధ్యాయుల వినూత్న బోధన పద్ధతులతో మెరుగైన ఫలితాలు సాధించాలి
- వచ్చే విద్యా సంవత్సరానికి సమగ్ర ప్రణాళికలు రూపొందించాలిలి
- ఎఫ్.ఎల్.ఎన్ ఛాంపియన్ పాఠశాలలకు ప్రశంస పత్రాలు ప్రదానం



**పెద్దపల్లి, ఏప్రిల్-17( సమయం న్యూస్). :** ఎఫ్.ఎల్.ఎన్ లక్ష్యాలను సమర్థవంతంగా అమలు చేసి, ప్రాథమిక స్థాయిలో విద్యార్థుల భాషా, గణిత నైపుణ్యాలను పెంపొంది ంచడంలో పెద్దపల్లి జిల్లా ముందంజలో నిలవాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. శుక్రవారం పెద్దపల్లి జిల్లాలోని ఎంబీ గార్డెన్‌లో నిర్వహించిన లిఖీంచీ ణఱరీఅఱఐ జశీఅఓ్రీఖజవ - 2025-26లి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొని, ప్రాథమిక మరియు ప్రాథమికోన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో ప్రాజెక్టర్ ద్వారా ఎఫ్.ఎల్.ఎన్ జిల్లా రివ్యూ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తమ ఫలితాలు సాధించిన పాఠశాలలను ఎఫ్.ఎల్.ఎన్ ఛాంపియన్ పాఠశాలలుగా ఎంపిక చేసి ప్రశంస పత్రాలు అందజేశారు. ఉపాధ్యాయులు విద్యార్థుల పఠన అవగాహన (=ఋఎఱఅస్త్ర జశీఎజూతీవ- ష్ట్రవఅంఱశీఅ - =జ) మెరుగుపరచడానికి అనుసరించిన బోధన పద్ధతులు, భాషలలో రచనా నైపుణ్యం (ఔతీఙఱఅస్త్ర జశీఎజూవీవఅఎఎ), గణితంలో గుణకం, భాగహారం (వీబశ్రీఅజూశ్రీఙఆ్ఞఅశీఅ ఉ ణఱఙఱఆంఅశీఅ) నైపుణ్యాల పెంపుకు చేపట్టిన తరగతి గది చర్యలపై తమ అనుభవాలను పంచుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ, బేస్‌లైన్, మిడ్‌లైన్, ఎండ్‌లైన్ పరీక్షల ఫలితాలను విశ్లేషించి, విద్యార్థుల అభ్యాస స్థాయిని నిరంతరం మెరుగుపరచాలని సూచించారు. మండలాల వారీగా ఫలితాలను సమీక్షిస్తూ, లోపాలు ఉన్న చోట ప్రత్యేక చర్యలు తీసుకోవాలని తెలిపారు. వచ్చే విద్యా సంవత్సరానికి ముందస్తుగా ప్రణాళికలు రూపొందించి, ప్రతి విద్యార్థి ప్రాథమిక నైపుణ్యాలు, రీడింగ్ కాంప్రెహెన్షన్ సామర్థ్యాలను పెంపొందించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఆదేశించారు. అలాగే గడ్డం జగదీశ్వర్, ఆర్. కిరణ్, కృష్ణ రెడ్డి, రవి, ప్రభాకర్ రెడ్డి, దేవేందర్ రెడ్డి, పుష్పలత తదితరులకు జిల్లా కలెక్టర్ ప్రత్యేక ప్రశంస పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సూపర్ సమ్మర్ క్యాంప్ వీడియోను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి జి.శారద, జిల్లా అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ డాక్టర్ పి.ఎం.షేక్, అలోక్ ప్రాజెక్ట్ సి.ఈ.ఓ. ప్రమోద్, ప్రతినిధి సమీద్ అహ్మద్, జిల్లాలోని ఎం.ఈ.ఓలు, కాంప్లెక్స్ హెడ్‌మాస్టర్లు, జిల్లా రిసోర్స్ టీం సభ్యులు పాల్గొన్నారు.

# ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

- TGEJAC డిమాండ్
- తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించిన నాయకులు




**కొడంగల్ మున్సిపల్, ఏప్రిల్,17(సమయం న్యూస్) :** కొడంగల్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు మరియు పెన్షనర్ల దీర్ఘకాలిక సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ సంయుక్త యాక్షన్ కమిటీఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక తహసీల్దార్ పి.రాంబాబుకు వినతిపత్రం సమర్పించారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్త నిరసనలో భాగంగా, భోజన విరామ సమయంలో ఉద్యోగులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ౧+జుజీూజ కన్వీనర్ అబ్దుల్ హక్, జనరల్ సెక్రటరీ అశోక్, మరియు ప్రెసిడెంట్ విష్ణు కుమార్ మాట్లాడుతూ, గత కొంతకాలంగా ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లు పెండింగ్‌లో ఉండటం వల్ల వేలాది కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

**నాలుగు ప్రధాన డిమాండ్లు:**

2 వ PRC అమలు: జూన్ 2, 2026 లోపు 2వ PRC నివేదికను తెప్పించుకొని 51% ఫిట్ మెంటు తో PRC అమలు చేయాలి

2. పెండింగ్‌లో ఉన్న DA/DR లతో కలిపి అన్ని రకాల బకాయిలను వెంటనే విడుదల చేయాలి.

**బకాయి బిల్లుల చెల్లింపు:** పెన్షనర్లకు సంబంధించిన సుమారు ₹13,000 కోట్ల బకాయి బిల్లులను తక్షణమే చెల్లించాలి.

3. **EHS హెల్త్ కార్డులు:** నగదు రహిత వైద్యం కోసంనూతన విధి విధానాలు రూపొందించి కొత్త హెల్త్ కార్డులను జారీ చేసి, మే 1 నుండి పథకాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయాలి.

4. **OPS పునరుద్ధరణ:** సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని (ూూ) పునరుద్ధరించాలి.

**పాల్గొన్న నాయకులు:** ఈ కార్యక్రమంలో TGEJAC వికారాబాద్ జిల్లా కో - కన్వీనర్ ూఖూ జిల్లా అధ్యక్షులు వేణుగోపాల్, TSGREA ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణ, PRTUTS మండల ప్రధాన కార్యదర్శి దినేష్ సింగ్ లతో పాటు ూఖూ జిల్లా మరియు రాష్ట్ర నాయకులు ఆనంద్ రావు, గోపీనాథ్, వెంకటేశం, నర్సింహులు, రజిత, వెంకటయ్య పాల్గొన్నారు. ప్రభుత్వం స్పందించని పక్షం లో రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని నాయకులు హెచ్చరించారు. ఇట్లు, TGEJAC కొడంగల్ మండల యూనిట్



# ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి జేఏసీ వినతిపత్రాలు

**హైదరాబాద్, ఏప్రిల్ 17( సమయం న్యూస్). :** రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ ఎంప్లాయిస్ టీచర్స్ అండ్ పెన్షనర్స్ జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) ఆధ్వర్యంలో ఈ రోజు మండల, డివిజన్ కేంద్రాల్లో వినతిపత్రాలు సమర్పించారు.

ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్ లచ్చిరెడ్డి నాయకత్వంలో ఎంఎవత్ఝుఝిఎ లో ఆర్డీవో రామకృష్ణకు వినతిపత్రం అందజేశారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారమే తమ లక్ష్యమని నాయకులు తెలిపారు. జేఏసీ చైర్మన్ లచ్చిరెడ్డి, సెక్రటరీ జనరల్ ఏొడ్నాల రాజశేఖర్ మాట్లాడుతూ ఉద్యోగులు, పెన్షనర్లకు సంబంధించిన పలు కీలక డిమాండ్లను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని కోరారు. జూన్ 2 నాటికి పీఆర్సీ అమలు చేయాలని, రిటైరైన ఉద్యోగుల పెండింగ్ బిల్లులను క్లియర్ చేయాలని, ఉద్యోగులకు హెల్త్ కార్డులను వెంటనే అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. అలాగే సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ విధానాన్ని పునరుద్ధరించాలని, 2004 సెప్టెంబర్ 1కి ముందు నోటిఫికేషన్ ఇచ్చిన తర్వాత నియామకమైన ఉద్యోగులకు ఓపీఎస్ అమలు చేయాలని పేర్కొన్నారు. ఇతరంగా పెండింగ్ డీఏలను విడుదల చేయాలని, 61 సంవత్సరాలు నిండిన వీఆర్ఏల సమస్యలను పరిష్కరించాలని, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని, ఉద్యోగులు--ఉపాధ్యాయులకు సాధారణ బదిలీలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని కోరిన జేఏసీ నాయకులు, సమస్యలు పరిష్కారం కాకపోతే భవిష్యత్తులో మరింత తీవ్ర ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.



# వన్యప్రాణుల సంరక్షణకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలి

- అక్రమ రవాణాపై చెక్ పోస్టులతో నిఘా పెంపు
- అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే

**కరీం నగర్ 17( సమయం న్యూస్).:** వన్యప్రాణుల సంరక్షణకు మరింత పకడ్బందీ చర్యలు తీసుకోవాలని స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే అధికారులను ఆదేశించారు. ఈ మేరకు గురువారం సాయంత్రం నిర్వహించిన వన్యప్రాణి సంరక్షణ కమిటీ సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. అదనపు జిల్లా కలెక్టర్ (లోకల్ బాడీస్) అశ్విని తానాజీ వాకడే అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రాజన్న సిరిసిల్ల, కరీంనగర్ జిల్లాలకు చెందిన అటవీ శాఖ అధికారులు పాల్గొన్నారు. రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్లు, ఫ్లయింగ్ స్క్వాడ్ పార్టీ అధికారులు, స్పెషల్ బ్రాంచ్ పోలీస్ ప్రతినిధులు హాజరయ్యారు. వన్యప్రాణుల అక్రమ రవాణా నివారణపై ప్రత్యేక దృష్టి సారించిన అధికారులు, వన్యప్రాణి సంరక్షణ చట్టం--1972ను కఠినంగా అమలు చేయాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే మాట్లాడుతూ అడవి జంతువులు, పక్షుల అక్రమ తరలింపును అరికట్టేందుకు శాఖల మధ్య సమన్వయం పెంచాలని సూచించారు. ముఖ్యంగా సరిహద్దు ప్రాంతాలు.. కీలక మార్గాల్లో చెక్ పోస్టులు ఏర్పాటు చేసి, అనుమానాస్పద వాహనాలపై కఠిన తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. సంయుక్త చర్యలతో వన్యప్రాణి సంరక్షణను మరింత బలోపేతం చేయాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా అటవీ శాఖ అధికారి బాలమని, కరీంనగర్ ఆర్డీఓ మహేశ్వర్ అటవీ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ రాష్ట్ర జైళ్ల శాఖ డైరెక్టర్ జనరల్ డాక్టర్ సౌమ్యమిశ్రాను జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్,

- జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ నరసింహ మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కలు అందించారు.



ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొనేందుకు జిల్లాకు వచ్చిన రాష్ట్ర జైళ్ల శాఖ డైరెక్టర్ జనరల్ సౌమ్య మిశ్రను సూర్యాపేట పట్టణం కృష్ణవేణి పోలీస్ అతిథి గృహం నందు జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పి శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిసి స్వాగతం పలికారు.

# ఆసుపత్రిలో మెరుగైన సేవలు ప్రజలకు అందించాలి

- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష
- గోదావరిఖని జనరల్ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్
- సీసీ రోడ్డు పనులు, పరిశుభ్రత, శానిటేషన్ పనితీరును మెరుగుపర్చాలని అధికారుల సూచన
- అదనపు ఓపీ బ్లాక్ ఏర్పాటు పై ప్రత్యేక దృష్టి



**పెద్దపల్లి, ఏప్రిల్-17( సమయం న్యూస్) :** శుక్రవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష (రామగుండం)గోదావరిఖని జనరల్ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసి,ఆసుపత్రిలోని మెడికల్ ఓపీ, న్యూ బ్లాక్, ఐసీయూ బ్లాక్, ఎమర్జెన్సీ విభాగం, డ్యూటీ డాక్టర్స్ గదులను పరిశీలించి,రోగులకు అందుతున్న వైద్య సేవలపై వివరాలు తెలుసుకుని, అవసరమైన సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, ఆసుపత్రి ప్రాంగణంలో జరుగుతున్న సీసీ రోడ్డు పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఇంజనీర్లను ఆదేశించారు. శానిటేషన్ పనితీరును మెరుగుపర్చాలని సంబంధిత ఏజెన్సీకి సూచిస్తూ, తక్షణమే తనను కలవాలని ఆదేశించారు. రోగుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని బెడ్ స్ట్రెంగ్త్ పెంపు కోసం చర్యలు చేపట్టాలని, మెడిసిన్ విభాగానికి అదనంగా ఒక ఓపీ బ్లాక్ ఏర్పాటు చేయాలని సూచించారు. ల్యాబ్ యంత్రాలు, ఏసీ వంటి పరికరాల్లో ఎలాంటి లోపాలు వచ్చినా వెంటనే మరమ్మత్తులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో కలెక్టర్ వెంట డాక్టర్ లు కృపా బాయి,రాజు,సంబంధిత అధికారులు, ఆసుపత్రి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఎక్కతుర్తి ఎస్ ఐ సస్పెన్షన్

**హన్మకొండ ,ఏప్రిల్17( సమయం న్యూస్,) :** ఎల్కతుర్తి ఎస్. ఐ ప్రవీణ్ కుమార్ పై వచ్చిన ఆరోపణలు నిర్ధారణ అయినట్లుగా అధికారులు ఇచ్చిన నివేదిక ఆధారంగా ఎల్కతుర్తి ఎస్. ఐ ప్రవీణ్ కుమార్ ను ఏ. ఆర్ కు అటాచ్డ్ చేస్తూ వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ ఉత్తర్వులు జారీ చేశారు.

# ఎస్సీ కార్పొరేషన్ ద్వారా పాడి గేదెల పథకానికి ఆన్ లైన్ దరఖాస్తు గడువు పొడిగింపు

- జిల్లా షెడ్యూల్డ్ కులముల సేవా సహకార అభివృద్ధి అధికారి కె.శ్రీనివాస రావు

**మహబూబాబాద్, ఏప్రిల్.17( సమయం న్యూస్) :** జిల్లా షెడ్యూల్డ్ కులముల సేవా సహకార అభివృద్ధి సంఘం లి., మహబూబాబాద్ జిల్లా ద్వారా 2025-26 సం. నకు పాడి గేదెల పథకానికి గాను ఆన్ లైన్ దరఖాస్తు తేది 16-04-2026 ముగియడంతో ప్రభుత్వం గడువు తేదీని 23-04-2026 వరకు పొడిగించనైనదని జిల్లా షెడ్యూల్డ్ కులముల సేవా సహకార అభివృద్ధి అధికారి కె.శ్రీనివాస రావు నేడు ఒక ప్రకటనలో తెలిపారు. కావున అర్హులైన షెడ్యూల్డ్ కులములకు చెందిన యువతీ / యువకులు సంబందిత కుల ధృవీకరణ పత్రం (తెలంగాణా ఏర్పడిన తరవాత జారీ చేసింది), ఆదాయ ధృవీకరణ పత్రం (మీసేవ ద్వారా జారీ చేసింది). ఆధార్ కార్డు, రేషన్ కార్డు/ఫుడ్ సెక్యూరిటీ కార్డు, పాస్ పోర్ట్ సైజు పోటో, సదరం సర్టిఫికేట్ (వికలాంగుల కోసం) మరియు పట్టాదారు పాసు పుస్తకం (కనీసం 0.10 గుంటలు), దృవ పత్రాలతో తేది 23-04-2026 వరకు ఆన్ లైన్ (ఌఌఌ.స్త్రశీఎఎం.ఎస్త్రస్త్ర.స్త్రశీజ.ఱఅ) నందు దరఖాస్తు చేసుకొని, వెంటనే అట్టి ఆన్లైన్ దరఖాస్తుకు సంబంధిత దృవ పత్రాలను జత పరిచి (హార్డ్ కాపీ), (గ్రామీణ ప్రాంతం వారు సంబంధిత వీూఖూ కార్యాలయము నందు మరియు పట్టణ ప్రాంతం వారు సంబంధిత మునిసిపాలిటి కార్యాలయము నందు సమర్పించాలని తెలిపారు. ఈ పథకం ద్వారా అర్హులైన లబ్ధిదారులకు (02) పాడి గేదెలను అందజేయడం జరుగుతుందని, ఈ అవకాశాన్ని అర్హులైన వారు సద్వినియోగం చేసుకోగలరని ఈ సందర్భంగా అధికారి పేర్కొన్నారు.

# 104 ఫిక్స్ డే హెల్త్ సర్వీసెస్ వాహన వేలం నిర్వహణ

- జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా.రవి రాథోడ్

**మహబూబాబాద్, ఏప్రిల్.17( సమయం న్యూస్). :** మహబూబాబాద్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో గల 104 ఫిక్స్ డే హెల్త్ సర్వీసెస్ 05 వాహనాలకు ఈ నెల 23 న వేలం నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. బి. రవి రాథోడ్ నేడు ఒక ప్రకటనలో తెలిపారు. స్వరాజ్ మజ్దా కంపెనీ కి చెందిన 05 వానాలకు ఈ నెల 23న జిల్లా కేంద్రంలోని ఆర్టిఓ కార్యాలయం ప్రక్కన గల స్థలములో వేలం నిర్వహిస్తారని, ఆసక్తి గల వారు 1000 (నాన్ రిఫండ్) జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి, మహబూబాబాద్ వారి పేరు మీద డి.డి. తీసి వేలం లో పాల్గొనాలని తెలిపారు. మరిన్ని వివరాల కోసం జిల్లా వైద్యాధికారి కార్యాలయం లో తేది.18.04.2026 నుండి 22.04.2026 వరకు ఉదయం 11 గంటల నుండి 4 వరకు సెల్ నెం.7659882067 లో సంప్రదించగలరని అధికారి ఈ సందర్భంగా పేర్కొన్నారు.

## పాడి గేదెల పెంపకం పథకానికి దరఖాస్తు గడువు ఏప్రిల్ 23 వరకు పొడిగింపు

■ కార్యనిర్వహక సంచాలకులు జి. శ్రావణ్ కుమార్

**పెద్దపల్లి, ఏప్రిల్ -17,( సమయం న్యూస్) :** వార్షిక ప్రణాళిక 2025-26 సంవత్సరానికి గాను జిల్లాలో అమలు చేస్తున్న 2 పాడి గేదెల పెంపకం పథకానికి సంబంధించి ఆన్లైన్ దరఖాస్తుల గడువును ఏప్రిల్ 23 వరకు పొడిగించినట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల సహకార అభివృద్ధి సంస్థ లిమిటెడ్ కార్యనిర్వహక సంచాలకులుజి.శ్రావణ్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.జిల్లాలోని ఎస్సీ వర్గానికి చెందిన నిరుద్యోగ యువతి, యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఇప్పటికే ఆన్లైన్‌లో దరఖాస్తు చేసిన అభ్యర్థులు సంబంధిత మున్సిపల్ , మండల పరిషత్ కార్యాలయాల్లో తమ దరఖాస్తులను సమర్పించాలని సూచించారు.పథకానికి దరఖాస్తు చేసుకోవాలనుకునే అభ్యర్థులు ఆధార్ కార్డు, రేషన్ కార్డు/ఫుడ్ సెక్యూరిటీ కార్డు, కుల ధృవీకరణ పత్రం (మీసేవ జారీ చేసినది), ఆదాయ ధృవీకరణ పత్రం (మీసేవ జారీ చేసినది), పాస్‌పోర్ట్ సైజు ఫోటోలు సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు.అదేవిధంగా, పాడి గేదెల పథకం కోసం కనీసం 10 గుంటల భూమి కలిగి ఉండటం తప్పనిసరి అని పేర్కొన్నారు.ఆసక్తి గల అభ్యర్థులు ఏప్రిల్ 20లోపు https://tgobmms.cgg.gov.in వెబ్‌సైట్‌లో ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కార్యనిర్వహక సంచాలకులు ఆ ప్రకటనలో తెలిపారు.

## నేతన్న భరోసా ద్వారా 20 లక్షల సహాయం పంపిణీ.



**హనుమకొండ, ఏప్రిల్17( సమయం న్యూస్) :** ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా నేతన్నల కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు ప్రభుత్వం "నేతన్న భరోసా" పథకాన్ని అమలు చేయనుంది. హనుమకొండ జిల్లాలో సుమారు ₹20 లక్షల మేర ఈ పథకం ద్వారా సహాయం అందించనున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు.చేనేత కార్మికుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశపెట్టిందని, అర్హులైన లబ్ధిదారులకు నేరుగా ఆర్థిక సహాయం అందజేస్తామని పేర్కొన్నారు.జిల్లాలో నమోదు చేసిన చేనేత కార్మికులకు నెలకు కనీసం ₹5,000 నుంచి గరిష్టంగా ₹20, 000 వరకు ఆదాయం వచ్చేలా చర్యలు తీసుకుంటున్నామని అధికారులు వెల్లడించారు.

**ఆర్థిక భరోసా కింద లభించే ప్రయోజనాలు:** పొదుపు మద్దతు: బ్యాంకుల ద్వారా గ్రూపులుగా ఏర్పాటు చేసి రుణ సదుపాయాలు.కుటుంబ మద్దతు: విద్య, ఆరోగ్య అవసరాలకు ప్రత్యేక సహాయం.ఈ పథకం ద్వారా చేనేత కార్మికుల జీవనోపాధి మెరుగుపడటంతో పాటు వారి ఆర్థిక స్థితి బలపడుతుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు.

## కోస్గి 12వ వార్డులో ట్రాన్స్ఫారం ప్రారంభించిన.. మున్సిపల్ చెర్మెన్ నాగులపల్లి నరేందర్



**కోస్గి మున్సిపల్, ఏప్రిల్,17(సమయం న్యూస్) :** నారాయణపేట జిల్లా కోస్గి మున్సిపల్ పరిధిలోని కౌన్సిలర్ మాస్టర్ శ్రీనివాస్ (12వ వార్డులో) ట్రాన్స్ఫారం ప్రారంభించిన కోస్గి మున్సిపల్ చైర్మన్ నాగులపల్లి నరేందర్ అలాగే శంభుని గుడి దగ్గర రోడ్డు పనులు పరిశీలించడం జరిగింది...ఇట్టి కార్యక్రమంలో కోస్గి మున్సిపల్ కౌన్సిలర్లు కో ఆప్షన్ మెంబర్లు మరియు కోస్గి కాంగ్రెస్ పార్టీ నాయకులు,తదితరులు పాల్గొన్నారు.

## కులగణన తర్వాతే డీలిమిటేషన్ చేయాలి

■ ఢిల్లీలో బీసీ సంఘాల మెరుపు ధర్నా

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 17:( సమయం న్యూస్). :** దేశ రాజధాని ఢిల్లీలో బీసీ సంఘాలు మెరుపు ధర్నా నిర్వహిస్తూ కులగణన పూర్తి చేసిన తర్వాతే డీలిమిటేషన్ చేపట్టాలని గట్టిగా డిమాండ్ చేశాయి. నిరసనలో భాగంగా డీలిమిటేషన్‌కు సంబంధించిన పత్రాలను చింపివేసి తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు.బీసీ నాయకులు మాట్లాడుతూ, డీలిమిటేషన్ వల్ల బీసీలకు ఎలాంటి ప్రయోజనం ఉండదని పేర్కొన్నారు. అసెంబ్లీ, పార్లమెంట్ స్థానాలు పెంచినా మహిళా రిజర్వేషన్ పేరుతో అవి మళ్లీ అగ్రకులాలకే దక్కే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా కులగణన పూర్తి చేసి జనాభా ప్రాతిపదికన బీసీలకు రిజర్వేషన్లు పెంచాలని డిమాండ్ చేశారు. మహిళా రిజర్వేషన్ బిల్లులో బీసీ మహిళలకు ప్రత్యేక సబ్‌కోటా కల్పించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం మహిళా బిల్లు, డీలిమిటేషన్ బిల్లులను యథాతథంగా ఆమోదిస్తే దేశవ్యాప్తంగా బంద్‌కు పిలుపునిస్తామని హెచ్చరించారు.మాజీ ఎంపీ వి. హనుమంతరావు మాట్లాడుతూ, మహిళా బిల్లు పేరుతో బీసీలను రాజకీయంగా పక్కనబెట్టే ప్రయత్నం జరుగుతోందని విమర్శించారు. దేశంలోని కోట్లాది బీసీ మహిళల సమస్యలను కేంద్రం పట్టించుకోవడం లేదన్నారు.బిఆర్ఎస్ నేతలు మధుసూదనాచారి, శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ, బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం పెంచకుండా డీలిమిటేషన్ చట్టం చేస్తే ఉపయోగం ఉండదని పేర్కొన్నారు. బీసీ హక్కుల కోసం దేశవ్యాప్తంగా పోరాటాన్ని కొనసాగిస్తామని తెలిపారు.ఏపీ బీసీ సంఘాల అధ్యక్షుడు కేసిన శంకర్రావు మాట్లాడుతూ, మహిళా రిజర్వేషన్ బిల్లులో బీసీ మహిళలకు సబ్‌కోటా ఇవ్వకపోతే కేంద్ర ప్రభుత్వంపై తిరగబడతామని హెచ్చరించారు.దేశవ్యాప్తంగా బీసీలకు న్యాయం చేయాలని, వారి రాజకీయ ప్రాతినిధ్యాన్ని పెంచాలని డిమాండ్ చేస్తూ బీసీ సంఘాలు తమ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయనున్నట్లు స్పష్టం చేశాయి.

# దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

■ ఇల్లూరి క్రాంతి కుమార్ జిల్లా ప్రధాన కార్యదర్శి తెలంగాణ సిపిఎస్ ఉద్యోగుల సంఘం




**కొడంగల్ మున్సిపల్, ఏప్రిల్,17(సమయం న్యూస్) :** న్యాయబద్ధమైన డిమాండ్లను వెంటనే అమలు చేయాలి-తెలంగాణ ఉద్యోగుల జేఏసీ డిమాండ్-మధ్యాహ్న భోజన విరామ సమయంలో అధికారులకు వినతిపత్రాలుప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఈ రోజు తెలంగాణ ఎంప్లాయిస్ టీచర్స్ & పెన్షనర్స్ జాయింట్ యాక్షన్ కమిటీ (టీజీఈ జేఏసీ) పిలుపులో భాగంగా కొడంగల్.తహసీల్దార్ పి.రాం బాబు కు వినతిపత్రం అందించడం జరిగిందని జేఏసీ ప్రతినిధులు తెలిపారు. ఉద్యోగుల డిమాండ్ల పరిష్కారమే లక్ష్యంగా టీజీఈజేఏసీ ప్రకటించిన కార్యచరణలో భాగంగా శుక్రవారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో స్థానిక తహసీల్దార్ కు వినతిపత్రం సమర్పించిన అనంతరం వారు మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ రాష్ట్రంలో దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల సమస్యలను సత్వరం పరిష్కరించాలని కోరారు. టీజీఈ జేఏసీ చైర్మన్ లచ్చిరెడ్డి , సెక్రటరీ జనరల్ వొడ్నాల రాజశేఖర్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్ళిన అనేక సమస్యలలో కొన్ని సమస్యలు పరిష్కారమైనప్పటికీ ఇంకా అనేక సమస్యలు, నేటికి పెండింగ్‌లోనే ఉన్నాయని అవేదన వ్యక్తం చేశారు. ఇదే విషయాన్ని వివిధ రూపాలలో సీఎస్,ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్లడం జరుగుతుందని, పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని,న్యాయబద్ధమైన డిమాండ్లను వెంటనే అమలు చేయాలని వారు కోరారు. జూన్ 2వ తేదీ నాటికి ప్రభుత్వ ఉద్యోగులకు పీఆర్సీ ప్రకటించాలని తెలంగాణ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ మండల ప్రతినిధులు అన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా తమ కార్యాచరణ ఉంటుందన్నారు. 2026 జూన్ 2వ తేదీ నాటికి పీఆర్సీ అమలుతో పాటు పెండింగులో ఉన్న ఐదు డీఏలను విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. రిటైర్డ్ ఉద్యోగులకు సంబంధించిన పెండింగ్ బిల్స్ అన్నీ క్లియర్ చేయాలని, అలాగే రిటైర్డ్ ఉద్యోగులతో పాటు ప్రభుత్వ ఉద్యోగులకు హెల్త్ కార్డ్స్ జారీ చేసి తక్షణమే అమలు చేయాలని ప్రభుత్వాన్ని అభ్యర్థించారు. సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ విధానంను పునరుద్ధరించాలని, కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు 2004 సెప్టెంబర్ 1వ తేదీకి ముందు నోటిఫికేషన్ వేసి తర్వాత నియామకమైన ఉద్యోగులకు వెంటనే ఓపీఎస్ విధానమును అమలు చేయాలని కోరారు. గతంలో ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం 61 సంవత్సరాలు నిండిన వీఆర్ఏల వారసుల ఉద్యోగ నియామక సమస్యను సత్వరం పరిష్కరించాలని కోరారు. అలాగే ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. త్వరలో జనాభా లెక్కల కార్యక్రమం ఉన్నందున ఉద్యోగ, ఉపాధ్యాయులకు సంబంధించిన సాధారణ బదిలీలు చేపట్టాలన్నారు.ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమం లో..ఇల్లూరి క్రాంతికుమార్ జిల్లా ప్రధాన కార్యదర్శి తెలంగాణ సిపిఎస్ ఉద్యోగుల సంఘం, (వికారాబాద్)మరియుకొండన్న టి ఎన్ జి ఓ కొడంగల్ తాలూకా ప్రెసిడెంట్ తదితరులు పాల్గొన్నారు.

# పంచాయతీరాజ్ చట్టంలో నిబంధనలకు లోబడి గ్రామ పాలన కొనసాగాలి కలెక్టర్

- ప్రతి సర్పంచ్ గ్రామానికి లీడర్ గా వ్యవహరించాలి.
- సమ్మర్ యాక్షన్ ప్లాన్ తో గ్రామాలలో డ్రింకింగ్ వాటర్
- సమస్యలను నిర్మూలించాలి
- ప్రత్యేక అధికారి, పంచాయతీ కార్యదర్శి, సర్పంచ్ సమన్వయంతో గ్రామంలో సుపరిపాలన అందించాలి.
- 15వ ఆర్థిక సంఘం విధుల వినియోగంపై సర్పంచులు పంచాయతీ కార్యదర్శులకు వర్క్ షాప్ నిర్వహణ
- గ్రామాల్లో సమస్యలు లేకుండా చర్యలు చేపట్టాలి
- మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్



**మెదక్ ఏప్రిల్17( సమయం న్యూస్). :** పంచాయతీరాజ్ చట్టంలో నిబంధనలకు లోబడి గ్రామ పాలన కొనసాగాలని.ప్రతి సర్పంచ్ గ్రామానికి లీడర్ గా వ్యవహరిం. చాలని. సమ్మర్ యాక్షన్ ప్లాన్ ద్వారా గ్రామాలలో నీటి ఎద్దడి నివారణకు పటిష్ట చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ పేర్కొన్నారుశుక్రవారం సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా పంచాయతీ శాఖ ఆధ్వర్యంలో సర్పంచులు ,పంచాయతీ కార్యదర్శులు, ఎంపీఓలు, కంప్యూటర్ ఆపరేటర్లకు 15 ఆర్థిక సంఘం నిధుల వినియోగం పై వర్క్ షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో 15 వ ఆర్థిక సంఘం నిధులు సక్రమంగా వినియోగించి గ్రామా అభివృద్ధికి నిరంతరం కృషి చేయాలన్నారు. జిల్లాలోని గ్రామపంచాయతీలు మోడల్ గా తీర్చిదిద్దాలని, గ్రామాలలో అన్ని రకాల మౌలిక వసతులపై దృష్టి సారించాలన్నారు, అంగన్వాడీ బిల్డింగ్స్, జిపి బిల్డింగ్స్ లేని గ్రామాలకు నూతన బిల్డింగ్స్ ఏర్పాటు చేసుకునేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.. ప్రత్యేక అధికారి, పంచాయతీ సెక్రెటరీ సర్పంచ్ సమన్వయంతో గ్రామ పంచాయతీలో పనులు సవ్యంగా నడవాలన్నారు. గ్రామాల్లో సమస్యలు లేకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని 15 ఆర్థిక సంఘం నిధులను అన్ని గ్రామాలకు ప్రభుత్వం అందించిందని ,వాటితో గ్రామాల్లో సమస్యలు లేకుండా ఇతర శాఖల అధికారుల సమన్వయంతో పని చేయాలన్నారు. నిధుల వినియోగం లో అక్రమాలకు తావులేదన్నారు. నిధులు సక్రమంగా వినియోగించక పోతే ,అక్రమాలు జరిగితే సర్పంచ్ , కార్యదర్శుల పై చర్యలకు వెనకాడబోమని హెచ్చరించారు. గ్రామాల్లో త్రాగు నీటి సమస్య రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి యాదయ్య ఈ.ఈ మిషన్ భగీరథ ఇంట్రా సంపత్ కుమార్, గ్రిడ్ డి.ఈ నాగభూషణం, డిఎల్పిఓలుసాయి బాబు, తిరుపతి రెడ్డి ,అధికారులు ,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గోల్డెన్ అవర్‌లో ప్రమాద బాధితులను ఆసుపత్రికి చేర్చితే ప్రాణాలు కాపాడవచ్చు

● నారాయణపేట రూరల్ ఎస్సై సతీష్ రెడ్డి




**నారాయణపేట, ఏప్రిల్,17(సమయం న్యూస్):** "అరైవ్ అలైవ్" కార్యక్రమంలో భాగంగా నారాయణపేట రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మెడికల్ కాలేజ్ సమీపం, ఆపక్ పల్లి చౌరస్తా వద్ద అంబులెన్స్ డ్రైవర్లు, వాహనదారులు మరియు ప్రజలకు రూరల్ ఎస్సై సతీష్ రెడ్డి శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ...రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారిని "గోల్డెన్ అవర్" లోపు ఆసుపత్రికి తరలించడం ద్వారా ఒక ప్రాణాన్ని కాపాడిన వారిగా నిలవవచ్చని తెలిపారు. ప్రమాదానికి గురైన వ్యక్తులను వెంటనే ఆసుపత్రికి చేర్చడం అత్యంత ముఖ్యమని, ఈ సమయంలో సమయానికి సహాయం అందితే ప్రాణాపాయం తప్పించవచ్చని చెప్పారు.అలాగే రోడ్డు ప్రమాద బాధితులను ఆసుపత్రికి చేర్చిన వ్యక్తులపై ఎలాంటి కేసులు లేదా విచారణలు ఉండవని స్పష్టం చేశారు. పోలీసులకు లేదా అంబులెన్స్ సిబ్బందికి సమాచారం అందించిన వారి పై ఎలాంటి కేసులు ఉండవని తెలిపారు.ఆపదలో సహాయం చేసిన మంచి మనసున్న వ్యక్తులను ప్రభుత్వం ప్రోత్సహిస్తూ కేంద్ర ప్రభుత్వం రహ్ వీర్ పథకం ద్వారా రూ. 25,000 నగదు బహుమతి మరియు ప్రశంస పత్రం అందజేస్తుందని వెల్లడించారు. ప్రజలు బాధ్యతగా స్పందించి ప్రమాదాల సమయంలో వెంటనే సహాయం చేయాలని, ప్రాణాలను కాపాడే సేవలో భాగస్వాములు కావాలని ఎస్సై సతీష్ రెడ్డి కోరారు.అనంతరం అందరితో రోడ్డు భద్రతా పై ప్రతిజ్ఞ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రజలు, వాహనదారులు, అంబులెన్స్ డ్రైవర్లు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# 111 జీవోలో అక్రమ వెంచర్లు - చర్యలు శూన్యం, నోటీసులపై దాటవేత

■ నోటీసులు అడిగితే నోరు జారుతున్న కనకమామిడి సెక్రటరీ

■ "నేను చూపించను, వెంచర్ వాళ్లనే అడగండి" - విలేకరులపై దురుసు వ్యాఖ్యలు

■ 8 రోజులైనా అక్రమ నిర్మాణాలపై చర్యలు లేవు - డీపీవోకు ఫిర్యాదు చేయనున్న విలేకరులు




**చేవెళ్ల ఏప్రిల్ 17 (సమయం న్యూస్) :** : రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండల పరిధిలోని 111 జీవోలోని కనకమామిడి గ్రామ రెవెన్యూ పరిధిలో గత కొన్ని నెలలుగా అక్రమ వెంచర్ పనులు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. ఏప్రిల్ 9న అక్రమ వెంచర్‌కు సంబంధించి ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శి దేవేందర్ రెడ్డిని వివరణ కోరగా నేను చూస్తానని చెప్పారు. 8 రోజులైనా ఇప్పటికీ ఎటువంటి చర్యలు తీసుకోలేదు. కనీసం నోటీసులు ఇవ్వలేదు. ఈ రోజు ఏప్రిల్ 17న శుక్రవారం వార్త నిమిత్తం కనకమామిడి పంచాయతీ కార్యాలయంలో కార్యదర్శి దేవేందర్ రెడ్డిని కలిసి వివరణ కోరగా నోటీసులు ఇచ్చానని అన్నారు. కానీ పనులు యథావిధిగా కొనసాగుతున్నాయి. మీరు ఇచ్చిన నోటీసు చూపించండి అని అడిగితే "నేను చూపించను, వెంచర్ చేసే వాళ్లనే అడగండి, ఎవరేమన్నా నాకు చెప్పి వెంచర్ చేస్తారా" అంటూ దురుసుగా మాట్లాడారని విలేకరులు తెలిపారు. గ్రామపరిధిలో వెలుస్తున్న అక్రమ వెంచర్లు, నిర్మాణాలకు సెక్రటరీ పూర్తి సహకారం ఉందని స్థానికంగా వినిపిస్తున్న ప్రధాన ఆరోపణ. సెక్రటరీ మాట్లాడిన వీడియో, వెంచర్‌కు సంబంధించిన ఆధారాలతో రేపు జిల్లా పంచాయతీ అధికారి, కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేస్తామని విలేకరులు పేర్కొన్నారు.

## దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని, న్యాయబద్ధమైన డిమాండ్లను వెంటనే అమలు చేయాలి,

■ తెలంగాణ ఉద్యోగుల జేపీసీ ఆధ్వర్యంలో

■ మధ్యాహ్న భోజన విరామ సమయంలో కొడంగల్ తహసిల్దార్ కు వినతిపత్రం



**కొడంగల్, ఏప్రిల్,17(సమయం న్యూస్) :** కార్యక్రమంలో,TGEJAC నాయకులు, మరియు TPUS జిల్లా స్థాయి , మండల స్థాయి బాధ్యులు పృథ్వీ సింగ్, నాగప్ప, శ్రీనివాస్ రెడ్డి, నారాయణ,చంద్ర శేఖర్, రమేష్ రఘు తదితరులు పాల్గొన్నారు.

# మక్తల్ మున్సిపాలిటీ 6వ వార్డు ఎన్నికలకు పటిష్ట బందోబస్తు

■ డీఎస్పీ నల్లపు లింగయ్య

■ జిల్లా ఎస్పీ డాక్టర్. వినిత్ ఐపీఎస్ అదేశాలమేరకు



**మక్తల్,ఏప్రిల్,17(సమయం న్యూస్) :** నారాయణపేట జిల్లా మక్తల్ మున్సిపాలిటీలో 6వ వార్డు ఎన్నికల సందర్భంగా జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ IPS ఆదేశాల మేరకు పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు డీఎస్పీ నల్లపు లింగయ్య తెలిపారు. గతంలో బీజేపీ అభ్యర్థి మరణం కారణంగా ఈ వార్డులో ఎన్నికలు రద్దు కాగా, ఈ నెల 18వ తేదీ శనివారం తిరిగి ఎన్నికలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ చందాపూర్ లో ఒక లొకేషన్‌లో ఏర్పాటు చేసిన రెండు పోలింగ్ బూత్‌లను పరిశీలించారు. అక్కడ మొత్తం 1,452 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఉండేందుకు 30 మంది పోలీస్ అధికారులు, సిబ్బందితో కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. బందోబస్తులో పాల్గొన్న పోలీస్ సిబ్బందికి భద్రతాపరమైన సూచనలు చేసిన డీఎస్పీ, ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలని ఆదేశించారు. పోలింగ్ బూత్ పరిసరాల్లో శాంతి భద్రతలు కాపాడాలని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా కట్టుదిట్టంగా నిఘా ఉంచాలని తెలిపారు. అదేవిధంగా పోలింగ్ బూత్‌కు 100 మీటర్ల పరిధిలో ఎవరూ గుంపులుగా చేరకుండా చూడాలని, చందాపూర్‌లో సెక్షన్ (144 163 దీమీూా అమల్లో ఉంటుందని స్పష్టం చేశారు. ఎన్నికలు ప్రశాంతంగా, సజావుగా జరిగేందుకు ప్రజలందరూ పోలీసులకు సహకరిం చాలని కోరారు. డిఎస్పితో పాటు మక్తల్ సీఐ రామ్ లాల్, ఎస్సై భాగ్యలక్ష్మి రెడ్డి, ఎస్సై 2 రేవతి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# కొడంగల్ లో ప్రపంచ హిమోఫిలియా దినోత్సవం కార్యక్రమం

■ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్. ఎ.చంద్రప్రియ అధ్యక్షతన



**కొడంగల్ మున్సిపల్, ఏప్రిల్ 17 (సమయం న్యూస్):** ప్రపంచ హిమోఫిలియా దినోత్సవం కొడంగల్ నియోజకవర్గ కేంద్రంలో కొడంగల్ కమ్యూనిటీ ఆసుపత్రి మరియు కొడంగల్ నర్సింగ్ విద్యార్థుల ఆధ్వర్యంలో, మెడికల్ సూపరింటెండెంట్ డా. చంద్రప్రియ అధ్యక్షతన కొడంగల్ ప్రభుత్వ ఆసుపత్రి నుండి అంబేద్కర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించి ప్రజలలో అవగాహన కల్పించారు. అందులో భాగంగా డాక్టర్. ఎ. చంద్రప్రియ మాట్లాడుతూ... హిమోఫిలియా అనేది రక్తానికి సంబంధించిన వ్యాధి అని ఇది వంశపారంపర్యంగా వస్తుందని తెలిపారు. వీళ్ళకు గాయం అయినచో రక్తం ఆగకుండా గడ్డ కట్టని రక్తస్రావం జరిగి ప్రాణాపాయం జరిగే అవకాశం ఉందని వివరించారు.. దీనికి రక్త పరీక్షలు క్రమం తప్పకుండా చేత చేయించుకోవాలని, ఇది కుటుంబంలో ఒకరి నుంచి మరొకరికి ఈ జన్యువుగా సంక్రమిస్తుందని వివరించారు. ఈ వ్యాధి ఉన్నవాళ్ళు తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలిపారు. ఇట్టి డాక్టర్. సాకేత్, డాక్టర్. మొహమ్మద్ అఫ్జల్ మరియు ఇతర సిబ్బంది, నర్సింగ్ విద్యార్థులు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

# సీఐటీయూ గూటికి భవన నిర్మాణ కార్మిక సంఘం

● కార్మికులకు అండగా ఉంటామని హామీ

● మొయినాబాద్‌లో సీఐటీయూలో చేరిన భవన నిర్మాణ, సెంట్రింగ్ అసోసియేషన్ నాయకులు

● ప్రమాదం జరిగితే సీఐటీయూ అండగా ఉంటుంది - జిల్లా అధ్యక్షులు రుద్ర కుమార్

● సంక్షేమ బోర్డు కార్డు తప్పనిసరిగా తీసుకోవాలి - కార్మికులకు పిలుపు




**చేవెళ్ల ఏప్రిల్ 17 ( సమయం న్యూస్) :** రంగారెడ్డి జిల్లా చేవెళ్ల నియోజకవర్గం మొయినాబాద్ పట్టణ కేంద్రంలో భవన నిర్మాణ కార్మిక సంఘం , మొయినాబాద్ సెంట్రింగ్ అసోసియేషన్ యూనియన్ నాయకులు సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ అధ్యక్షతన సమావేశం నిర్వహించి సీఐటీయూ జిల్లా అధ్యక్షులు జాజాల రుద్ర కుమార్ సమక్షంలో సీఐటీయూలో చేరారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షులు రుద్ర కుమార్ మాట్లాడుతూ సీఐటీయూ కార్మికుల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తుందని, మొయినాబాద్ మండల పరిధిలో భవన నిర్మాణ కార్మికులకు ఏ ప్రమాదం జరిగిన వారికి సీఐటీయూ అండగా ఉంటుందని తెలిపారు. కార్మికులకు ఏ సమస్య వచ్చినా సీఐటీయూ సంఘం దృష్టికి తీసుకురావాలని కోరారు. నిర్మాణ రంగంలో పనిచేస్తున్న కార్మికులు భవన నిర్మాణ సంక్షేమ బోర్డు ఇన్సూరెన్స్ కార్డు పొందితే సంక్షేమ బోర్డు ద్వారా అనేక లాభాలు ఉన్నాయని, ఏ ప్రమాదం జరిగినా ప్రభుత్వం నుంచి వచ్చే అన్ని బెనిఫిట్స్ సీఐటీయూ కార్మికులకు అందేలా చూస్తుందని అన్నారు. అందుకే సంక్షేమ బోర్డు కార్డు తీసుకోవాలని పిలుపునిచ్చారు. భవన నిర్మాణ కార్మిక సంఘం యూనియన్ నాయకులు, మొయినాబాద్ సెంట్రింగ్ అసోసియేషన్ అధ్యక్షులు బుర్ర శంకర్, ప్రధాన కార్యదర్శి చింతల రవి, కోశాధికారి చింతల మోనాకర్, గౌరవాధ్యక్షులు చింతల దర్శన్, రామ్ రెడ్డి, బాబు సాగర్, నవీన్ సాగర్, శ్రీధర్, సతీష్, మల్లేష్, ప్రభు సాగర్, లక్ష్మీనారాయణ, యాదయ్య, ముత్యాలు, అశోక్, నర్సింగ్ రావు, చింతల రాజు, ఆనంద్ తదితరులు సీఐటీయూలో చేరారు .సీఐటీయూలో చేరిన యూనియన్ నాయకులు మాట్లాడుతూ మొయినాబాద్ మండల పరిధిలో భవన నిర్మాణ కార్మికులకు ఏ ఆపద వచ్చినా వారికి అండగా ఉంటామని అన్నారు.

# ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ధర్నా

డి. శ్రీనివాసచారి. అధ్యక్షులు ,తెలంగాణ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ ,గజ్వేల్.




**సమయం న్యూస్ గజ్వేల్ ఏప్రిల్ 17 :** సిద్దిపేట జిల్లా గజ్వేల్ డిస్ట్రిక్ట్ హాస్పిటల్ నందు తెలంగాణ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ 1725(ఐ .ఎన్. టి. సి. అనుబంధ సంస్థ) ఆధ్వర్యంలో వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖలో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కేంద్ర కమిటీ పిలుపు మేరకు దశల వారి ఆందోళనలో భాగంగా శుక్రవారం రోజు గజ్వేల్ జిల్లా కేంద్ర ఆసుపత్రి యందు ఒక్కరోజు ధర్న నిర్వహించడం జరిగింది. తెలంగాణ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ గజ్వేల్ డివిజన్ అధ్యక్షులు శ్రీనివాస చారి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు రెండవ వేతన సవరణ సంఘం నివేదిక ప్రవేశపెట్టి తొందరగా అమలు చేయుట.

(2) ఐదు విడుదల కరువు బత్యం మంజూరు చేయుట.

(3) పాత పెన్షన్ (ూూా )ఓ. పి. ఎస్ విధానముఅమలు చేయుట

(4) ఉద్యోగులకు రావలసిన బకాయిలు తక్షణమే చెల్లించుట.

(5) అక్రమ బదిలీలను రద్దు చేయుట.

(6) టైం స్కేల్ ఉద్యోగుల సర్వీసులను కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ లో పనిచేస్తున్న వారిని వెంటనే రెగ్యులర్ చేయుట.

ఉద్యోగులందరికీ ఈ.ఎస్ ఐ వర్తించుటకు ఉద్యోగులకు 126 జీవో సవరించి అమలు చేయుట.

(7) దీర్ఘ కాలముగా పనిచేస్తున్న ఉద్యోగస్తులకు ప్రమోషన్ కల్పించడం.

(8)+ూ 317 బాధితులకు ఉపశమనం కలిగించుటకు కొత్త +ూ ను అమలు చేయుట.

(9) న్యూ రిక్రూట్మెంట్ ద్వారా సిబ్బంది యొక్క పని భారాన్ని తగ్గించుట.

గతంలో ఎన్నో పర్యాయాలు తమరి దృష్టికి సమస్యల పరిష్కారం కోసం నివేదించినప్పటికీ అమలు గాని పరిస్థితిలో మా యూనియన్ రాష్ట్ర సంఘం పిలుపుమేరకు ఒకరోజు ధర్నా నిర్ణయించడం జరిగింది. దశలవాదిగా చేపట్టే ఆందోళనలో భాగంగా తొలి దశలో ఆందోళనగా డైరెక్టర్ ఆఫ్ హెల్త్ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ఆఫ్ ప్రివెంటివ్ మెడిసిన్ మరియు వైద్య విధాన పరిషత్ సమస్యలలో ఈరోజు ధర్నాను విజయవంతం చేసినాము ఉదయం హాజరు సమయంలో రోగులకు అసౌకర్యం కలిగించకుండా నిరసన ప్రదర్శనలు నిర్వహించడం జరిగింది. తమరి దయతో ఈ విషయాన్ని పరిశీలించి తగువిధంగా నిర్ణయం తీసుకొని ఉద్యోగులకు మేలు జరుగుతుందని ఆశిస్తున్నామని గజ్వేల్ డివిజన్ తెలంగాణ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు శ్రీనివాస చారి తెలిపినారు. ఈ కార్యక్రమంలో డి. శ్రీనివాసచారి. చీఫ్ ఫార్మసీ ఆఫీసర్ విమల, ఎఫ్సిబా నర్సింగ్ సూపరింటెండెంట్ సువర్ణ ,సీనియర్ నర్సింగ్ ఆఫీసర్స్ జగదాంబ, వకులాదేవి, నిర్మల, ఉమామహేశ్వరి, ఫార్మసీ ఆఫీసర్స్ మోహన్ బండారి స్వర్ణలత, శిరీష, రమాదేవి, నర్సింగ్ ఆఫీసర్స్ షాహిని ,రశ్మి ,శోభ, రాజు, గౌతమి, హెడ్ నర్సెస్ విమల దేవి, నిర్మల సానిటరీ ఇన్స్పెక్టర్ లక్ష్మి, నర్సింగ్ ఆఫీసర్స్ పుష్ప, ఉమా, రోజులిన్, హెల్త్ అసిస్టెంట్ దేవసాని వాసుదేవ్ ఈ.సీ.జీ. టెక్నీషియన్ రాజు ఆరోగ్యశ్రీ ఇన్చార్జి సురేందర్, సంతోష్ కనకయ్య, హాస్పిటల్ పారామెడికల్ సిబ్బంది సానిటరీ సిబ్బంది అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమం విజయవంతం చేసినారు.

# స్పందించకుంటే ఉద్యమం ఉధృతం

■ నల్ల బ్యాడ్జిలతో ఉద్యోగుల నిరసన




**ఖమ్మం, ఏప్రిల్ 17 : ( సమయం న్యూస్ ) :** జిల్లా కలెక్టరేట్ (ఐడీఓసీ) ఆవరణలో ఈ రోజు మధ్యాహ్న భోజన విరామ సమయంలో తెలంగాణ రాష్ట్ర ఉద్యోగులు, గెజిటెడ్ అధికారులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్ల సంయుక్త వేదిక టీజీఈజేఏసీ ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలతో భారీ నిరసన ప్రదర్శన నిర్వహించారు. జిల్లాలోని వివిధ శాఖలకు చెందిన ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వానికి వినతిపత్రం అందజేసిన నేపథ్యంలో, ప్రభుత్వ దృష్టికి ఉద్యోగుల ఆవేదనను తెలియజేసేందుకు ఈ నిరసన కార్యక్రమం చేపట్టినట్లు టీజీఈజేఏసీ చైర్మన్ గుంటుపల్లి శ్రీనివాసరావు ,కన్వీనర్ కొంగర వెంకటేశ్వరరావు చెప్పారు. అనంతరం ప్రధాన డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అడిషనల్ కలెక్టర్ శ్రీజ కి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగ సంఘ నాయకులు రెవెన్యూ అసోసియేషన్ అధ్యక్షులు తుంబూరు సునీల్ రెడ్డి, పంచాయతీరాజ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు రాజేష్ యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి, అధ్యక్షులు పారుపల్లి నాగేశ్వరరావు, ఎస్.కె రంజాన్, పిఆర్టియు జిల్లా అధ్యక్షులు కట్టా శేఖర్, టి పి టి ఎఫ్ జిల్లా అధ్యక్షులు వెంగళరావు, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం కార్యదర్శి తాళ్లూరి వేణు పి.ఆర్.టి.యు రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు యలమద్ది వెంకటేశ్వర్లు, ఎస్జీపిఏటి అధ్యక్షులు పరిస పుల్లయ్య, వెంకటపతి రాజు టిఎన్జీవోస్ యూనియన్ జిల్లా కార్యదర్శి కొనిదెన శ్రీనివాస్, టీజీఓ జిల్లా కార్యదర్శి మోదుగు వేలాద్రి, టీ ఎన్ జీ వో స్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ జెడ్.ఎస్. జైపాల్, నాయకులు తాళ్లూరి శ్రీకాంత్, డాక్టర్ విజయ్ కుమార్, కొమరగిరి దుర్గాప్రసాద్, వల్లపు వెంకన్న , అస్లాం ఖాన్, పెద్దినేని రాధాకృష్ణ ఏలూరి హరికృష్ణ కోణార్ ,బిక్కు, వెంకటరమణ, కోడి లింగయ్య, రమణ యాదవ్, ఎర్ర రమేష్, లలిత కుమారి, విజయ, మృదుల, రాధికా రెడ్డి,కోటపాటి రుక్మారావు, దిలీప్ కుమార్, శంకర్, విక్కిరాల శ్రీనివాస్, పవన్, తదితరులు పాల్గొన్నారు.



# 'చాహల్ వద్దు.. విరాట్ లాంటి వాడు కావాలి'

## మనసులో మాట బయటపెట్టిన బ్యూటీ



టీమిండియా క్రికెటర్ యుజ్వేంద్ర చాహల్ వ్యక్తిగత జీవితం మరోసారి వార్తల్లో నిలిచింది. ధనశ్రీ వర్మతో విడిపోయిన తర్వాత చాహల్ పేరు పలువురితో వినిపించగా, గత కొంతకాలంగా క్రికెట్ హోస్ట్, నటి షెఫాలీ బగ్గాతో ఆయన డేటింగ్‌లో ఉన్నట్లు జోరుగా ప్రచారం జరుగుతోంది. వీరిద్దరూ కలిసి ఒక యాడ్‌లో నటించడం, బయట జంటగా కనిపించడంతో ఈ పుకార్లు నెట్టింట షికార్లు చేస్తున్నాయి. అయితే తాజాగా ఓ పాడ్‌కాస్ట్‌లో పాల్గొన్న షెఫాలీ ఈ డేటింగ్ రూమర్స్‌పై క్లారిటీ ఇచ్చారు.

### ఆ ప్రశ్నలతో విసిగిపోయాను..

ఈ పాడ్‌కాస్ట్‌లో చాహల్‌తో డేటింగ్ వార్తలపై షెఫాలీ మాట్లాడుతూ.. "ఈ ప్రశ్నలతో నేను విసిగిపోయాను. కేవలం ఇద్దరు వ్యక్తులు కలిసి డిన్నర్‌కు వెళ్తే అది డేటింగ్ అని ప్రచారం చేయడం ప్రజల సంకుచిత మనస్తత్వానికి నిదర్శనం. ఇలాంటి వార్తలు వినడానికి చాలా వింతగా అనిపిస్తాయి" అని అసహనం వ్యక్తం చేశారు. సోషల్ మీడియాలో వచ్చే ట్రోల్స్ గురించి తాను అస్సలు పట్టించుకోనని షెఫాలీ స్పష్టం చేశారు. తనకు, తన చుట్టూ ఉన్నవారికి నిజం ఏంటో తెలుసని అన్నారు. అంతేకాకుండా భవిష్యత్తులో తాను ఒక క్రికెటర్‌ను పెళ్లి చేసుకునే ప్రసక్తే లేదని ఆమె తేల్చి చెప్పారు. తన ప్రొఫెషనల్ లైఫ్‌ను, పర్సనల్ లైఫ్‌ను మిక్స్ చేయడం ఇష్టం లేదని అన్నారు.


### విరాట్ కోహ్లీ లాంటి భాగస్వామి కావాలి..


తనకు కాబోయే భర్త ఎలా ఉండాలో కూడా షెఫాలీ ఈ సందర్భంగా చెప్పుకొచ్చారు.. "నాకు విరాట్ కోహ్లీ లాంటి భాగస్వామి కావాలి. విరాట్ -- అనుష్క శర్మ జోడీ నాకు పర్ఫెక్ట్ కపుల్‌లా అనిపిస్తారు" అని తన మనసులో మాట బయటపెట్టారు. గతంలో బిగ్ బాస్ 13లో మెరిసిన షెఫాలీ బగ్గా, ప్రస్తుతం స్పోర్ట్స్ యాంకర్‌గా, నటిగా తన కెరీర్‌లో దూసుకుపోతున్నారు.

# 'సర్పంచ్ సాబ్' సూపర్..

## ప్రీతి జింటా సంబరాలు

**న్యూఢిల్లీ:** ఐపీఎల్ 2026లో పంజాబ్‌కింగ్స్‌జట్టు అద్భుత ప్రదర్శనతో దూసుకెళ్తోంది. ఇప్పటివరకు ఓటమి ఎరుగని జట్టుగా నిలిచిన పీబీకేఎస్, ఐదు మ్యాచ్‌ల్లో నాలుగు విజయాలు సాధించగా, ఒక మ్యాచ్ వర్షం కారణంగా రద్దైంది. తాజాగా ముంబై ఇండియన్స్‌పై ఘన విజయం సాధించి పాయింట్ల పట్టికలో అగ్రస్థానాన్ని దక్కించుకుంది. జట్టు విజయాలతో ఉత్సాహంలో మునిగిపోయిన యజమాని ప్రీతి జింటా సోషల్ మీడియాలో ఆనందాన్ని పంచుకున్నారు. 'సర్పంచ్ సాబ్ సూపర్' అంటూ జట్టు ప్రదర్శనను కొనియాడారు. జట్టులోని యువ ఆటగాళ్ల ప్రదర్శనపై ప్రీతి జింటా ప్రశంసలు కురిపించారు. ముఖ్యంగా ప్రభ్‌సిమ్రన్ సింగ్ బ్యాటింగ్‌కు ఫిదా అయిన ఆమె, అతని మెచ్యూరిటీ జట్టుకు ఎంతో ఉపయోగపడుతోందన్నారు. అలాగే పేసర్ అర్ష్‌దీప్‌సింగ్‌బౌలింగ్‌ను మెచ్చుకుంటూ అతని ఆటతీరును అభినందించారు. కెప్టెన్ శ్రేయస్‌అయ్యర్ నాయకత్వంపై ప్రత్యేకంగా స్పందిస్తూ 'సద్దా సర్పంచ్' అంటూ ప్రశంసించారు. ఆయన నాయకత్వంలో జట్టు సమిష్టిగా రాణిస్తోందని, కోచ్ రికి పోంటింగ్‌మార్గదర్శకత్వం కీలకమైందని పేర్కొన్నారు. ముంబైపై మ్యాచ్‌లో శ్రేయాస్ అయ్యర్ పట్టిన అద్భుత క్యాచ్‌ను ప్రస్తావిస్తూ 'నేను చూసిన బెస్ట్ క్యాచ్‌లలో ఒకటి' అని కొనియాడారు. 'నీ కంటే లేరెవరూ తోపు' అంటూ ఆయనను మెచ్చుకున్నారు. మొత్తంగా యువ ఆటగాళ్ల మెరుపులు, కెప్టెన్-కోచ్ సమన్వయం పంజాబ్ జట్టును ఈ సీజన్‌లో టైటిల్ రేసులో ముందంజలో నిలబెట్టాయి. మిగిలిన మ్యాచ్‌ల్లో మూడు విజయాలు సాధిస్తే ప్లే ఆఫ్స్‌కు చేరుకునే అవకాశాలు బలంగా ఉన్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు.





# గిల్ గర్జన.. గుజరాత్ విజయం

**ఉత్కంఠ పోరులో కేకేఆర్ పై జీటీ ఘన విజయం**

**86 పరుగులతో చెలరేగిన శుభ్‌మన్ గిల్**

**వృథా అయిన కామెరాన్ గ్రీన్ (79) పోరాటం**

**ఆకట్టుకున్న రబాడ, సిరాజ్ బౌలింగ్**



**అహ్మదాబాద్, ఏప్రిల్ 17:** అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోడీ స్టేడియం వేదికగా శుక్రవారం జరిగిన ఐపీఎల్ మ్యాచ్‌లో కోల్‌కతా నైట్ రైడర్స్ (కేకేఆర్) పై గుజరాత్ టైటాన్స్ (జీటీ) 5 వికెట్ల తేడాతో అద్భుత విజయం సాధించింది. 181 పరుగుల లక్ష్య ఛేదనలో గుజరాత్ బ్యాటర్ శుభ్‌మన్ గిల్ (86) బాధ్యతాయుత ఇన్నింగ్స్ ఆడి జట్టును విజయతీరాలకు చేర్చాడు. చివరి ఓవర్ వరకు ఉత్కంఠభరితంగా సాగిన ఈ పోరులో కేవలం రెండు బంతులు మిగిలి ఉండగానే గుజరాత్ లక్ష్యాన్ని చేరుకుంది.

### పోరాడిన గ్రీన్.. కేకేఆర్ గౌరవప్రదమైన స్కోరు

అంతకుముందు టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న కేకేఆర్ నిర్ణీత 20 ఓవర్లలో 180 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఓపెనర్లు త్వరగా పెవిలియన్ చేరినా.. కామెరాన్ గ్రీన్ అద్భుతమైన ఆటతీరు కనబరిచాడు. 55 బంతుల్లోనే 79 పరుగులు సాధించి స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. మిడిలార్డర్ లో రోవ్‌మన్ పావెల్ 20 బంతుల్లో 27 పరుగులు.. చివర్లో టిమ్ సీఫెర్ట్ 14 బంతుల్లో 19 పరుగులతో రాణించి జట్టుకు గౌరవప్రదమైన స్కోరును అందించారు. గుజరాత్ బౌలర్లలో కగిసో రబాడ 3 వికెట్లతో చెలరేగగా.. మహ్మద్ సిరాజ్.. అశోక్ శర్మ చెరో రెండు వికెట్లు పడగొట్టి కేకేఆర్ బ్యాటర్లను కట్టడి చేశారు.

### గిల్ కెప్టెన్ ఇన్నింగ్స్.. గుజరాత్ విజయం

181 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన గుజరాత్ కు ఓపెనర్ శుభ్‌మన్ గిల్ అదిరిపోయే ఆరంభాన్ని ఇచ్చాడు. ఆరంభం నుంచే బౌలర్లపై విరుచుకుపడుతూ 50 బంతుల్లోనే 86 పరుగులు సాధించి మ్యాచ్ ను గుజరాత్ వైపు తిప్పాడు. మరో ఎండ్ లో జాస్ బట్లర్ 15 బంతుల్లో 25 పరుగులు.. సాయి సుదర్శన్ 16 బంతుల్లో 22 పరుగులు చేసి గిల్ కు చక్కటి సహకారం అందించారు. చివర్లో వరుసగా వికెట్లు పడటంతో మ్యాచ్ కాస్త ఉత్కంఠగా మారింది. ఆఖరి ఓవర్లో విజయానికి పరుగులు కావాల్సిన తరుణంలో గుజరాత్ బ్యాటర్లు సంయమనంతో ఆడి 19.4 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 181 పరుగులు సాధించారు. కేకేఆర్ బౌలర్లలో వరుణ్ చక్రవర్తి 34 పరుగులిచ్చి 2 వికెట్లు తీయగా.. సునీల్ నరైన్.. రమణ్‌దీప్ సింగ్ తలో వికెట్ దక్కించుకున్నారు. ఒంటరి పోరాటం చేసిన కామెరాన్ గ్రీన్ కష్టం వృథా కాగా.. సమిష్టి కృషితో గుజరాత్ అద్భుత విజయాన్ని సొంతం చేసుకుంది.




# నా కెరీర్‌లో చూసిన బెస్ట్ క్యాచ్ అదే

**సచిన్ టెండూల్కర్**



ఐపీఎల్ 2026లో భాగంగా పంజాబ్ కింగ్స్ (ఫ్రాదీఖా), ముంబై ఇండియన్స్ మధ్య జరిగిన ఉత్కంఠభరిత పోరులో ఒక అద్భుతమైన క్యాచ్ క్రికెట్ ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచింది. పంజాబ్ కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ పట్టిన ఈ క్యాచ్‌పై క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ ప్రశంసల వర్షం కురిపించారు. తాను ప్రత్యక్షంగా చూసిన అత్యుత్తమ క్యాచ్‌లలో ఇది ఒకటి అని సచిన్ కొనియాడారు. ముంబై ఇన్నింగ్స్ 18వ ఓవర్‌లో మార్కో జాన్సెన్ వేసిన బంతిని హార్దిక్ పాండ్యా బౌండరీ వైపు బలంగా బాదాడు. అది సిక్సర్ వెళ్తుందని అందరూ భావించారు. కానీ లాంగ్-ఆన్ వద్ద ఫీల్డింగ్ చేస్తున్న శ్రేయస్ అయ్యర్ గాలిలోకి ఎగిరి బంతిని అందుకున్నాడు. తాను బౌండరీ లైన్ దాటుతున్నానని గ్రహించి, కింద పడబోయేలోపు చాకచక్యంగా బంతిని పక్కనే ఉన్న గ్జేవియర్ బార్ట్లెట్‌కు విసిరాడు. బార్ట్లెట్ దాన్ని సులువుగా అందుకోవడంతో హార్దిక్ పాండ్యా అవుట్ అయ్యాడు.

### సచిన్ టెండూల్కర్ ఏమన్నారంటే..?

ఈ అద్భుతమైన ఫీల్డింగ్‌ను చూసి సచిన్ ఫిదా అయి-పోయారు. "ఈ క్యాచ్ ఇంత స్పెషల్ కావడానికి కారణం కేవలం శ్రేయస్ శారీరక వేగం మాత్రమే కాదు, అతని సమయస్ఫూర్తి కూడా. బంతి వేగాన్ని అంచనా వేయడం, బౌండరీ లైన్‌కు ఎంత దూరంలో ఉన్నామో చూసుకోవడం, గాలిలో ఉండగానే పక్కనే ఉన్న ఫీల్డర్‌కు బంతిని విసరడం.. ఇవన్నీ సెకను కాలంలో జరిగిపోయాయి. దీనికి అద్భుతమైన ఫిట్‌నెస్, ఏకాగ్రత అవసరం. శ్రేయస్ ఇవన్నీ పక్కాగా చేశాడు" అని సచిన్ తన సోషల్ మీడియా వేదికగా మెచ్చుకున్నారు.

### మ్యాచ్ విషయానికి వస్తే..

ఈ మ్యాచ్‌లో పంజాబ్ కింగ్స్ ఘనవిజయం సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన ముంబై ఇండియన్స్ క్వింటన్ డికాక్ సెంచరీ (112 నాటౌట్) సాయంతో 195 పరుగులు చేసింది. అర్ష్‌దీప్ సింగ్ 3 వికెట్లు తీసి ముంబైని కట్టడి చేశాడు. అనంతరం పంజాబ్ ఈ లక్ష్యాన్ని కేవలం 16.3 ఓవర్లలోనే ఛేదించింది. ప్రభ్‌సిమ్రన్ సింగ్ (80 నాటౌట్), కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (66) మెరుపు ఇన్నింగ్స్‌లు ఆడారు. ఈ విజయంతో పంజాబ్ పాయింట్ల పట్టికలో అగ్రస్థానానికి చేరుకోగా.. ముంబై ఇండియన్స్ తొమ్మిదో స్థానానికి పడిపోయింది. శ్రేయస్ అయ్యర్ పట్టిన ఆ క్యాచ్ మ్యాచ్‌కే హైలైట్‌గా నిలిచింది.

# ఐఎన్‌సీఏ అవార్డ్స్‌లో తెలుగు సినిమాల హవా



దేశంలోని వివిధ భాషల సినీ పరిశ్రమలను ఒకే వేదికపైకి తీసుకొచ్చిన ఇండియన్ నేషనల్ సినీ అకాడమీ (×చీజూా) 2026 అవార్డుల ప్రదానోత్సవం ముంబయిలో ఘనంగా జరిగింది. ఈ వేడుకకు నటుడు, నిర్మాత రానా దగ్గుబాటి, నటి శ్రీయ శరణ్, నిర్మాత కరణ్ జోహార్ వ్యాఖ్యాతలుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో తెలుగు సినీ పరిశ్రమకు ప్రత్యేక గుర్తింపు లభించింది. 'తండేల్' చిత్రంలో నటనకు గాను నాగచైతన్యకు ఉత్తమ నటుడు అవార్డు లభించగా, 'ది గర్ల్‌ఫ్రెండ్' చిత్రానికి రష్మిక మందన్న ఉత్తమ నటి పురస్కారం అందుకున్నారు. 'సంక్రాంతికి వస్తున్నాం' చిత్రానికి అనిల్ రావిపూడి ఉత్తమ దర్శకుడిగా ఎంపిక కాగా, అదే చిత్రంలో నటించిన మాస్టర్ రేవంత్ ఉత్తమ హాస్య నటుడిగా అవార్డు అందుకున్నారు. ఇతర విభాగాల్లో రిషబ్ శెట్టి ('కాంతారా చాప్టర్ 1'), దుల్కర్ సల్మాన్ ('కాంత') ఉత్తమ నటులుగా గుర్తింపు పొందారు. సీనియర్ నటి సిమ్రన్, కళ్యాణి ప్రియదర్శన్ ఉత్తమ నటీమణులుగా ఎంపికయ్యారు. 'మిరాయ్' చిత్రం ఉత్తమ చిత్రంగా నిలవగా, అదే చిత్రానికి ఉత్తమ విజువల్ ఎఫెక్ట్స్ అవార్డు దక్కింది. 'కోర్ట్' చిత్రానికి రామ్ జగదీష్ ఉత్తమ తొలి దర్శకుడిగా అవార్డు అందుకున్నారు. భారతీయ సినిమాకు చేసిన విశేష సేవలకు గాను కమల్ హాసన్, రేఖలకు ప్రత్యేక పురస్కారాలు అందజేశారు. వివిధ విభాగాల్లో తెలుగు చిత్రాలకు అధికంగా అవార్డులు దక్కడం పట్ల సినీ అభిమానులు సోషల్ మీడియాలో అభినందనలు తెలియజేస్తున్నారు.



## ఒంటరిగా జీవించడంలోనే ఆనందం: హన్సిక

నటి హన్సిక వ్యక్తిగత జీవితానికి సంబంధించిన అంశాలు ఇటీవల చర్చనీయాంశంగా మారాయి. 2022 డిసెంబర్ 4న జైపూర్‌లో వ్యాపారవేత్త సోహెల్ ఖతూరియాతో వివాహం చేసుకున్న ఆమె, కొంతకాలం తర్వాత వ్యక్తిగత కారణాలతో విడాకుల కోసం బాంద్రా ఫ్యామిలీ కోర్టును ఆశ్రయించింది. తాజాగా న్యాయస్థానం వీరి విడాకులకు అనుమతి ఇచ్చినట్లు సమాచారం. ఇటీవల సోషల్ మీడియా ద్వారా అభిమానులతో మాట్లాడిన హన్సిక, ప్రస్తుతం తన జీవితంలో ప్రశాంతంగా ఉన్నట్లు వెల్లడించింది. స్వేచ్ఛగా జీవించడం తనకు ఎంతో ఇష్టమని, ఒంటరిగా గడపడం తనకు సంతృప్తిని ఇస్తుందని తెలిపింది. తనకు నచ్చిన పనులు చేసుకుంటూ, కుటుంబ సభ్యులతో సమయం గడపడం ఆనందంగా అనిపిస్తోందని పేర్కొంది. హన్సిక చేసిన ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతూ అభిమానుల్లో చర్చకు దారితీస్తున్నాయి.



## ఐఎన్‌సీఏలో రుక్మిణి హొయలు

తాజాగా నిర్వహించిన ఐఎన్‌సీఏ అవార్డ్స్ వేడుకలో యంగ్ హీరోయిన్ రుక్మిణి వసంత్ తన స్టైలిష్ లుక్‌తో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ కార్యక్రమానికి సిల్వర్ రంగు స్లీవ్‌లెస్ డ్రెస్‌లో హాజరైన ఆమె, అందరి దృష్టిని ఆకర్షించింది. వేదికపై రుక్మిణి వసంత్ వివిధ భంగిమల్లో ఫోటోలకు పోజులు ఇవ్వగా, ఆమె లుక్ అభిమానులను ఆకట్టుకుంది. ఈ ఫోటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వేగంగా వైరల్ అవుతూ చర్చనీయాంశంగా మారాయి.

## చిరాగ్ పాశ్వాన్‌తో ఎలాంటి రిలేషన్ లేదు

### క్లారిటీ ఇచ్చిన నటి కంగనా రనౌత్

కంగనా రనౌత్, చిరాగ్ పాశ్వాన్ ఆ ఇద్దరూ ఇప్పుడు ఫుల్ బిజీ అయ్యారు. పబ్లిక్ ఈవెంట్స్‌లో తరుచూ కనిపిస్తున్నారు. దీంతో కొందరు డౌట్స్ వ్యక్తం చేస్తున్నారు. ఆ ఎంపీలు ఇద్దరూ రొమాంటిక్ రిలేషన్‌లో ఉన్నారా అన్న అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఓ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఫిల్మ్ స్టార్, ఎంపీ కంగనా రనౌత్ క్లారిటీ ఇచ్చారు. ఆ రూమర్స్‌కు ఆమె చెక్ పెట్టారు. చిరాగ్ పాశ్వాన్ కేవలం ఫ్రెండ్ మాత్రమే అని ఆమె చెప్పారు. తమ మధ్య రొమాన్స్ లేదని కంగనా పేర్కొన్నది. తమ మధ్య చాన్నాళ్ల పరియం ఉందని, పదేళ్ల క్రితం ఇద్దరం కలిసి సినిమా తీశామని, ఒకవేళ తమ మధ్య ప్రేమాయణం సాగి ఉంటే, మాకు పిల్లలు పుట్టేవారని కంగనా రనౌత్ పేర్కొన్నది. పాశ్వాన్‌తో తన రిలేషన్ చాన్నాళ్ల నుంచి అలాగే ఉందన్నారు. ఒకవేళ తనకు రొమాన్స్ కావాలనుకుంటే, అది జరిగేదని, కానీ అలాంటిది ఏమీ లేదని, అది కేవలం ఫ్రెండ్లీ పరిచయం మాత్రమే అని, అతను కూడా ఫిల్మ్ ఇండస్ట్రీ నుంచి వచ్చాడని, అందుకే తమ మధ్య పరిచయం కాస్త చనువుగా ఉంటుందని ఆమె అన్నారు. 2011లో రిలీజైన మిలే నా మిలే హమ్ చిత్రంలో కంగనా, చిరాగ్ పాశ్వాన్ కలిసి నటించారు. తన్వీర్ ఖాన్ ఆ చిత్రాన్ని డైరెక్ట్ చేశారు. ఆ తర్వాత ఇద్దరూ రాజకీయాల్లో రాణించారు. కానీ కంగనా అడపాదడపా చిత్రాల్లో నటిస్తోంది. చివరిసారి ఆమె ఎమర్జెన్సీ చిత్రంలో యాక్ట్ చేశారు.



## హెలికాప్టర్లో బాలయ్యతో డింపుల్ సెల్ఫీ

నటసింహం నందమూరి బాలకృష్ణ, నటి డింపుల్ హయాతి కలిసి గుంటూరులో జరిగిన ఓ ప్రైవేట్ కార్యక్ర మంలో సందడి చేశారు. లక్ష్మీపురంలో ఏర్పాటు చేసిన ఓ ప్రముఖ ఆభరణాల షోరూ మ్ ప్రారంభోత్సవానికి బాలకృష్ణ ముఖ్య అతిథిగా హాజరు కాగా, డింపుల్ హయాతి కూడా పాల్గొన్నారు. హైదరాబాద్ నుంచి గుంటూరుకు ఇద్దరూ ఒకే ప్రత్యేక హెలికాప్టర్‌లో చేరుకోవడం ప్రత్యేకంగా నిలిచింది. హెలికాప్టర్ ప్రయాణ సమయంలో డింపుల్ హయాతి తీసుకున్న సెల్ఫీ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. సాధారణంగా గంభీరంగా కనిపించే బాలకృష్ణ ఈసారి సరదాగా కనిపించడం అభిమానులను ఆకట్టుకుంటోంది. ఇక సినిమాల విషయానికి వస్తే, బాలకృష్ణ ప్రస్తుతం 'ఎన్‌బీకే 111' వర్కింగ్ టైటిల్‌తో రూపొందుతున్న చిత్రంలో నటిస్తున్నారు. ఈ సినిమాలో డింపుల్ హయాతి నటిస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. ఈ విషయంపై చిత్రబృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.



Printed, Published by **Mohammed Murthuza.** Printed at Vivek Art Printers APHP SHOP NO.12, OSMANIA UNIVERSITY ROAD,HYDERABAD. PUBLISHED ROOM NO.10, Ground Flour, Budha Bhavan, M.G.Road, Secunderabad -03. Ali Publication, Hyderabad. www.samayam.net Mobile No. **98660 19778, 89789 60131**

# స్వచ్ఛాంధ్ర సాకారానికి పటిష్ఠ కార్యాచరణ

**100 శాతం చెత్త సేకరణ, ప్రాసెసింగ్ జరగాలి**

**మున్సిపాలిటీల్లో కొత్తగా పబ్లిక్ టాయిలెట్ల నిర్మాణం**

**పార్కులుగా గ్రామీణ, పట్టణ డంపింగ్ యార్డులు**

**'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర' సమీక్షలో చంద్రబాబు**

**స్వచ్ఛాంధ్ర ర్యాంకుల్లో విశాఖ జిల్లాకు మొదటి స్థానం..**

**చివరన నిలిచి ఏఎస్ఆర్ జిల్లా**



**అమరావతి, ఏప్రిల్ 17:** స్వచ్ఛాంధ్ర సాకారం కావడానికి నిర్దేశించుకున్న లక్ష్యాలు నిర్ణీత సమయానికి పూర్తయ్యేలా పటిష్ఠ కార్యాచరణ అమలు చేయాలని అధికారులకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారు. లక్ష్యాలు చేరుకోవడంలో విఫలమైతే... కారణాలు అన్వేషించి చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. క్యాంపు కార్యాలయంలో 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర' పురోగతిపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. సమీక్షలో ఈ ఏడాది మార్చి 31 వరకు రూపొందించిన స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర ర్యాంకులను అధికారులు ముఖ్యమంత్రికి వెల్లడించారు. విశాఖపట్నం, విజయనగరం, గుంటూరు జిల్లాలు స్వచ్ఛాంధ్రలో మొదటి మూడు స్థానాల్లో ఉండగా... శ్రీ సత్యసాయి, పార్వతీపురం మన్యం, ఏఎస్ఆర్ జిల్లాలు చివరి మూడు స్థానాల్లో ఉన్నట్టు తెలిపారు. ఇందులో విశాఖ జిల్లాకు 92 శాతం, విజయనగరం, గుంటూరు జిల్లాలకు 85 శాతం మార్కులు వచ్చాయి. అట్టడుగున ఉన్న ఏఎస్ఆర్ జిల్లాకు కేవలం 53 శాతం మార్కులు మాత్రమే వచ్చాయి. డోర్ టు డోర్ కలెక్షన్, తడి చెత్త-పొడి చెత్త వేరు చేయడం, వ్యక్తిగత మరుగుదొడ్లు, ఓడీఎఫ్ ప్లస్ మోడల్ వంటివి ర్యాంకులకు ప్రాతిపదికగా తీసుకున్నట్టు చెప్పారు.. అయితే ఇకపై జిల్లాలకు స్వచ్ఛాంధ్ర ర్యాంకులు థర్డ్ పార్టీ ఇచ్చేలా చూడాలని సీఎం సూచించారు.

**జూన్ కల్లా 100 శాతం చెత్త క్లియర్**

మున్సిపాలిటీల్లో అవసరమైన చోట కొత్తగా పబ్లిక్ టాయిలెట్ల నిర్మాణం చేపట్టాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. అలాగే నిర్ణీత పరిధిలో వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్లు నెలకొల్పేలా చూడాలన్నారు. గతంలో వ్యర్థాలతో నిండిపోయిన డంపింగ్ యార్డుల్లో... ప్రస్తుతం చెత్త క్లియర్ చేయడంతో పాటు ఆయా స్థలాలను పచ్చదనంతో నింపేలా చూడాలన్నారు. గ్రామాలు, పట్టణానికి సమీపంలో ఉన్న డంపింగ్ కేంద్రాలను ముందుగా పార్కులుగా తీర్చిదిద్దాలని సీఎం సూచించారు. 2024 జూన్ నుంచి నేటి వరకు పట్టణాల్లో 153 లక్షల టన్నుల చెత్తకు గాను, 114 లక్షల టన్నుల చెత్త తొలగించినట్టు అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. ఈ జూన్ కల్లా 100 శాతం క్లియర్ చేయాలని సీఎం ఆదేశించారు. గ్రామాల్లో పేరుకు పోయిన 10 లక్షల మెట్రిక్ టన్నుల చెత్తను తొలిగించేందుకు చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. అలాగే, ఇంటింటికీ చెత్త సేకరణ, చెత్త ప్రాసెసింగ్ కూడా 100 శాతం జరగాలన్నారు. కంపోస్ట్ మార్కెటింగ్ చేసేందుకు మార్క్‌ఫెడ్‌కు సమన్వయ బాధ్యతలు అప్పగించాలని సీఎం సూచించారు. మ్యాజిక్ డ్రెయిన్లకు అనుసంధానంగా కమ్యూనిటీ సోక్ పిట్స్ తీసుకురావడం ద్వారా మురుగునీటి సమస్య పరిష్కారం కావడంతో పాటు, భూగర్భ జలాలు పెరిగేందుకు దోహద పడుతుందని సీఎం అన్నారు. రాష్ట్రంలోని ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లు, రెసిడెన్షియల్ పాఠశాలల్లోనూ తడి చెత్త, పొడి చెత్త నిర్వహణ, సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు, నెట్ జీరో, గ్రీనరీ పెంపు, క్లీన్-హైజీన్ కిచెన్ వంటి అంశాలపై ముఖ్యమంత్రి పలు మార్గదర్శకాలు జారీ చేశారు. గాలి నాణ్యత పర్యవేక్షణకు ప్రస్తుతమున్న 83 ప్రాంతాలతో పాటు, అదనంగా 53 మాన్యువల్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని సీఎం ఆదేశించారు.

**డిసెంబర్ కల్లా గోబర్ ధన్ ప్లాంట్లు సిద్ధం**

సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నియంత్రణకు, ఈ వేస్ట్ కలెక్షన్‌కు సంబంధించి అమలు చేస్తున్న విధానాలను అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. రాష్ట్రంలో 633 స్వచ్ఛ రథాలతో రోజుకు 125 టన్నుల పొడి చెత్త సేకరిస్తున్నామని, గోబర్ ధన్ యూనిట్లు, గ్రీన్ షాప్స్ ద్వారా చెత్తను ఆదాయంగా మారుస్తున్నామని అధికారులు తెలిపారు. మురుగు నీటి నిర్వహణలో కూడా సమూల మార్పులు తెస్తున్నామని... గ్రే వాటర్, బ్లాక్ వాటర్ నిర్వహణకు భారీ ప్రాజెక్టులు చేపట్టినట్టు వివరించారు. పొడి చెత్తను సేకరించే గ్రీన్ షాపులకు స్వచ్ఛ రథం ఏజెన్సీ నుంచి, పంచాయతీ నుంచి సాయం అందించేలా ప్రయత్నిస్తున్నామని తెలిపారు. డిసెంబర్ కల్లా గోబర్ ధన్ ప్లాంట్లు సిద్ధం అవుతాయని వెల్లడించారు. అలాగే 'స్వచ్ఛ పథం' పేరుతో గ్రామీణ రోడ్ల శుభ్రత కోసం ప్రత్యేక వాహనాలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు.

**590 ఎకరాల్లో సర్క్యులర్ ఎకానమీ పార్కులు**

10 జిల్లాల్లో 590 ఎకరాల్లో సర్క్యులర్ ఎకానమీ పార్కులు అభివృద్ధి చేస్తున్నట్టు అధికారులు ముఖ్యమంత్రికి చెప్పారు. పట్టణాల్లో 2024-2026 మధ్య గ్రీన్ స్పేస్ పార్కులు 57 అభివృద్ధి చేసినట్టు వివరించారు. మరో 284 గ్రీన్ స్పేస్ పార్కులు, 100 స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర పార్కులు అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందించామని అధికారులు తెలపగా, ఔట్ సోర్సింగ్ ఏజెన్సీలకు నిర్వహణ బాధ్యతలు అప్పగించాలని సూచించారు. గ్రామాల్లో మురుగునీటి నిర్వహణకు సోక్ పిట్స్, కిచెన్ గార్డెన్స్, మ్యాజిక్ డ్రెయిన్స్ వంటి విధానాలు అవలంభిస్తున్నామని, ఈ ఏడాది డిసెంబర్ కల్లా... 7.14 లక్షల కిచెన్ గార్డెన్స్, 1 లక్ష సోక్ పిట్స్, 8,000 కమ్యూనిటీ సోక్ పిట్స్, 100 కి.మీ. మ్యాజిక్ డ్రైన్స్ నిర్మాణం లక్ష్యంగా పెట్టుకున్నట్టు తెలిపారు. ఈ ఏడాది సెప్టెంబర్ కల్లా అన్ని గ్రామాలను ఓడీఎఫ్ ప్లస్‌గా నిలపాలని సీఎం సూచించారు. రాష్ట్రంలో ప్రస్తుతం 31.33 శాతంగా ఉన్న గ్రీన్ కవర్‌ను... 2030 నాటికి 37 శాతానికి, 2047 కల్లా 50 శాతానికి పెంచేలా ప్రణాళికలు రూపొందించాలన్నారు. సమీక్షలో మంత్రి నారాయణ, పీసీబీ చైర్మన్ కృష్ణయ్య, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభి, ఎంఏయూడీ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేష్ కుమార్, పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్, ఎంఏయూడీ కమిషనర్ సంపత్ కుమార్, పంచాయతీరాజ్ శాఖ డైరెక్టర్ కృష్ణ తేజ, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఆర్టీజీఎస్ సీసీటీవీ 360 నమ్మకైన నేస్తం



**ప్రజల భద్రతకు సర్వైలెన్సు వ్యవస్థ భరోసా**

**రోజుల వ్యవధిలోనే ముగ్గురు బాలల ఆచూకీ కనుగొన్న సీసీకెమెరాలు**

**యలమంచిలిలో ఇద్దరు, అనంతపురంలో ఒకర్ని కనిపెట్టిన కెమెరాలు**

**తప్పిపోయిన చిన్నారులను తల్లిదండ్రులకు అప్పగించిన పోలీసులు**

**అమరావతి: ఏప్రిల్ 17 :** ప్రభుత్వం ఏర్పాటు చేసిన సర్వైలెన్సు కెమెరాలు ప్రజా భద్రతకూ భరోసా కల్పించే దిశగా కీలక పాత్ర పోషిస్తున్నాయి. ఇంటి నుంచి తప్పిపోయిన చిన్నారుల ఆచూకీ కనిపెట్టి, వారిని వారి కుటుంబసభ్యులకు అప్పగించడంలో ఆర్టీజీఎస్‌లోని సీసీటీవీ360 వ్యవస్థ పోలీసులకు కీలక సహకారం అందిస్తోంది. రోజుల వ్యవధిలోనే ఇలా తప్పిపోయిన ముగ్గురు చిన్నారుల ఆచూకీ కనుగొనడంలో పోలీసులకు సీసీటీవీ360 వ్యవస్థ సహకరించి ఆ పిల్లలను వారి కుటుంబసభ్యుల చెంతకు మళ్లీ చేరేలా తోడ్పాటు అందించింది. అనకాపల్లి జిల్లా యలమంచిలి పట్టణంలో తప్పిపోయిన ఇద్దరు బాలురను ఆర్టీజీఎస్ సీసీటీవీ 360 సహకారంతో పోలీసులు రియల్ టైములో పట్టుకుని ఆ పిల్లలను వారి కుటుంబ సభ్యులకు అప్పగించిన సంఘటన ఇది. ఒక ప్రైవేటు పాఠశాలలో చదువుతున్న ఈ ఇద్దరు బాలురు స్నేహితులు. వీరు కనిపించకుండా పోయారని 15వ తేదీ యలమంచిలి పోలీసులకు వారి తల్లిండ్రుల నుంచి ఫిర్యాదు అందింది. దీనిపై స్పందించిన పోలీసులు వీరి ఆచూకీ కనుగొనడానికి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయడంతో పాటు సీసీ కెమెరాల ద్వారా వీరి ఆచూకీని కనుగొని సహకారం అందించాలని పోలీసులు ఆర్టీజీఎస్‌లోని సీసీటీవీ360 విభాగాన్ని కోరారు. తప్పిపోయిన బాలురకు సంబంధించి పోలీసులు ఇచ్చిన ఫొటోలను ఆర్టీజీఎస్ సీసీటీవీ360లో అప్ లోడు చేశారు. వీటిని ఏఐ ఆధారిత సీసీకెమెరాల ద్వారా విశ్లేషిస్తూ ఈ బాలుర కదలికలను రియల్ టైములో ట్రాక్ చేసి కనుగొన్నారు. ఈ ఇద్దరు విశాఖపట్నం నగరంలో ఉన్నట్లుగా అక్కడి సీసీ కెమెరాలు గుర్తించి ఆర్టీజీఎస్ సీసీటీవీ360 ద్వారా పోలీసులకు రియల్ టైములో అలర్టులు పంపాయి. విశాఖనగరంలో వీరిద్దరు ఫలాన చోటున ఉన్నారనే సమాచారం అందించాయి. దీంతో పోలీసులు అప్రమత్తమై అక్కడికి చేరుకుని ఆ ఇద్దరు చిన్నారులను పట్టుకుని వారిని వారి కుటుంబ సభ్యులకు తిరిగి అప్పగించారు. అనంతపురంలో జిల్లాలోనూ ఇలాగే తప్పిపోయిన బలుడ్ని ఆర్టీజీఎస్ సీసీటీవీ360 సాంకేతిక సహకారంతో పోలీసులు సకాలంలో పట్టుకుని అతడ్ని వారి కుటుంబ సభ్యలకు తిరిగి అప్పగించగలిగారు. అనంతపురం పట్టణంలో తమ బిడ్డ తప్పిపోయాడని బాలుడి తల్లిదండ్రులు ఈ నెల 11న పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఈ పిల్లాడి ఆచూకీ కనుగొనడానికి ఆర్టీజీఎస్ సీసీటీవీ360 విభాగం సహకరాం కోరారు. ఆ పిల్లాడికి సంబంధించిన ఫొటోని ఆర్టీజీఎస్ సీసీటీవీ360లో అప్‌లోడు చేసి ఆ పిల్లాడి కదలికలను ఆన్‌లైన్‌లో ట్రాక్ చేశారు. సీసీటీవీ360లోని పర్సన్ ఆఫ్ ఇంట్రెస్ట్ (పీఓఐ) సాంకేతిక విశ్లేషణ ద్వారా ఆ బాలుడు హైదరాబాద్‌వైపు వెళుతున్నాడని ఆర్టీజీఎస్ రియల్ టైము అలర్టులను పోలీసులకు అందజేసింది. దీంతో పోలీసులు సకాలంలో ఆ బాలుడ్ని పట్టుకుని వారి కుటుంబ సభ్యులకు అప్పగించగలిగారు.

**సత్ఫలితాలిస్తున్న సాంకేతికత**

ఆర్టీజీఎస్‌లోని సీసీటీవీ360 విభాగంలో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్సు సాంకేతిక తప్పిపోయిన వారి ఆచూకీ కనుగొనడంలో సత్ఫలితాలు సాధిస్తోంది. అలాగే రాష్ట్రంలో నేరస్థులను, చోరీకి గురైన వాహనాల ఆచూకీ కనుగొనడానికి కూడా ఇప్పుడు పోలీసులు ఈ సాంకేతిక సహకారాన్ని విరివిగా వినియోగించుకుంటున్నారు. కేసుల దర్యాప్తులో పోలీసులకు అవసరమైన సాంకేతిక సహకారం అందిస్తూ ఆర్టీజీఎస్ సీసీటీవీ360 విభాగం సత్ఫలితాలు సాధిస్తోంది.

# ఎక్సైజ్ పాలసీలో మార్పులు

**ప్రజలకు నాణ్యమైన మద్యం సరఫరా**

**జగన్ హయాంలో కల్తీ మద్యానికి 30వేల మంది మృతి**

**ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర వెల్లడి**

**గుంటూరు, ఏప్రిల్ 17 :** రాష్ట్రంలో ఎక్సైజ్ శాఖలో గణనీయమైన మార్పులు తీసుకువచ్చామని మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మద్యం నియంత్రణ, నాణ్యత విషయంలో ప్రత్యేక చర్యలు చేపట్టామని పేర్కొన్నారు. వైసీపీ పాలనలో రాష్ట్రంలో నాసిరకం మద్యం సేవించి అనేక మంది అనారోగ్యానికి గురయ్యారని, దాదాపు 30 వేల మంది ప్రాణాలు కోల్పోయారని అన్నారు. జగన్ రెడ్డి పాలనలో సరైన బ్రాండ్లు అందుబాటులో లేక ప్రజలు ఇతర రాష్ట్రాల నుంచి మద్యం తెచ్చుకుని తాగాల్సి వచ్చిందని విమర్శించారు. దేశంలోనే అతిపెద్ద మద్యం స్కామ్ వైసీపీ ప్రభుత్వంలోనే జరిగిందని, దాదాపు రూ.3,500 కోట్ల అవినీతి జరిగిందని ఆరోపించారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం మద్యం నియంత్రణలో కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని గుంటూరు, కాకినాడ, విశాఖపట్నం, చిత్తూరు ప్రాంతాల్లో అత్యాధునిక ల్యాబ్‌లను ఏర్పాటు చేశామని తెలిపారు. మద్యం నాణ్యతను పరీక్షించి, ప్రజలకు హానికరంగా ఉన్న బ్రాండ్లను పూర్తిగా తొలగించినట్లు చెప్పారు. ప్రజలు విచ్చలవిడిగా మద్యం సేవించకుండా ఉండేందుకు వైన్ షాపుల్లో ప్రత్యేక గదుల (రూమ్) అనుమతులు కూడా ఇచ్చామని మంత్రి వివరించారు. ప్రజల ఆరోగ్యం, భద్రత దృష్ట్యా మద్యం విధానంలో మరి న్ని మార్పులు తీసుకురావడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి కొల్లు రవీంద్ర స్పష్టం చేశారు.



# 23లోగా ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు పరిష్కరించండి



**అమరావతి, ఏప్రిల్ 17 :** రాష్ట్ర టౌన్ ప్లానింగ్ అధికారులు, మున్సిపల్ కమిషనర్లతో మంత్రి నారాయణ టెలికాన్ఫరెన్స్ నిర్వహించి ఎల్ఆర్ఎస్ (లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీమ్) దరఖాస్తుల అనుమతులపై సమీక్ష చేపట్టారు. ఈ సమావేశంలో మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్ కుమార్‌తో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. అనధికార లేఅవుట్ల క్రమబద్ధీకరణకు అర్హత ఉన్న అన్ని దరఖాస్తులను తక్షణమే ఆమోదించాలని మంత్రి ఆదేశించారు. దరఖాస్తుదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పెండింగ్‌లో ఉన్న అప్లికేషన్లను వెంటనే క్లియర్ చేయాలని సూచించారు. లేఅవుట్ క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకునే గడువు ఈ నెల 23తో ముగియనున్న నేపథ్యంలో అధికారులు వేగంగా చర్యలు తీసుకోవాలని మంత్రి పేర్కొన్నారు.

# నిడదవోలులో ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటన

**స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో పాల్గొననున్న సీఎం**

**అమరావతి, ఏప్రిల్ 17:** తూర్పు గోదావరి జిల్లా, నిడదవోలులో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శనివారం పర్యటించనున్నారు. నిడదవోలులో స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో పాల్గొననున్నారు. ప్రతీ నెలలో 3వ శనివారం చేపట్టే స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని ఒక్కో థీమ్‌తో నిర్వహిస్తున్నారు. ఇందులో బాగంగా ఈ నెల 'జలధార-జలహారతి' థీమ్‌తో కార్యక్రమాన్ని చేపడుతున్నారు. నీటి ఆవశ్యకతను వివరించేందుకే ఈ థీమ్‌ను ప్రభుత్వం ఎంచుకుంది.

**చంద్రబాబు పర్యటన వివరాలు**

నిడదవోలులో నిర్వహించే స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో పాల్గొనేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు అమరావతి నుంచి ఉదయం 10.30 గంటలకు బయలుదేరుతారు. 11.00 గంటలకు నిడదవోలు చేరుకుంటారు. 11.20 గంటలకు సుబ్బరాజుపేటలో ఏర్పాటు చేసిన ప్రజావేదిక సభలో పాల్గొని ప్రసంగిస్తారు. మధ్యాహ్నం 01.50 గంటలకు మలకోడు సరస్సును సందర్శించి స్థానికులు, శాస్త్రవేత్తలు, నిపునులతో ఇంట్రాక్ట్ అవుతారు. 02.30 గంటలకు ఎస్టీ అంబ్రోస్ స్కూలు సమీపంలో నిడదవోలు నియోజకవర్గ టీడీపీ శ్రేణులతో సమీక్షా సమావేశం నిర్వహిస్తారు. సాయంత్రం 04.45 గంటలకు అమరావతికి చేరుకుంటారు.






# ప్రతిష్టకు భంగం కలిగేలా పోస్టులు పెడితే ఎలా?

## సజ్జల భార్గవరెడ్డిపై హైకోర్టు ఆగ్రహం

**అమరావతి, ఏప్రిల్ 17:** ఇతరుల గౌరవ ప్రతిష్ఠలను దెబ్బతీసే హక్కు ఎవరికీ లేదని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. వైసీపీ సోషల్ మీడియా మాజీ ఇన్‌చార్జ్ సజ్జల బార్గవ్ రెడ్డి, ఇతర నిందితులది ఆనాగరిక, ఆటవిక ప్రవర్తన అని ఆగ్రహించింది. ఈ క్రమంలో భార్గవ్ రెడ్డిపై న్యాయస్థానం తీవ్ర వ్యాఖ్యలు చేసింది. తనపై జారీ చేసిన ఎల్‌ఓసీని రద్దు చేయాలని కోరుతూ సజ్జల భార్గవ్ రెడ్డి వేసిన పిటిషన్‌పై హైకోర్టులో శుక్రవారం విచారణ జరిగింది. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రుల కుటుంబ సభ్యుల ప్రతిష్ఠకు భంగం కలిగించే పోస్టులు ఎలా పెడతారని న్యాయస్థానం ప్రశ్నించింది. వాక్ స్వాతంత్రం, భావవ్యక్తీకరణ స్వేచ్ఛకు పరిమితులు ఉన్నాయని హైకోర్టు స్పష్టం చేసింది. దర్యాప్తును సక్రమంగా చేసి నిందితులకు శిక్షపడేలా చేయాలని పోలీసులను ఆదేశించింది. దర్యాప్తునకు సహకరించాలని పిటిషనర్‌కు ఆదేశాలు జారీ చేసింది. కోరినప్పుడు విచారణకు హాజరు అవుతానని అఫిడవిట్ వేయాలని న్యాయస్థానం ఆదేశించింది. ఎల్‌ఓసీని రీ కాల్ చేయాలని అన్నమయ్య జిల్లా ఎస్పీకి కోర్టు ఆదేశాలు జారీ చేసింది. అభ్యర్ధన వచ్చిన వెంటనే ఎల్‌ఓసీని రద్దు చేయాలని ఇమిగ్రేషన్ అధికారులకు ఏపీ హై కోర్టు ఆదేశించింది.

# రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్‌గా అనిల్ చంద్ర పునేఠా

## నియామకానికి గవర్నర్ ఆమోద ముద్ర



**అమరావతి, ఏప్రిల్ 17:** రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్‌గా రిటైర్డ్ ఐఏఎస్ అధికారి అనిల్ చంద్ర పునేఠా నియామకానికి ఆమోదం లభించింది. రాష్ట్ర ప్రభుత్వం పంపిన ప్రతిపాదనకు గవర్నర్ అబ్దుల్ నజీర్ ఆమోద ముద్ర వేశారు. అనిల్ చంద్ర పునేఠాను ఎస్‌ఈసీగా నియమిస్తూ ప్రభుత్వం జీఓను విడుదల చేయనుంది. అనిల్ చంద్ర పునేఠా గతంలో రాష్ట్ర ముఖ్య కార్యదర్శిగా పని చేశారు. ప్రస్తుతం ఆయన విజిలెన్స్ కమిషనర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. గవర్నర్ ఆమోదం లభించడంతో ప్రభుత్వం అధికారిక జీఓ జారీ చేసి.. అనిల్ చంద్ర పునేఠాకు పూర్తి బాధ్యతలు అప్పగించనుంది. పంచాయతీలు, మున్సిపాలిటీలు, జిల్లా పరిషత్తుల ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఈ నియామకం ఎంతో ప్రాధాన్యత సంతరించుకుంది. అనిల్ చంద్ర పునేఠా ఐఏఎస్ 1984 బ్యాచ్ అధికారి. రాష్ట్రంలో వివిధ కీలక శాఖల్లో పని చేసిన అనుభవం ఆయనకు ఉంది. గతంలో కొన్ని సందర్భాల్లో ఎన్నికల సంబంధిత బాధ్యతలు కూడా నిర్వహించిన విషయం తెలిసిందే. జీఓ విడుదలైన వెంటనే అధికారికంగా రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌గా అనిల్ చంద్ర పునేఠా బాధ్యతలు చేపట్టనున్నారు.

# జస్టిస్ శ్రీనివాస్‌కు ఘన వీడ్కోలు

## హైకోర్టు ఫుల్ బెంచ్ ఆధ్వర్యంలో కార్యక్రమం



**అమరావతి, ఏప్రిల్ 17:** ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి. శ్రీనివాస్ పదవీ విరమణ సందర్భంగా హైకోర్టులో ఘనంగా వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరాజ్ సింగ్ ఠాకూర్ ఆధ్వర్యంలో ఫుల్ బెంచ్ ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది. హైకోర్టు మొదటి కోర్టు హాల్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ జస్టిస్ వి. శ్రీనివాస్‌ను నిబద్ధత కలిగిన న్యాయమూర్తిగా కొనియాడారు. ఆయన కృష్ణాజిల్లా తిరువూరులో 1964 ఏప్రిల్ 18న జన్మించారని, 1988లో నూజివీడు బార్ కౌన్సిల్‌లో న్యాయవాదిగా తన వృత్తిని ప్రారంభించారని తెలిపారు. 2022 ఆగస్టు 4న హైకోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారని గుర్తుచేశారు. తన పదవీకాలంలో అనేక కీలక తీర్పులు ఇచ్చి న్యాయవ్యవస్థకు విశేష సేవలు అందిం చారని పేర్కొన్నారు. జిల్లా మరియు సెషన్స్ జడ్జిగా, రిజిస్ట్రార్‌గా కూడా వివిధ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించినట్లు తెలిపారు. పదవీ విరమణ అనంతరం ఆయన ఆయురారోగ్యాలతో ప్రశాంత జీవితం గడపాలని ఆకాంక్షించారు. అడిషినల్ సోలిసిట ర్ జనరల్ చల్లా ధనుంజయ్, అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్, హైకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రభునాథ్ వాసిరెడ్డి తదితరులు జస్టిస్ వి. శ్రీనివాస్ సేవలను స్మరించుకున్నారు. పదవీ విరమణ సందర్భంగా జస్టిస్ శ్రీనివాస్ తనకు సహకరించిన సహచర న్యాయమూర్తులు, న్యాయవాదులు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. విద్యా ర్థి దశ నుంచి న్యాయవాదిగా, న్యాయమూర్తిగా ఎదగడంలో మార్గనిర్దేశం చేసిన గురువుల కు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు న్యాయమూర్తులు, అదనపు అడ్వకేట్ జనరల్ సాంబశివ ప్రతాప్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.



# రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరు బాధ్యతగా వ్యవహరించాలి

## - అదనపు డీజీపీ స్వాతి లక్రా



**వికారాబాద్, ఏప్రెల్,17(సమయం న్యూస్) :** 99 రోజుల పాటు నిర్వహించే ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా శుక్రవారం శ్రీసాయి దంత వైద్య కళాశాలలో “అరైవ్ అలైవ్” కార్యక్రమంలో భాగంగా మాదకద్రవ్యాల నిర్మూలన, రోడ్డు భద్రత, అత్యవసర సమయాల్లో సిపిఆర్ చేయడంపై లారీ, ఆటో డ్రైవర్ లు, అంగన్ వాడి, ఆశా వర్కర్లు, విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన అదనపు డీజీపీ స్వాతి లక్రా, జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ, జిల్లా ఎస్పీ స్నేహమేహర జ్యోతి ప్రజ్వలన గావించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అదనపు డీజీపీ స్వాతి లక్రా మాట్లాడుతూ... రాష్ట్రంలో మద్యపానం సేవించి అతివేగంగా వాహనాలు నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయన్నారు. రోడ్డు ప్రమాదాలను నివారించేం దుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన “అరైవ్ అలైవ్” కార్యక్రమంలో భాగంగా గ్రామస్థాయి నుండి రోడ్డు ప్రమాదాలపై అవగాహన కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని ఆమె తెలిపారు. హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించని కారణంగా అదేవిధంగా నిబంధనలు పాటించకుండా డ్రైవింగ్ చేసే క్రమంలో రోడ్డు ప్రమాదాల్లో తమ విలువైన ప్రాణాలను కోల్పోతున్నారని ఆమె అన్నారు. ఎదుటివారి తప్పిదాల వల్ల కూడా రోడ్డు ప్రమాదాలు జరుగుతాయని దీన్ని దృష్టిలో పెట్టుకుని వాహనాలను వేగంగా నడపకూడదని ఆమె సూచించారు. సోషల్ మీడియాలో వస్తున్న

సామాజికపర అంశాలను తెలుసుకొని అందరికీ చేర వేసే విధంగా యువత బాధ్యత తీసుకొని అవగాహన కల్పించాలని ఆమె సూచించారు. సిపిఆర్ పై ప్రతి ఒక్కరికి తెలిసే విధంగా గ్రామాల్లో అవగాహన కల్పించాలని ఆమె తెలిపారు. జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ మాట్లాడుతూ... రోడ్డు ప్రయాణాల్లో గమ్యం ముఖ్యం కాదని విలువైన జీవితం ముఖ్యమనే విషయాన్ని గుర్తించాలన్నారు. రోడ్డు ప్రమాదాల్లో 2025 సంవత్సరానికి లక్ష 50 వేల మంది మరణించారని కలెక్టర్ తెలిపారు. కుటుంబ యజమాని మరణించినట్లయితే ఆ కుటుంబం ఎంతగానో నష్టపోతుందని కలెక్టర్ తెలిపారు. డ్రైవింగ్ విషయంలో జాగ్రత్తలు తీసుకుంటే ప్రమాదాలు అరికట్టవచ్చని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో రోడ్డు భద్రత కమిటీలను వేయడం జరిగిందని, ప్రతినెల రోడ్డు భద్రతపై సమావేశాలు నిర్వహించి ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. మత్తు పదార్థాలు సేవించి వాహనాలు నడపడంతో రోడ్డు ప్రమాదాల జరుగుతున్నాయన్నారు. ప్రజా ప్రయోజనాల కోసం పాలనపరంగా తమ సహకారాలు అందిస్తామని కలెక్టర్ తెలిపారు. యువత మత్తు పదార్థాలకు బానిసలై భవిష్యత్తు నాశనం కాకుండా మంచి సమాజ నిర్మాణానికి అందరి సహకారం అవసరమని అందుకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని కలెక్టర్ తెలిపారు. జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా మాట్లాడుతూ...రోడ్డు ప్రమాదాలను తగ్గించడానికి ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించడం ప్రతి వాహనదారుడి బాధ్యత అన్నారు. సంపాదించే వ్యక్తి చనిపోతే కుటుంబం పూర్తిగా ఇబ్బందికి గురవుతుందని ఆమె తెలిపారు. ముఖ్యంగా వాహనం నడిపే సమయంలో స్పష్టమైన కంటి చూపు ఉండటం అత్యంత అవసరమని, చిన్నపాటి నిర్లక్ష్యం కూడా ప్రాణాంతక ప్రమాదాలకు దారి తీస్తుందని అందుకు ఉచిత శిబిరాలను ఏర్పాటుచేసి డ్రైవర్ లందరికీ కంటి పరీక్షలు నిర్వహించి కళ్ళ అద్దాలను ఇవ్వడం జరుగుతుందని ఆమె తెలిపారు. ముందుగా దంత వైద్య కళాశాల విద్యార్థిని, విద్యార్థులు నిర్వహించిన శాస్త్రీయ నృత్యాలు, డ్రగ్స్ తీసుకుంటే కలిగే అనర్థాలపై చేసిన నాటక ప్రదర్శనలు నిర్వహించారు. రోడ్డు ప్రమాదాలు, ట్రాఫిక్ నిబంధనలపై తీసిన లఘు చిత్రం ద్వారా అవగాహన కల్పించడం జరిగింది. ఈ సందర్భంగా అత్యవసర సమయాల్లో సేవలందించిన 108 సిబ్బంది పవన్ కుమార్, వైద్య రంగంలో ఉత్తమ సేవలందిస్తున్న డాక్టర్ సౌమ్య, డాక్టర్ రోహిత్, పోలీస్ కళాజాత బృందం అశోక్ లను అతిథులు శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ బి.రాములు నాయక్, వైస్ ప్రిన్సిపాల్ సంపత్ రెడ్డి, జిల్లా వివిధ శాఖల అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# డంపింగ్ యార్డ్ వద్దు... మా గ్రామాన్ని కాపాడండి!”

**చేవెళ్ల,ఏప్రిల్ 17 ( సమయం న్యూస్) :** చేవెళ్ల మండల పరిధిలోని కమ్మేట గ్రామంలో ప్రతిపాదించిన డంపింగ్ యార్డ్‌పై గ్రామస్తుల నిరసనలు మరింత ఉధృతమయ్యాయి. సర్వే నంబర్ 222లో డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేయాలని తెలిసిన నేపథ్యంలో గ్రామ ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో చిన్నా పెద్దలు తేడా లేకుండా యువకులు, గ్రామస్తులు అందరూ ఏకమై ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నారు. గత వారం రోజులుగా కలెక్టర్, ఆర్డీవో, ఎమ్మార్వోలను కలిసి వినతి పత్రాలు సమర్పిస్తూ సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు. రిలే నిరాహార దీక్షలు ప్రారంభించినారుడంపింగ్ యార్డ్‌ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ గ్రామస్తులు శుక్రవారం నుంచి రిలే నిరా హార దీక్షలు చేపట్టారు. ఈ క్రమంలో అధికారులు ఆర్డీవో ఎమ్మార్వో గ్రామ ప్రజలు వెళ్లి కలవగా స్పందించి, డంపింగ్ యార్డ్‌ను మరో ప్రాంతానికి మార్చే అంశాన్ని పరిశీలిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిసింది. ఆరోగ్య సమస్యలపై భయం డంపింగ్ యార్డ్ వల్ల గ్రామంతో పాటు పరిసర గ్రామాల్లో కాలుష్యం, దుర్వాసన, అనారోగ్య సమస్యలు వస్తాయని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చుట్టుపక్క ల గ్రామాల ప్రజలు కూడా పెద్ద సంఖ్యలో మద్దతు తెలిపారు గొల్లగూడెం గ్రామ సర్పంచ్ ఉప సర్పంచ్ గ్రామస్తులు మద్దతు తెలిపారు డంపింగ్ యార్డ్ ప్రతిపాదనను పూర్తిగా రద్దు చేయాలని స్పష్టం చేశారు. తమ ఆందో ళనలు కొనసాగుతాయని గ్రామ మా జీ సర్పంచ్లు ఎం పీటీసీ లు ఉపసర్పంచ్ విష్ణు గౌడ్ వార్డు మెంబర్లు యువకులు పెద్దలు హెచ్చరించారు.



# బాధ్యతారహితంగా రాహుల్ ప్రసంగం

## • వైద్యశాఖమంత్రి సత్య కుమార్ యాదవ్ ఆగ్రహం



**విజయవాడ, ఏప్రిల్ 17:** నారీ శక్తీ వందనం బిల్లుపై పార్లమెంట్‌లో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అత్యంత బాధ్యతారహితంగా మాట్లాడారని ఏపీ వైద్యశాఖమంత్రి సత్య కుమార్ యాదవ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళా సాధికారిత బిల్లుపై, మహిళల అభివృద్ధి గురించి మాట్లాడమంటే ప్రధానమంత్రి నరేంద్రమోదీపై అవహేళనగా మాట్లాడారని ధ్వజమెత్తారు. ఒక దేశ ప్రధానిని పట్టుకుని జాదూఘర్, ఓ మ్యాజిషన్ అని, ఓ సైనిక శక్తిని అవహేళన చేసేలా రాహుల్ గాంధీ మాట్లాడారని.. ఈ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. రాహుల్ గాంధీ.. మోదీపై చేసిన వ్యాఖ్యలను వెంటనే వెనక్కు తీసుకుని క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. దేశ ప్రజలందరికీ రాహుల్ ఫ్రస్టేషన్ అనేది తేటతెల్లమవుతుందని మంత్రి సత్య కుమార్ యాదవ్ విమర్శించారు. ఓ ప్రతిపక్ష నేతగా ఉండాల్సిన అర్హతలు రాహుల్ గాంధీకి ఏమాత్రం లేవని ఎద్దేవా చేశారు. దేశ ప్రధాని మోదీ డెసిషన్, లీడర్ షిప్‌ని ప్రజలందరూ చూశారని వ్యాఖ్యానించారు. దేశ అభివృద్ధి కళ్లముందు కనిపిస్తోందని చెప్పుకొచ్చారు. అంతర్జాతీయంగా భారతదేశానికి ఖ్యాతి తీసుకొచ్చేలా ప్రధాని మోదీ చర్యలు చేపట్టారని ఉద్ఘాటించారు. మన సైనిక శక్తిని, దేశ భద్రతను అవమానించే విధంగా రాహుల్ గాంధీ మాట్లాడటం అత్యంత హేయమని ఆగ్రహించారు. పాకిస్థాన్‌కు గుణపాఠం చెప్పేలా ప్రధాని మోదీ అనేక కీలక నిర్ణయాలు తీసుకున్నారని ప్రస్తావించారు. సైనికుల బలం మన దేశ భద్రత సత్తా ఏంటో తెలిసి పాకిస్థాన్ కూడా తమపై దాడులు జరిగాయని ఒప్పుకుందని మంత్రి సత్య కుమార్ యాదవ్ అన్నారు. అలాంటి దేశ భద్రతపై, సైనికులను కించపరిచే విధంగా వ్యాఖ్యలు చేశారని తెలిపారు. ఏ శక్తివంతమైన దేశానికి మన దేశం తీసిపోకుండా చేశారని చెప్పారు. నల్లధనాన్ని కట్టడి చేసినందుకు దేశ ప్రజలందరూ స్వాగతించారని అన్నారు. ప్రజల విజ్ఞతను రాహుల్ గాంధీ ప్రశ్నిస్తున్నారా..? అని దుయ్యబట్టారు. ఎవరి హయాంలో ఎలా పాలనా సాగిందో ప్రజలందరూ మర్చిపోలేదని చెప్పారు. 2జీ స్కాం దగ్గర నుంచి కోల్ స్కాం వరకు లక్షల కోట్లు ఏవిధంగా దోచుకున్నారో అందరికీ తెలుసునని అన్నారు. మహిళల సాధికారత కోసం తీసుకొస్తున్న బిల్లును వ్యతిరేకించటం రాహుల్ గాంధీ మనస్తత్వం ఏంటో అర్థమవుతుందని విమర్శించారు. అవినీతి, ఆరోపణ లేకుండా అత్యంత పారదర్శకంగా మోదీ పాలన అందిస్తున్నారని మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు.

# హజ్ యాత్రకు సర్వం సిద్ధం

## గన్నవరం నుంచి తొలి విడత ప్రయాణం రేపు ప్రారంభం



**విజయవాడ, ఏప్రిల్ 17:** రాష్ట్రం నుంచి హజ్ యాత్రకు వెళ్లే భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. గన్నవరం నుంచి రేపు ఉదయం తొలి విడత యాత్రికుల ప్రయాణాన్ని మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్.ఎమ్.డీ ఫరూక్ జెండా ఊపి ప్రారంభించనున్నారు. రాష్ట్ర విభజన అనంతరం గన్నవరం నుంచి హజ్ యాత్ర నిర్వహించడం ఇదే తొలిసారి కావడం విశేషం. యాత్రికుల ప్రయాణం సురక్షితంగా, సాఫీగా సాగేందుకు ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకున్నట్లు మంత్రి తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మార్గదర్శకత్వంలో మైనార్టీల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తూ అన్ని సదుపాయాలు కల్పించినట్లు చెప్పారు. ఈ ఏడాది రాష్ట్రం నుంచి మొత్తం 2005 మంది హజ్ యాత్రికులు పవిత్ర మక్కా, మదీనా యాత్రకు వెళ్లనున్నారు. విజయవాడ ఎంబార్కేషన్ పాయింట్ నుంచి రెండు విడతలుగా 335 మంది ప్రయాణిస్తారు. ఇందులో తొలి విడతగా రేపు 160 మంది, రెండో విడతగా ఆదివారం 175 మంది బయలుదేరనున్నారు. గన్నవరం ఎస్‌ఎమ్ కన్వెన్షన్ సెంటర్‌లో యాత్రికుల కోసం సమగ్ర ఏర్పాట్లు చేశారు. వసతి, భోజనం, తాగునీరు, విశ్రాంతి కోసం మంచాలు, ఎయిర్ కూలర్లు, మొబైల్ టాయిలెట్లు వంటి సదుపాయాలు కల్పించారు. ఎయిర్‌పోర్ట్ నిబంధనలకు అనుగుణంగా లగేజ్ ప్యాకింగ్, గుర్తింపు కార్డుల జారీ కోసం ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని ఎయిర్ కండిషనింగ్ సౌకర్యాలు కూడా అందుబాటులో ఉంచారు. యాత్రికుల ఆరోగ్య భద్రత కోసం ప్రత్యేక వైద్య కేంద్రం, భద్రత కోసం పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. విదేశీ మారకద్రవ్య అవసరాల కోసం తాత్కాలిక బ్యాంక్ సేవలను కూడా అందుబాటులోకి తెచ్చారు. ఈ ఏడాది హజ్ యాత్రికుల్లో సగానికి పైగా మహిళలు ఉండటం విశేషం. వారి సౌకర్యాల కోసం ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. యాత్రికులకు అవసరమైన సూచనలు, శిక్షణ హజ్ కమిటీ ద్వారా అందిస్తున్నారు. సుమారు 40 నుండి 45 రోజుల పాటు సాగే ఈ పవిత్ర యాత్రలో యాత్రికులు సురక్షితంగా తిరిగి రావాలని ప్రభుత్వం ఆకాంక్షిస్తోంది. శిబిరం నుంచి విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకునేందుకు ప్రత్యేక ఏసీ బస్సులను ఏర్పాటు చేశారు.